

గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ప్రభుత్వ రద్దు గండం నుండి బయటపడిన నెతన్యాహూ

అణుభద్రత చర్యల్లో ఇరాన్ విఫలం

దక్షిణాఫ్రికాలో వరదలు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 193 | శుక్రవారం | 13 -06-2025 | కరీంనగర్

Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar**


పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## టేకాఫ్ అయిన సెకండ్లలోనే

# కుప్పకూలిన విమానం

## 241 మంది దుర్మరణం

### మృతుల్లో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ





విజయ్ రూపానీ


- మెడికల్ కాలేజీపై పడిన విమానం
- 25 మంది డాక్టర్లు, మెడికోల విషాద మరణం
- అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం
- ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఒకరు కెనడా, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులు
- ప్రమాద స్థలిని పరిశీలించిన కేంద్ర మంత్రులు అమిత్‌షా, రామ్మోహన్ నాయుడు



### గుజరాత్ అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదం

**మృత్యుంజయుడు**





ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. అందులో 11ఎ సీట్లో ప్రయాణిస్తున్న విశ్వాస్ కుమార్ రమేశ్ అనే ఏకైక వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. అయన లేచి నడుచుకుంటూ వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**అహ్మదాబాద్ :** గుజరాత్‌లో ఘోర విమానం ప్రమాదం జరిగింది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం (నెంబర్ ఎఐ 171) రద్దీగా ఉండే నివాస ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన నిమిషం లోపే దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మరణించిన లేదా గాయపడిన వారి సంఖ్య అధికారికంగా ధృవీకరించలేదు. అయితే గుజరాత్ మాజీ సిఎం, బిజెపి నేత విజయ్ రూపానీ కూడా విమానంలో ప్రమాదంలో మరణించారు. వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం మేఘానినగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలోని సిటీ సివిల్ హాస్పిటల్, బిజె మెడికల్ కాలేజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస గృహాల సమీపంలో విమానం కూలిపోయింది. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో మెస్‌లో ఆహారం, ప్లేట్లు చిందరవందరగా పడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. విమానం శకలాలు భవనాలపై పడడంతో అవి దెబ్బతిన్నాయి. కొంతమంది డాక్టర్లు కూడా మృతి చెందినట్లు తరువాయి 2లో

'అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా కలత చెందాను. ఇది హృదయ విదారకర ఘటన. దీనిపై మాటలు రావట్లేదు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుంది'
– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

'అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదం. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా'
– ప్రధాని నరేంద్ర మోదీ

'విమాన ప్రమాదం వార్త వినగానే హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణణాతీతం. ఈ క్లిష్ట సమయంలో ప్రతి క్షణం, ప్రతి క్షణం విలువైనదే. సహాయకచర్యలు వేగంగా జరగాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సాయం చేయడానికైనా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి'
– ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

'లండన్ గాట్విక్‌కు బయల్దేరిన విమానం ప్రమాదానికి గురైన ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం'
– బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

'అహ్మదాబాద్ విమాన ప్రమాదం మహా విషాదం. ప్రమాద ఘటన నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రధాని మోదీ ఫోన్ చేసి ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే నేను విజయవాడ నుంచి నేరుగా బయల్దేరి వచ్చాను. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. అన్ని కోణాల్లో లోతైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేస్తాం. అధికారులతో సమావేశం అనంతరం మరిన్ని వివరాలు అందిస్తాం. ఈ ప్రమాదానికి బాధ్యులను ఉపేక్షించం'
– కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం కూలడం విచారకరం. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో దాదాపు 200 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే సమాచారం తెలియటంతో అందరూ సురక్షితంగా ఉండాలని ఆయన భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బాధితులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి వీలైనంత వేగంగా సమర్థవంతంగా సహాయక చర్యలను కేంద్రం చేపట్టాలి.
- సిఎం రేవంత్‌రెడ్డి

## ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుల వర్షం

**ఆరుగురు మృతి, 8 మందికి గాయాలు**

ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో పలుచోట్ల పిడుగులు పడి ఆరుగురు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో చేనులో పత్తి విత్తనాలు వేస్తుండగా పిడుగుపడి నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. చేనులో ఉన్న మరో ఎనిమిది మంది పిడుగుపాటుతో గాయపడ్డారు. అటూ బేల మండలంలోను ఇద్దరు మృతి చెందారు. బేల మండలంలోనీ సాంగ్డి గ్రామంలో గెడం నందిని, సోన్‌కాస్ గ్రామంలో కోవ సునీత చేనులో విత్తనాలు వేస్తుండగానే ఈ ఇద్దరు పిడుగుపాటుతో మృతి చెందారు. గాదిగూడ మండలంలోని పిప్పిరి గ్రామంలోనూ తరువాయి 2లో



## ఇరిగేషన్ ఇఇ శ్రీధర్ ఆస్తులు రూ.200 కోట్లపైనే



- అరెస్టయిన శ్రీధర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించిన ఎసిబి
- సంపాదన అంతా కాళేశ్వరం పనుల్లో దోచుకుందేనని అనుమానిస్తున్న దర్యాప్తు సంస్థ
- కస్టడీ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్న అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు అయిన నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆస్తులు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లకుపైగానే ఉంటాయని అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు తేల్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టు చేసిన శ్రీధర్‌ను ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. తెలంగాణలో 13 ప్రాంతాలలో ఎసిబి అధికారులు సోదాలు చేయగా దిమ్మతిరిగే ఆస్తు లు బయటపడ్డాయి. ఈ సంపాదన అంతా కాళేశ్వరం పనుల్లో దోచుకుందేనని ఎసిబి అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో ఇతన్ని తరువాయి 2లో

## దేవుడి భూములు కబ్జా చేస్తే పిడి యాక్ట్



- మంత్రి కొండా సురేఖ హెచ్చరిక
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో 25 వేల ఎకరాలు కబ్జా చేసారని విమర్శ
- బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూములు పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేసేవారిపై పీడీ యాక్టులు పెడతామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. అసలు దేవాదాయ శాఖకు చెందిన భూములు కబ్జా కాకుండా చూస్తామని ఆమె పేర్కొన్నారు. దేవుడి భూములు పరిరక్షించడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి దేవుడి భూములు కాపాడుతున్నట్టు సురేఖ వివరించారు. గురువారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తరువాయి 12లో




## సంక్షేమ భవన్ ముట్టడి



- గురుకుల విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్
- విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..
- పరిస్థితి ఉద్రిక్తం

ప్రజాపక్షం/హైదరాబాద్

గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. వందలాది మంది విద్యార్థులు సంక్షేమ భవన్‌కు చేరుకోగానే ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి , కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, ఫలితంగా అందులో చదువుతున్న విద్యార్థులు సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. చాలా విద్యాసంస్థలు ఎటువంటి మౌలిక వసతులు లేకపోవడంతో, ప్రహరీ గోడలు, సరైన నిర్మాణాలు లేక పాములు, ఇతర క్రిమికీటకాలు రావడంతో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. సగానికి సగం గురుకుల విద్యాసంస్థలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాల చోట్ల ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో భవనాలకు తాళాలు వేయడంతో విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో తరువాయి 12లో

## ఐదురోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. శనివారం భూపాలపల్లి, ములుగు, తరువాయి 2లో



## భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

- రెవెన్యూ నుండి ఇంధన శాఖకు నవీన్ మిట్టల్
- లోకేశ్ కుమార్‌కు రెవెన్యూ కార్యదర్శి, సిసిఎల్ఎ బాధ్యతలు
- ఐ&పిఆర్ స్పెషల్ కమిషనర్‌గా చెక్కా ప్రియాంక
- హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన
- సిఎం సిపిఆర్‌ఒగా గుర్రం మల్సూర్



నవీన్ మిట్టల్



లోకేశ్ కుమార్



ప్రియాంక

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. వివిధ శాఖలలోని 33 మంది ఐఎఎస్ అధికారులు, ముగ్గురు ఐఎఫ్‌ఎస్ అధికారులు మొత్తం 36 మంది అధికారులను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, న్యూఢిల్లీని తెలంగాణ భవన్‌కు రెసిడెంట్ కమిషనర్‌గా డాక్టర్ శశాంక్ గోయెల్‌ను, ఇంధన శాఖ తరువాయి 2లో

## మారిన జిల్లా ఇన్‌చార్జి మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గంలోకి కొత్తగా ముగ్గురు మంత్రులు రావడంతో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులలో మార్పులు చేర్పులు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా సి.దామెదర రాజనరసింహాను, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్‌ను, నిజామాబాద్‌కు ధనసరి అనసూయ సీతక్కను, కరీంనగర్‌కు తుమ్మల నాగేశ్వర రావును, ఆదిలాబాద్‌కు జూపల్లి కృష్ణారావును నియమించింది. కాగా కొత్తగా మంత్రులుగా నియమితులైన వివేక్ వెంకటస్వామిని మెదక్ జిల్లాకు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్లగొండకు, వాకిటి శ్రీహరిని ఖమ్మం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రులుగా ప్రభుత్వం నియమించింది. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాలలో ప్రజా పాలన కార్యకలాపాలను సమీక్షించి వాటి అమలును పర్యవేక్షిస్తారని ప్రభుత్వం ఉత్తర్వులలో తెలియజేసింది.

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి

- విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి
- పాఠశాలల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం
- ప్రభుత్వం బడులకు పూర్వ వైభవం తీసుకురావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్ష
- సిద్దిపేటలో కెజిబివి పాఠశాల సందర్శన



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తామంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థాయికి వచ్చామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు పునర్ వైభవం తీసుకరావలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. వేసవి సెలవుల అనంతరం స్కూళ్ల పునఃప్రారంభం సందర్భంగా గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కెజిబివి పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. విద్యార్థులతో కలసి అల్పాహారం చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకోసం అన్ని పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. డైట్,కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం,నాణ్యమైన ఆహారం అందిస్తుందన్నారు. పాఠశాలల్లో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణాఫ్రికాలో వరదలు:50 మంది మృతి



**కేప్‌టౌన్ :** దక్షిణాఫ్రికాలో వరదల కారణంగా యాభైమంది మరణించారు. పలువురు గల్లంతయ్యారు. సహాయబృందాలు వారికోసం గాలిస్తున్నాయి. మృతులసంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇతర సహాయ చర్యలు చేపట్టాయి. దక్షిణాఫ్రికా తూర్పుప్రాంతరాష్ట్రంలో భారీవర్షాలు వరద ప్రమాదానికి దారితీశాయి. పూర్తిగా అభివృద్ధిచెందని గ్రామీణ కేప్ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలవల్ల స్కూలు బస్సు కొట్టుకుపోయింది. ఈ బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు పిల్లల జాడ ఇంతవరకూ తెలియలేదని ఈస్ట్రన్ కేప్ గవర్నమెంట్ అధికార ప్రతినిధి ఖుసెల్వా రంత్జీ చెప్పారు. శీతాకాలంలో ఈ విధంగా వర్షాలు, వరదలు, మంచు ప్రమాదాన్ని ఎన్నడూ చూడలేదని సీనియర్ పౌరులు చెబుతున్నారు. నెల్సన్ మండేలా జన్మించిన ఈ కేప్ రాష్ట్రంలో 72 శాతం ప్రజలు ఈనాటికీతీవ్ర పేదరికంలోమగ్గుతున్నారు. ఈ ప్రాంతం ఇప్పటివరకూ ఎంతమాత్రం అభివృద్ధి చెందలేదు.

## ప్రభుత్వ రద్దు గండం నుండి
# బయటపడిన నెతన్యాహూ



### వీగిపోయిన ఇజ్రాయెల్ పార్లమెంటు రద్దు బిల్లు

**టెల్‌అవీవ్ :** ఇజ్రాయెల్ పార్లమెంటును రద్దు చేయాలని కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా 61 మంది ఓటు వేశారు. అనుకూలంగా 53 మంది ఓటు వేశారు. గురువారంనాడు ఈ బిల్లు వీగిపోవడంతో బెంజిమన్ నేతన్యాహూ ప్రభుత్వం ఒక పెద్ద గండం నుండి బయటపడింది. యూదు మతఛాందసపార్టీలు బిల్లుకు మద్దతు ఇవ్వకుండా చివరి నిమిషంలో రాజీపడి వెనక్కు తగ్గాయి. కూటమిలోని షా పార్టీ, యుటిజెలోని డెగల్ హోటరాహ్ వర్గం అధికార లికుడ్ పార్టీతో సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ఒక అంగీకారానికి వచ్చి పార్లమెంటు రద్దు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు అంగీకరించాయి. అంతకుముందు అల్ట్రా ఆర్థోడాక్స్ యూదు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపింది. సైన్యం నుండి మినహాయించే తమ ఐడిఎఫ్ ముసాయిదా బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే అధికార కూటమి నుండి వైదొలతుగామని, ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రతిపక్ష బిల్లుకు మద్దతు ఇస్తామని షాస్ (ఛాందస యూదు హరేదీపార్టీ, యుటిజె (యునైటెడ్ తోరజ్ జుడాయిజం)పార్టీలు నేతన్యాహూను తొలుత హెచ్చరించాయి.ఇజ్రాయెల్ పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉన్నాయి. నేతన్యాహూకు చెందిన లికుడ్ పార్టీ సారథ్యంలో ఏర్పడిన అధికార కూటమిలో ఎనిమిదిపార్టీలున్నాయి. ప్రధాన ప్రతిపక్షం యేష్ అతిడ్‌తోసహా ప్రతిపక్షంలో మొత్తం ఎనిమిది పార్టీలున్నాయి. 67మందిఎంపీల మెజారిటీబలంతో లికుడ్‌పార్టీ అధికారం చెలాయిస్తున్నది. 2022లో ఇజ్రాయెల్‌లో 25వ పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకూ 36ప్రభుత్వాలుఇజ్రాయెల్‌ను పాలించాయి. ఇప్పుడు నేతన్యాహూ నాయకత్వంలో 37వ మంత్రివర్గం హయాంలోగడచిన 20 నెలలుగా పాలస్తీనాపై యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. గురువారంనాటికి 615 రోజులుగా గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగిస్తూ ప్రపంచదేశాల నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. హీబ్రూ భాషలో ఇజ్రాయెల్ పార్లమెంటును నెస్సెట్ అని పిలుస్తారు. తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇజ్రాయెల్ ప్రభుత్వ కూటమిలోని పార్టీలు కూడా ఈ బిల్లుకు భారీఎత్తున మద్దతు ఇస్తాయని మొదట అందరూ భావించారు. కానీ నేతన్యాహూ వర్గాలు రాజీమార్గంబాటపట్టి వారిని బుజ్జగించే చర్యలు తీసుకోవడంతో బిల్లు పార్లమెంటులో వీగిపోయింది. ప్రతిపక్షాలు అనేక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాయి. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినప్పటికీ కొత్తగా తిరిగి ఎన్నికలు జరిగి, మళ్ళీ పార్లమెంటు కొలువు తీరాలంటే కనీసం ఆరునెలల సమయం పట్టి ఉండేది. చాలాకాలంగా ఇజ్రాయెల్‌లో అంతర్గతంగా ప్ర ధాన మంత్రి నేతన్యాహూకు సర్వత్రా తీవ్ర వ్యతిరేక వాతావరణం నెలకుని ఉంది. చుట్టూ శత్రుపరివేష్ఠితమైన ఇజ్రాయెల్‌ను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్న అంతర్జాతీయస్థాయి మిత్రదేశం అమెరికా కూడా ఇప్పుడు అంతర్గతంగా సమస్యలలో ఉంది. ఇంతకుముందు జో బైడెన్ కూడా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారు. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్‌కూడానేతన్యాహూకుఅంతకంటే ఎక్కువగా మద్దతు ఇస్తున్నప్పటికీ తనకు ఇష్టలేని పనులు చేస్తున్న నేతన్యాహూపై ట్రంప్ కొంత అసహనం కూడా చూపిస్తున్నారు. బందీలను సజీవంగా తీసుకురావాలని ఇజ్రాయెల్‌లో బందీల సంఘాలు నిత్యం ప్రదర్శనలు, నిరసనలు చేస్తున్నాయి. మరోవైపు ఎడతెగనియుద్ధం ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతున్నది. ఇంకోవైపు అనివార్యంగా అందరూ సైన్యంలో పని చేయవలసిందేనని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల నుండి తమను మినహాయించాలని ఇజ్రాయెల్‌లో కొన్ని వర్గాలు పట్టుపడుతున్నాయి. అందుకు అధికార కూటమిలోని పార్టీలు, ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షాలు పార్లమెంటును రద్దు చేయాలని కోరుతూ ఒక బిల్లును పార్లమెంటుముందుంచాయి. ప్రత్యేకించి యూదుమతానికి చెందిన అతి ఛాందసవాద హడేరీ వర్గాలు తమ సంప్రదాయాలు, నిబంధనలు కాపాడుకోవడానికి యుద్ధానికి దూరంగా ఉండాలని కోరుకుంటున్నాయి. సమాజంలో వారు విభిన్నంగా ప్రవర్తిస్తారు.

## లాస్ ఏంజెల్స్‌లో ఆగని అరెస్టులు



**ఆస్టిన్ :** వారం రోజులుగాలాస్ ఏంజెల్స్‌లో జరుగుతున్న నిరసన ప్రదర్శనలు, పోలీస్–ప్రదర్శకులమధ్య సంఘర్షణ గురువారంనాడు కూడా కొనసాగింది. వరుసగా రెండో రోజు రాత్రి కూడా లాస్‌ఏంజెల్స్‌లో కర్ఫ్యూను కఠినంగా అమలు చేశారు. కర్ఫ్యూను ఉల్లంఘించిన వందలమందిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు నిరసనలు కొనసాగుతున్నాయి. అమెరికాలోని ఇతర నగరాలలో కూడా ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. కాగా అధ్యక్షుడు ట్రంప్ రెచ్చగొట్టే ప్రకటన చేస్తూ, లాస్ ఏంజెల్స్‌లో హింసాకాండకు పాల్పడుతూ, నిరసన ప్రదర్శనలు చేస్తున్నవారంతా అక్రమంగా దేశంలోకి వలస వచ్చినవారేనని విమర్శించారు. దాదాపు 450 మందిని కర్ఫ్యూ ఉల్లంఘించారన్న కారణంగా అరెస్టు చేశారు. డౌన్‌టైన్‌లో గురువారంనాడు వందలమంది నిరసన ప్రదర్శన చేశారు. వాషింగ్టన్ డి.సి, హూస్టన్, సీటెల్, న్యూయార్క్, టెక్సాస్, తదితర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ''ఇక్కడ రాజులు ఎవ్వరూ లేరు, రాజ్యాలు లేవు'' అని ప్రదర్శకులు ప్ల కార్డులు ప్రదర్శించారు.

# అణుభద్రత చర్యల్లో ఇరాన్ విఫలం




### ఐఎఇఎ గవర్నర్ల బోర్డు తీర్మానం

**వియన్నా:** అణుభద్రత విషయంలో ఇరాన్‌కు ఎంతమాత్రం చిత్తశుద్ధి, నిబద్ధత లేవని ఐక్యరాజ్యసమితి అణునిఘా సంస్థ (ఐఎఇఎ) గవర్నర్ల బోర్డు ఒక తీర్మానం చేసింది. అణుభద్రతకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించడంలో ఇరాన్ పూర్తిగా విఫలమైందని విమర్శించింది. ఇరాన్ చర్యలను ఐఎఇఎ తప్పుపట్టింది. మంగళవారంనాడు గవర్నర్ల బోర్డు సమావేశంలో ఈ తీర్మానానికి అనుకూలంగా 19 మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా ముగ్గురు ఓటు వేశారు. మరో 11 మంది సభ్యులు గైరుహాజరయ్యారు. అణుభద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన బాధ్యతలను ఇరాన్ పూర్తిచేయలేదని తీర్మానం ఇరాన్‌ను విమర్శించింది. గడచిన ఆరు సంవత్సరాలుగా ఐక్యరాజ్యసమితి అణు నిఘా విభాగానికి సహకారం అందించడంలో ఇరాన్ విఫలమైందని గవర్నర్ల బోర్డు విమర్శించింది. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ వియన్నాలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఈ వివరాలు తెలియజేశారు. ఇరాన్‌లోని అప్రకటిత ప్రదేశాలలో యురేనియం జాడలను చూపించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ సమస్య అనేక సంవత్సరాలుగా నలుగుతోందని అన్నారు. ప్రపంచానికి ఇరాన్ సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. అణుపదార్థానికి సంబంధించిన విశ్వసనీయమైన సమాచారాన్ని ఐఎఇఎకు తెలియజేయడంలో ఇరాన్ ప్రభుత్వం విఫలమైందని, తనిఖీలు చేస్తున్నప్పటికీ అనేక సంవత్సరాలుగా ఇది సమస్యగా మారిందని అన్నారు. ఇదిలా ఉండగా ఐఎఇఎ విమర్శల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగమంత్రిత్వ శాఖ, ఇరాన్ అణుఇంధన సంస్థ (ఎఇఓఐ) ప్రకటన చేస్తూ, ఒక సురక్షితమైన ప్రదేశంలో కొత్త అణుశుద్ధి కేంద్రాన్ని నిర్మించామనీ, దీనికి సంబంధించిన వివరాలు తర్వాత తెలియజేస్తామని పేర్కొంది.

### 15న ఇరాన్ – అమెరికా మధ్య ఆరో విడత అణు చర్చలు

ఇరాన్–అమెరికా మధ్య ఈనెల 15వ తేదీన ఆదివారంనాడు ఆరో విడత అణు చర్చలు మస్కట్‌లో జరుగుతాయి. ఓమన్ విదేశాంగ మంత్రి అల్ బుసైదీ గురువారంనాడు ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేశారు. దీనిపై అమెరికా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇరాన్–అమెరికా మధ్య అణుసంబంధమైన చర్చలకు ఓమన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్ 12 నుండి మే 23వ తేదీ వరకూ ఈ రెండు దేశాలమధ్య ఐదు విడతలుగా పరోక్ష చర్చలు జరిగాయి. కానీ ఈ చర్చలన్నీ విఫలమయ్యాయి. అసలు ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని అమెరికా వాదిస్తున్నది. ఆరు అణుబాంబులు తయారుచేయగల శక్తిసామర్థ్యాలను ఇరాన్ ఇప్పటివరకూ సమకూర్చుకుందని అమెరికా చెబుతున్నది. యురేనియం శుద్ధి కార్యక్రమాలను తక్షణం నిలిపివేయాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా అందుకు ఇరాన్ తిరస్కరిస్తున్నది.

## భారత్–నేపాల్ మధ్య గ్రీన్ ఎనర్జీ సహకారం



**ఖాట్మండు :** పర్యావరణ అనుకూల గ్రీన్ ఎనర్జీ సహకారాన్ని అందించాలని భారత్‌ను నేపాల్ విదేశాంగమంత్రి అర్జు రాణా దూబే కోరారు. ఈ రెండు దేశాలు గత ఏడాది జనవరినెలలో దీర్ఘకాలిక గ్రీన్ ఎనర్జీ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 10,000 మెగావాట్ల విద్యుత్‌ను రాబోయే పదేళ్ళకాలంలో భారత్‌కు ఎగుమతి చేసేందుకు వీలుగా ఈ ఒప్పందం జరిగింది. ఖాంట్మండులో గురువారంనాడు జరిగిన సమావేశంలో అర్జు రాణా మాట్లాడారు. ఖాట్మండు నవీన విదేశీ విధాన కేంద్రం, అనంత అస్పెన్ సెంటర్ థింక్ టాంక్‌లు సంయుక్తంగా భారత్–నేపాల్ వ్యూహాత్మక చర్చల గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు దేశాలమధ్యా గ్రీన్ ఎనర్జీ సహకారం పరస్పర ఆధారభూతంగా ఉంటుందన్నారు. దీనివల్ల పరిశుద్ధమైన కాలుష్యం లేని స్థిరమైన ఇంధన వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. వాణిజ్యం, రవాణా, పెట్టుబడులద్వారా సహకారాన్ని ఉద్ధృతం చేయడం ద్వారా ఆర్థిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్నదే రెండు దేశాలమధ్య సంబంధాలలో ప్రధాన అంశమని ఆయన చెప్పారు. రెండు దేశాలమధ్య 1,850 కి.మీ నిడివిగల సరిహద్దులు ఉన్నాయని, ఐదు భారత రాష్ట్రాలతో ఈ సరిహద్దులను నేపాల్ పంచుకుంటున్నదని చెప్పారు.

## రూ.200 కోట్లపైనే
(మొదటి పేజీ తరువాయి)

కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారించాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు నాంపల్లి ఎసిబి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. శ్రీధర్‌కు చెందిన తెల్లాపూర్‌లో ఒక ఖరీదైన విల్లా, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్స్, అమీర్‌పేట్‌లో కమర్షిల్ స్థలం, హైదరాబాద్‌లో ఇండిపెండెంట్ బిల్డింగ్, కరీంనగర్‌లో మరో ఇండిపెండెంట్ బిల్డింగ్, 16 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లలో మరో 19 రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్స్‌లు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు బయట పడిన విషయం తెలిసిందే. ఇక ఇతని పేరుపై, కుంటుంబ సభ్యుల పేర్లపై ఉన్న బ్యాంక్ లాకర్లను ఇంకా తెరవలేదు. ఇందులో కూడా ఏఏ పత్రాలు ఉన్నాయో, ఏఏ నగలు ఉన్నాయో ఒకటి రెండు రోజుల్లో తేలే అవకాశాలు ఉన్నాయి. థాయ్‌ల్యాండ్‌లో ఇటివలే శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపాడు. ఆ తరువాత హైదరాబాద్‌లో గ్రాండ్‌గా డిన్నర్ ఫంక్షన్ కూడా చేశాడు. ఇందుకోసం సుమారు రూ.25 కోట్లకుపైగానే ఖర్చు చేశాడని సమాచారం. దీనిపైదీనిపై కూడా ఎసిబి అధికారులు ఆరా తీస్తున్నారు.

## ఐఎఎస్‌ల బదిలీలు
(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శిగా నవీన్ మిట్టల్‌ను, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియయమించింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా డి.ఎస్.లోకేశ్ కుమార్‌ను, ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను, హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. టిజి ఆయిల్ ఫెడ్ ఎండిగా జె.శంకరయ్య, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రెటరీగా రాజీవ్ గాంధీ హనుమంతు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ కార్యదర్శి (సమన్వయం)గా గౌరవ్ ఉప్పల్, టిజి సమాచార కమిషన్ కార్యదర్శిగా బి.భారతి లక్‌పతి నాయక్, నియమితులయ్యారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా రాజీవ్‌గాంధీ హనుమంతు, నిజామాబాద్ కలెక్టర్‌గా వినయ్‌క్రిష్ణారెడ్డి, మహిళా శిశు అభివృద్ధి డైరెక్టర్‌గా జి.శ్రీజన, వ్యవసాయ సహకార శాఖ సంయుక్త కార్యదర్శిగా శివశంకర్ లోహేటి, జిఎడి సంయుక్త కార్యదర్శిగా చిట్టం లక్ష్మి, సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా కె.హైమావతి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వాసం వెంకటేష్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శిగా విపి గౌతం, సింగరేణి కాలరీస్ కంపెనీ డైరెక్టర్‌గా గౌతంపోట్రూ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా కె.నిఖిలా, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండిగా వల్లూరి క్రాంతి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, సిఇఓగా ఎ.నిర్మలా కంతి వెస్లీ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా ముజమిల్‌ఖాన్, హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీస్, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ డైరెక్టర్‌గా ఇ.నవీన్ నికోలస్, సమాచార, ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా చెక్కా ప్రియాంక, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్, కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా అశ్విని తనాజి, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రఫుల్ దేశాయ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బి.షఫీయుల్లా, హెచ్‌ఎండి అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్‌గా విఎస్‌ఎన్ ప్రసాద్, పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నిఖీల్ చక్రవర్తిలు నియమితులయ్యారు. ఇదిలా ఉండగా నాన్ క్యాడర్ అధికారులు జె.శంకరయ్య టిజి ఆయిల్‌ఫెడ్ ఎండిగా, పి.శ్రీకాంత్ బాబు ఆయిష్ డైరెక్టర్‌గా, పవన్‌కుమార్ టిజిఐఐసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కాగా ముఖ్యమంత్రి ప్రధాన పౌర సంబంధాల అధికారిగా గుర్రం మల్సూర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## భారీ వర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. సోమ, మంగళవారాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు.

## కుప్పకూలిన విమానం
(మొదటి పేజీ తరువాయి)





సమాచారం. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయినట్లు భావిస్తున్నారు. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. శిథిలాల ప్రాంతం నుండి కాలిపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్నట్లు, గాయపడిన వారిని సమీపంలోని సిటీ సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు దృశ్యాలు వైరస్ అయ్యాయి. ఈ ప్రమాద ఘటన గురించి ప్రత్యక్ష సాక్షులు మీడియాతో మాట్లాడారు. విమానం ప్రమాద స్థలానికి దగ్గర్లోనే ఉన్న ఓ వ్యక్తి ఏం జరిగిందో చెప్పుకొచ్చాడు. 'మా ఆఫీస్ ఇక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో ఉంది. నేను ఆఫీస్ నుంచి బయటకు అడుగు పెట్టగానే చాలా పెద్ద శబ్దం వినిపించింది. అకస్మాత్తుగా ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఏం జరిగిందో మాకు అర్థం కాలేదు. ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి, ఇక్కడ శిథిలాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. మంటలు చెలరేగుతున్నాయి. విపరీతంగా పొగ కమ్ముకుంటోంది. ఏమీ కనిపించలేదు. అప్పుడు విమానం రెక్కలు ఇక్కడ పడిపోయాయని, ఒక విమానం కూలిపోయిందని మాకు తెలిసింది.. ప్రాణనష్టం గురించి మాకు తెలియదు' అని ఆ వ్యక్తి చెప్పాడు. 2020లో కేరళలోని కోజికోడ్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం తడి రన్‌వే నుండి జారిపడి రెండుగా విడిపోయిన తర్వాత ఇది భారతదేశంలో రెండవ అతిపెద్ద విమాన విపత్తు. విమానంలో ఉన్న 190 మందిలో, ఇద్దరు పైలట్లు సహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టిసిగా 8,200 గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఎటిసి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఎటిసికి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్ లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్ ఇండియా వెబ్ సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు ఉంటాయని పేర్కొంది. ఘటన నేపథ్యంలో అహ్మదాబాద్ నగరంలో విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు.

**రంగంలోకి ఎఎఐబి**

విమాన ప్రమాదంపై దర్యాప్తు చేయనున్నట్లు పౌరవిమానయాన శాఖ వర్గాలు వెల్లడించాయి. అటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) రంగంలోకి దిగింది. ఎఎఐబి డిజి, ఇతర అధికారులు ఘటనాస్థలానికి వెళ్లారు.

**చాలా మంది చనిపోయారు : కేంద్ర విదేశాంగ శాఖ**

విమానం దుర్ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన చేసింది. ఈ ప్రమాదంలో చాలా మంది మరణించినట్లు వెల్లడించింది. 'అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘటన మాటలకందని పెనువిషాదం. తాజాసమాచారం ప్ర కారం ఇందులో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల్లో ఎక్కువ మంది విదేశీయులు ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఘటనకు సంబంధించిన అప్ డేట్స్‌ను సంబంధిత శాఖకు ఎప్పటికప్పుడు పంచుకుంటాయని పేర్కొన్నారు. ప్రాణ నష్టంపై ఇప్పుడు కచ్చితమైన అంచనాకు రాలేమని, పూర్తి వివరాలకు మరికొంత సమయం పడుతుందని ఆయన తెలిపారు.

**గుజరాత్ మాజీ సిఎం విజయ్ రుపానీ మృతి**

ఎయిరిండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సిఎం, బిజెపి సీనియర్ నేత విజయ్ రూపానీ మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి, గుజరాత్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సిఆర్ పాటిల్ ధ్రువీకరించా రు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు విజయ్ రూపానీ ప్ర యాణానికి బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ఆయ న పేరుతో ఒక టికెట్ తొలుత నెట్టింట వైరల్‌గా మారింది. ఆపై ఆయన వి మానం ఎక్కినట్లు నిర్ధరించే ప్యాసింజర్ జాబితాలోనూ రూపానీ పేరు ఉండడంతో ఆయన సమాచారం గురించి పలువురు ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఆయన మృతిని పార్టీ ధ్రువీకరించింది. బిజెపికి చెందిన విజయ్ రామ్‌నిక్ లాల్ భాయ్ రూపానీ 2016 నుంచి 2021 వరకు రెండు సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా.. చిన్న కుమారుడు పూజిత్ ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

**మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం**

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఎయిరిండియా యాజమాన్యమైన టాటా గ్రూప్ స్పందించింది. మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియాగా అందించనున్నట్లు వెల్లడించింది. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా తామే భరిస్తామని తెలిపింది. ఈ మేరకు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఎయిరిండియా ప్రమాద ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆ బాధను వ్యక్తపరచడానికి మాటలు కూడా రావడం లేదు. ప్రమాదంలో ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి టాటా గ్రూప్ తరఫున రూ.1కోటి అందజేయనున్నాం. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా మేమే భరిస్తాం. వారి సంరక్షణ బాధ్యత కూడా మాదే. బిజె మెడికల్ హాస్టల్ నిర్మాణానికి మా వంతుగా తోడ్పాటు అందిస్తాం' అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎయిరిండియా ఎండీ, సిఇఓ క్యాంప్ బెల్ విల్సన్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

## మెట్రో పనులను చేపట్టొద్దు
### చార్మినార్, ఫలక్‌నుమా వద్ద చేయొద్దు
### హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:**హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్ట్ రెండో దశలో పనులు చార్మినార్, ఫలక్‌నుమాల సమీపంలో చేయపట్టరాదని హైకోర్టు రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వారసత్వ కట్టడాల పరిరక్షణపై ఎలాంటి అధ్యయనం చేయకుండానే మెట్రో నిర్మాణాలు చేసేందుకు ప్రణాళికను రూపొందించారని, మెట్రో కారిడార్–6 పనులు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) హైకోర్టులో వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

మెట్రో పనుల కారణంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమాతోపాటు పలు నిర్మాణాలకు ప్రమాదం పొంచి ఉందని పిటిషనర్ లాయర్ వాదించారు. తెలంగాణ వారసత్వ కట్టడాల రక్షణ చట్టం, కేంద్ర పురావస్తుశాఖ చట్ట నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కౌంటరు దాఖలు చేయడానికి మూడు వారాల గడువు కావాలని ప్రభుత్వం కోరింది. ఇందుకు అనుమతిచ్చిన హైకోర్టు అప్పటి వరకు పనులు చేయరాదని ఆదేశించింది.

**జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ పనులను చేపట్టరాదు**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ పనులను చేపట్టరాదంటూ హైకోర్టు గురువారం ఆదేశించింది. అనుమతుల్లేకుడా నిర్మాణాలు కొనసాగిస్తుండటం సరికాదంది. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను అనుమతుల్లేకుండా నిర్మిస్తున్నా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. జీహెచ్‌ఎంసీ అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు జరుగుతున్నాయని లాయర్ చెప్పారు. వాటి ఫొటోలు తీసిన పిటిషనర్లపై కేసులు పెట్టారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, అనుమతుల్లేని నిర్మాణ పనులను నిలిపివేయాలన్నారు. వీటిపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జులై 3కు వాయిదా వేసింది.

## పిడుగుల వర్షం
(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ పనులలో నిమగ్నమై చేనులో పత్తి విత్తనాలు విత్తుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో మంగం భీంబాయి, సిడాం రాంబాయి, పెందూర్ మనోహర్, పెందుర్ సంజన, ఈ నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే పిడుగుపాటుతో మరో 8 మంది గాయపడగా వారిని స్థానికులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు వారికి చికిత్సను అందిస్తున్నారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## సిఎం రేవంత్‌పై కేసు విచారణ నిలిపివేసిన హైకోర్టు

**హైదరాబాద్:** బిజెపి పరువు ప్రతిష్టలు దెబ్బతీసేలా గత ఏడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన జన జాతరలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారంటూ బిజెపి పెట్టిన కేసు విచారణను హైకోర్టు నిలిపివేసింది. ఈమేరకు గురువారం జస్టిస్ కె.లక్ష్మ ణ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటరు దా ఖలు చేయాలంటూ ఫిర్యాదుదారు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆదేశించారు. విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు. బిజెపి అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు రద్దు అవుతాయని రేవంత్ ఆరోపణల వల్ల పార్టీ పరువు పోతోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. దీనిని కొట్టేయాలన్న రేవంత్ పిటిషన్‌లో ఫిర్యాదుదారు వెంకటేశ్వర్లు కౌంటరు దాఖలు చేయకపోవడంతో హైకోర్టు మండిపడింది. విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు కింది కోర్టులో కేసు విచారణపై స్టే విధించింది.

## అక్రమ నిర్మాణలపై చర్యలు లేకపోగా కుంటిసాకులా?

**హైదరాబాద్:**అక్రమ నిర్మాణాలపై తక్షణం చర్యలు తీసుకోకుండా కుంటి సాకులు చెబుతున్న నల్గొండ మున్సిపల్ అధికారులపై హైకోర్టు గురువారం మండిపడింది. కూల్చివేత ఉత్తర్వులు 2022లో జారీ అయినా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. పరస్పర లేఖలతో కాలయాపన చేయకపోతే తక్షణం ఎందుకు చర్యలు తీసుకోలేరని నిలదీసింది. నల్గొండ గొల్లగూడలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలంటూ 2022లో మున్సిపల్ కమిషనర్ ఆదేశాలిచ్చినా అమలు చేయకపోవడంపై 83 ఏళ్ల కె.రాములమ్మ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. విద్యుత్తు, నీటి సరఫరా నిలిపివేతకు లేఖలు రాశామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కూల్చివేత చర్యలు చేపట్టాలని లేఖ రాసినట్లు ప్రభుత్వ లాయర్ చెప్పారు. కూల్చివేత చర్యలు తీసుకుని రిపోర్టు ఇవ్వాలని ఆదేశించిన న్యాయమూర్తి విచారణను జులై 3కు వాయిదా వేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఫోన్ ట్యాపింగ్ కేసులో.. నేడు సిట్ విచారణకు హాజరుకానున్న ప్రభాకర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ–1 నిందితుడు ఎస్ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు శుక్రవారం సిట్ విచారణకు మూడోసారి విచారణకు హాజరుకానున్నారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తరువాత ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ఈనెల 9, 11 తేదీలలో రెండుసార్లు విచారించారు. మూడోసారి విచారణకు అతనిపై సంధించే ప్రశ్నలను సిట్ అధికారులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రభాకర్‌రావు ఉపయోగించిన రెండు ఫోన్‌లను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎస్ఐబిలో దశాబ్దకాలం నుంచి భద్రపరిచిన డేటాను ఎందుకు ఎత్తుకెళ్లాల్సి వచ్చింది, ధ్వంసం చేయాల్సి వచ్చిదనే విషయంపై మరింత లోతుగా విచారించాలని సిట్ అధికారులు యోచిస్తున్నారు.

## ఆటో మీటర్ చార్జీలు పెంచడానికి
# ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆటో మీటర్ చార్జీల పెంపుదల, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డుతో పాటు ఇతర పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జిహెచ్ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసేందుకు కృషి చేసిన కూనంనేని సాంబశివరావుకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మగ్ధూంభవన్‌లో గురువారం తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి నేతలు ఘనంగా సన్మానించారు. జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆటో మీటర్ చార్జీలు పెంచడం, ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12,000 ఆర్థిక సహాయం, ఆటో రవాణారంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించడం వంటివి పరిష్కరించడానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి నేతలు సిహెచ్.జంగయ్య, ఎండి.ఒమర్‌ఖాన్, ఎస్‌కె.లతీఫ్, ఎం.శ్రీనివాస్ (ఎఐటియుసి), వి.ప్రవీణ్, లింగం (టియుసిఐ), వి.మారయ్య, మహేష్ (బిఆర్‌టియు,) పి.శ్రీకాంత్, అజయ్‌బాబు(సిఐటియు), పి.యాదగిరి (టిఎన్‌టియుసి) పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై మాజీ సిఎం కెసిఆర్‌వి
# పచ్చి అబద్ధాలు

తెలంగాణ విద్యావ్యవస్థ బలోపేతం కావాలి

17న వామపక్షాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరసన

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మాజీ ముఖ్యమంత్రి కమిషన్ ముందు హాజరై చెప్పిన విషయాలు పచ్చి అబద్ధాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అప్పుడు నేనే ఇంజనీయర్, నేనే మేస్త్రిని అని చెప్పుకున్న మాజీ ముఖ్యమంత్రి నేడు అరెస్ట్ అవుతాననే భయంతో నాకు ఏమీ సంబంధం లేదని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కాళేశ్వరంపై నాడు కెసిఆర్ కుటుంబం లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. నాడు కెసిఆర్, ఈటల రాజేందర్, హరీష్‌రావులే కాళేశ్వరం కూలడానికి ప్రధాన కారణమని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణకు కెసిఆర్ ఒరగబెట్టింది ఏమీ లేదనన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతం కావాలని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కుంటుబడిన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వానికి సూచించారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంపు వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు. ఆపరేషన్ కగార్ ఆపాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17న వామపక్షాల ఆధ్వర్యంలో హైద్రాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని, అలాగే మావోయిస్టులు కూడా తమ పంథా మార్చుకోవాలని, వామపక్షాలతో చేతులు కలిపి మతోన్మాదులను తరిమి కొట్టడానికి ఏకంకావాలని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో కలిసి రావాలని ఆయన సూచించారు.

**జూలై 5,6న కురవిలో సిపిఐ జిల్లా మహాసభలు**

జూలై 5,6 తేదీల్లో కురవి మండల కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మరో రెండేళ్ళు ప్రజాసమస్యలపై ఉద్యమాలు కొనసాగించేలా ఈ మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు, ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , నెల్లూరు నాగేశ్వరావు పాల్గొన్నారు.

# బాలల హక్కులు కాపాడాలి

భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు... బడిలో

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

బాలసంఘం, ఎఐవైఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉన్నదని పలువురు యువజన, బాల సంఘం నాయకులు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసంఘం, ఎఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 'బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు బడిలో' అనే నినాదంతో చిన్నారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, బాలసంఘం కన్వీనర్ షేక్ మహమూద్, హిమాయత్‌నగర్ మండల విద్యాశాఖాధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి సుమన్ మాట్లాడుతూ పేదరికం వల్ల పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా తమ కుటుంబ అవసరాల కోసం బాల కార్మికులుగా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదన్నారు. ఇందుకు మూల్యంగా వారి శారీరక, మానసిక పెరుగుదల లోపిస్తున్నదని, సహజంగా ఉన్న నైపుణ్యాలు, సామర్థ్యాలు నశిస్తాయన్నారు. తల్లితండ్రులు యజమానుల దగ్గర తీసుకున్న అప్పు కోసం పిల్లలని తాకట్టు పెట్టడం వల్ల వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పెద్దలు చేయాల్సిన పనుల్లో పిల్లలకు తక్కువ వేతనం వెచ్చించి పనిచేయించుకోవచ్చని వారిని నియమించుకుంటారని, పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించినపుడే ఇందుకు పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పౌరులంతా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ రెవెన్యూ, కార్మిక శాఖలు పర్యవేక్షిస్తూ బాల కార్మిక కుటుంబాలలో చైతన్యం తీసుకువస్తూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు చేపట్టాన్నారు. ధర్మేంద్ర మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, విద్యాహక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపై హక్కులు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, కిషోర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీఖాన్ పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా పోలీసులు భేష్

మా దేశంలో మహిళా పోలీసులే కనిపించరు..పెట్టమని చెబుతా

మిస్‌వరల్డ్ ఒపెల్ సుచాతా శ్రీ



ప్రజాపక్షం/హైదరాబాద్:''మా థాయ్ లాండ్‌లో ఉమెన్ పోలీస్ అసలే కనిపించరు. మొత్తం మగ పోలీస్‌లే ఉంటారు. కానీ, తెలంగాణ హైదరాబాద్‌లో నేను విమానం దిగిన దగ్గర నుండి, తిరిగి వెళ్లే వరకు పోలీసులలో సగం మంది ఉమెన్ పోలీసులే కనిపించారు. అంతెందుకు, నాకు మొదటి రోజు నుండి తిరిగి వెళ్లేంతవరకు ఉమెన్ పోలీస్‌లు నావెంటే ఉండి, కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తెలంగాణలో మహిళా భద్రతా చర్యలు అద్భుతంగా ఉన్నాయి. ఇది, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని కలిగిస్తుంది. ఇలాంటి మహిళా భద్రతా చర్యలు మా దేశంలోనూ అమలు చేయాలని మా ప్రభుత్వాన్ని కోరుతాను'' హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన మిస్‌వరల్డ్–2025 విజేతగా నిలిచిన థాయ్ లాండ్ సుందరి మిస్‌వరల్డ్ ఒపెల్ సుచాతా శ్రీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సుమారు 40 రోజులు హైదరాబాద్‌లో గడిపిన ఆమె విజేతగా నిలిచి తన స్వదేశానికి బుధవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు ఈ సందర్భంగా ఆమె తన మనోభావాన్ని పై విధంగా వ్యక్తం చేశారు.



## గత ప్రభుత్వంలో సెరికల్చర్ విభాగం నిర్లక్ష్యానికి గురైంది

రైతు కమిషన్‌కు వివరించిన అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యానికి గురైందని, నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో సెరికల్చర్ విభాగం నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని అధికారులు గురువారం రైతు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానిరెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్‌తో సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఈ మేరకు సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో సెరికల్చర్‌ను కలపడం వల్ల సెరికల్చర్ మనుగడకే ప్రమాదంగా మారిందని వివరించారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో పట్టుపురుగుల సాగులో మంచి లాభాలున్నా.. పట్టించుకోలేదని, పట్టు పరుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కమిషన్ చైర్మన్, సభ్యులకు సెరికల్చర్ అధికార యంత్రాంగం వివరించింది. ముఖ్యంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో గత కొన్నేళ్లుగా నియామకాలు చేపట్టలేదని, రాష్ట్ర వ్యాప్తంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల సంఖ్య 60 మందే వున్నారని తెలిపారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా పట్టుపురుగుల సాగుకు నిధులు కూడా తీసుకోవచ్చని, తెలంగాణలో సిల్క్ దుస్తువుల డిమాండ్ ఉందని తెలిపారు. సెరికల్చర్ అధికారులు తెలిపిన వివరాలను విన్న రైతుకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్.. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పేరుకుపోయిన సమస్యలు, అభివృద్ధి చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును
# బీమారంగానికి అప్పగించొద్దు

ఎఐటియుసి డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు సహజ మరణం జరిగినటువంటి క్లెయిమ్‌లను బీమా రంగానికి అప్పజెప్పాలి అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యదర్శి, అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్‌కి బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వము ఆలోచన చేయడం బాధాకరమని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా బీమా రంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో 15 లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులు నమోదై ఉన్నారని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా చెల్లిస్తున్న డబ్బులు లేబర్ డిపార్ట్‌మెంట్ చేతులు దులుపుకొని బీమా కంపెనీకి అప్పజెప్పడం వెనుక మతలబు ఏమిటని నిలదీశారు. అధికారులు ఎలాంటి కారణాలు చెప్పకుండా గోప్యంగా ఉంచడంలో అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. బీమా కంపెనీలకు అప్పజెప్పడం అంటే సంక్షేమ బోర్డు ఎత్తి వేసే కుట్రలో భాగమే అని ఆరోపించారు. ఈనెల నాలుగో తేదీన సంక్షేమ బోర్డు గుట్టుచప్పుడు కాకుండా ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదలచేశారు. ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏంటో చెప్పటంలేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ లేబర్ అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ అప్పనంగా బీమా కంపెనీలకు అప్పచెప్పటం విచారకరమని అన్నారు. కార్మికులను కార్మిక శాఖకు దూరం చేసే కుట్రలో భాగంగా ఇలాంటి ప్రయత్నం లేబర్ అధికారులు ప్రభుత్వం కూడబలుక్కుని చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ అధికారులు తమ పని భారం తగ్గించుకోవడం కోసం బీమా కంపెనీలకు సంక్షేమ బోర్డు నిధులు మళ్ళిస్తున్నారని అన్నారు. ఒక్కొక్క కార్మికునికి ఇన్సూరెన్స్ కోసం కంపెనీకి చెల్లిస్తున్నారని అధికారులను అడిగితే సమాధానం లేదని, ఈ పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తారో, ఎవరి అజమాయిషీ ఉంటుందనే అంశాలను దాటవేస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన అనంతరం వీటిపై ముందుకు వెళ్లాలని కోరారు. రెన్యువల్ గ్యాప్ పేరుతో క్లెయిమ్ నిలిపివేయడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేశం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఉపాధ్యక్షులు జి.పరమేశ్వర్, కోశాధికారి కె.నరసింహారెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ బొడ్డుపల్లి కిషన్ ఉమర్ కాన్ తదితరులు పాల్గొన్నారు



## మున్నూరుకాపు, గొల్ల కురుమలకు
# మంత్రి పదవులు ఇవ్వాలి

కాంగ్రెస్ చీఫ్‌కు నేతల వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్నూరుకాపు, గొల్ల కురుమలకు మంత్రి పదవులు ఇవ్వాలని రెండు సామాజికవర్గాల నేతలు కాంగ్రెస్ పార్టీని కోరాయి. ఈ మేరకు మున్నూరుకాపు, యాదవ సంఘాల నేతలు గురువారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ వేములవాడ ఎంఎల్‌ఎ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని 33 జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన మున్నూరుకాపు సంఘం నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. మరోవైపు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నేతృత్వంలో యాదవ సామిజికవర్గాల నేతలు మహేష్‌కుమార్‌ను కలిశారు. రాష్ట్రంలో గొల్లలు 22 లక్షలు, కురుమలు 6 లక్షల మంది ఉన్నారని, గొల్ల కురుమలకు మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారుడు, ఒక ఎంఎల్‌సి, ఐదు కార్పొరేషన్‌ల చైర్మన్లు, ఐదు కమిషన్ సభ్యులు, పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్, మూడు వైస్ ప్రెసిడెంట్స్, 8 ప్రధాన కార్యదర్శుల పదవులు, ఐదు డిసిసిలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు పెద్దపీట సిఎం రేవంత్ రెడ్డి వేసినప్పటికీ అందులో గొల్ల కురుమలకు అన్యాయం జరిగిందని మహేష్‌కుమార్ ముందు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎపి మంత్రివర్గంలో గొల్ల కురుమలకు మంత్రి పదవి లేని ప్రభుత్వం లేదన్నారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో గొల్ల కురుమలకు తప్పక అవకాశం కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చినట్లు అనంతరం బీర్ల ఐలయ్య మీడియాతో చెప్పారు.

# విద్యార్థుల భవిత ఉన్నతంగా తీర్చిదిద్దాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందించాలి

బిసి సంక్షేమ శాఖ అధికారులతో.. వీడియో కాన్ఫరెన్స్‌లో

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాలు కల్పించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. 2025–26 విద్యాసంవత్సరం బుధవారం నుంచి పునఃప్రారంభం కావడంతో బిసి సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాల విద్యను అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో, విద్యాబోధనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రాధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవితవ్యం కోసం శాయశక్తుల కృషి చేయాలన్నారు. రాష్ట్రం, దేశం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, బిసి సంక్షేమ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యబోధనలో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలన్నారు. అన్ని విషయాలను కూలంకుషంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి నెలవారి ఆరోగ్య పట్టికను సిద్ధం చేయాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో బిసి విద్యాసంస్థలు అత్యుత్తమ ఫలితాలు సాధించి, మొదటి స్థానంలో ఉండాలన్నారు. మంచి ఫలితాలు సాధిచడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతినెలా ఆర్‌సిఒలు, డిబిసిడిఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు, సంయుక్త కార్యదర్శులు తిరుపతి, మద్దిలేటి, ఎంబిసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఇఒ అలోక్ కుమార్, బిసి స్టడీసర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడి ఇందిర, ఆర్‌సిఒలు, ప్రాధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే..
# ప్రజలే బుద్ధి చెబుతారు

ఎమ్మెల్సీ బల్మూర్ వెకంట్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే..ప్రజలే బట్టలు ఊడ దీసి కొడతారని ఎంఎల్‌సి బల్మూర్ వెకంట్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్‌కు ఉబలాటం ఎక్కువగా ఉందిని, ఆయన చేసిన తప్పులకు త్వరలో ఆయనే జైలుకు వెళ్ళే రోజు వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని స్పష్టం చేశారు. జరిగిన తప్పులపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అది రాజకీయ కక్ష ఎలా అవుతుందని ప్రశ్నించారు. కెటిఆర్ గత ప్రభుత్వ అసెంబ్లీలో సంస్కారం గురించి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కెసిఆర్‌ను తిట్టొద్దని నీతులు చెప్పాడు. మరి ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నువ్వు మాట్లాడుతున్నా... భాష ఎలాంటిదో ప్రజలందరూ గమనిస్తున్నారని కెటిఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు నీతులు చెప్పిన కెటిఆర్ ఇప్పుడు... రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని తిడుతున్న మాటలకు సమాధానం చెప్పాలన్నారు. కెటిఆర్ ను చూసుకుని... సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న కొందరు బిఆర్‌ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెప్తాం అని హెచ్చరించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 17/SE(KZ)/GHMC/TA1/2025-2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 12.06.2025

**పనుల సంఖ్య:** 1 పని, చెత్త ఎత్తివేతల కోసం ఆర్ఎఫ్‌సిలు-1, **మొత్తం విలువ:** రూ.7948251.00, **బిడ్స్ స్వీకరణకు ప్రారభం తేది / ఆఖరి తేది:** *బిడ్ దాఖలు ప్రారంభ తేది:* 16.06.2025న మ.03.00గం.ల నుండి, *బిడ్ దాఖలు ఆఖరి తేది:* 26.06.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి చిరునామా:** ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి. ఫోన్ నం. 8790522144, కమిషనర్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 3487-PP/CL/ADVT/1/2025-26, Date: 12-06-2025

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా నా యొక్క పూర్వ పేరు VENKATRAVAMMA NAIDU, S/O. VENKATESWARLU కలదు. అయితే నేను నా యొక్క పేరును VENKATA RAVMANA ARRCHANA NAIDU అని NUUMBEROLOGY ప్రకారం పేరు మార్చుకున్నాను.

ఇట్లు
తమ విధేయురాలు
VENKATRAVAMMA NAIDU
S/O VENKATESWARLU (పాత పేరు)
VENKATA RAVMANA ARRCHANA NAIDU (కొత్త పేరు)

**బహిరంగ వేలం ప్రకటన**

తేదీ: 19.06.2025న ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ (MT Office) నందు ఉదయం 10 గంటలనుండి 12 గంటల వరకు పోలీస్ వాహనాల యొక్క పాత బ్యాటరీలు, పాత టైర్లు మరియు వాహనాల విడిభాగాలను (పాతవి) బహిరంగంగా వేలం వేయుటకు అధికారులు నిర్ణయించినారు. కావున ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొని అట్టి సామాన్లు దక్కించుకోగలరు.

ఇట్లు
పోలీసు శాఖ, ఖమ్మం

ప్రజాపక్షం
శుక్రవారం, 13 జూన్

# గొప్పలు.. తిప్పలు..

1956 నవంబర్‌లో తమిళనాడులో జరిగిన ఒక రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని నాటి ప్రధానమంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూను లేఖలో వేడుకున్నారు. ప్రమాదకారణం సాంకేతికపరమైనదేనని ఎంత నచ్చజెప్పినా ఆయన వినలేదు. చివరకు రాజీనామాపై ఆమోదముద్ర పడింది. వాస్తవానికి, అంతకు కొద్ది మాసాల ముందే ఆగస్టులో నాటి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగినప్పుడే లాల్ బహదూర్‌శాస్త్రి మొదటిసారి రాజీనామాను సమర్పించారు. నెహ్రూ బలవంతాన వెనక్కి తీసుకున్నారు. అది ఆనాటి నాయకుల నైతిక, వ్యక్తిగత బాధ్యత కట్టుబాటుకు మచ్చుతునక.

నేటి పరిణామాలను పరికిస్తే నైతికతకు కాలం చెల్లడమే కాకుండా మంచి జరిగితే ఆ ఘనత నాదేనని ఢంకా బజాయించి చెప్పుకోవడం, చెడు జరిగితే కిమ్మనకుండా కారణాన్ని వేరొకరిపై నెట్టివేయడం సర్వసాధారణమైంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ నేపథ్యంలో సాగుతున్న రసవత్తర రాజకీయ సన్నివేశం ఇందుకొక నిదర్శనం. ప్రాజెక్టుకు శిరస్సు అయిన మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలనే నిర్ణయం తనది కాదని, వ్యాప్కోస్, ఇంజనీరులు, క్యాబినెట్ సబ్‌కమిటీ, క్యాబినెట్‌ల నిర్ణయమేనని మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కమిషన్ ముందు వాంగ్మూలమిచ్చారు. అంతకుముందు విచారణ ఎదుర్కొన్న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అవే మాటలు వల్లె వేశారు. ఇది తెలంగాణ ప్రజలందరినీ ఆశ్చర్యచకితులను చేసింది.

ఎందుకంటే, ఏడాదిన్నర క్రితం ముందు వరకు తొమ్మిదిన్నరేళ్ళలో అధికారంలో ఉన్న టి(బి)ఆర్‌ఎస్ హయాంలో సింహభాగం కాళేశ్వరం ప్రాజెక్టును ఘనతగా కథలు కథలుగా ప్రచారం చేసుకునేవారు. కెసిఆర్ తన మెదడును, కాలాన్ని కరిగించి, గూగుల్ మ్యాపులను పరిశీలించి, దగ్గరుండి బ్యారేజీలు, కాల్వలు, రిజర్వాయర్‌లకు రూపకల్పన చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపం కల్పించారని తమ అగ్రనేతకు గులాబీ నేతలు భుజకీర్తులు తొడిగారు. తెలంగాణ అంతటా సకల కాలాలలో సజీవ జల వాహికలను సృష్టించిన అపరభగీరథుడు అని కీర్తించారు. సుమారు లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రచారం మాటున అవినీతి, ఏటా కరెంటు ఖర్చు, చెల్లించాల్సిన రుణభారం పాతిక వేల కోట్లు హరించుకుపోతున్నాయనే ప్రతిపక్షం, అధికారపార్టీయేతర తెలంగాణవాదుల ఆర్తనాదాలు కొట్టుకుపోయాయి. చివరకు కట్టిన మూడు నాలుగేళ్ళకే మేడిగడ్డ బ్యారేజీకి బీటలు వారి, బిఆర్‌ఎస్ అధికారంలో నుంచి దిగిపోయే చివరినాటికే నిరుపయోగంగా మారిపోయింది. దానిని ఎల్లంపల్లికి అనుసంధానించే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి అదే. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టే ప్రశ్నార్థకంగా మారింది.

విచారణ నేపథ్యంలో బిఆర్‌ఎస్ నేతలు చేసిన వాదనలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఘోష్ కమిషన్ ముందు వాంగ్మూలాలతో గతంలో ప్రచారపటాటోపంలో కొట్టుకుపోయిన ప్రజలకు విషయాలు కొత్తగా తెలుస్తున్నాయి. అందులో కాళేశ్వరమనేది ప్రత్యేక, కొత్త ప్రాజెక్టు కానే కాదనేది ఒకటి. నిజానికి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లోనే డాక్టర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ళ సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ కట్టి, గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఆ నీటిని గ్రావిటీ ద్వారా తరలించాలనేది ప్రణాళిక. మహారాష్ట్ర అభ్యంతరాల మేరకు బ్యారేజీని 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గిస్తే ఆశించిన స్థాయిలో నీళ్ళుండవనే కారణంతో, బ్యారేజీ పాయింట్‌ని తుమ్మిడిహెట్టి కెసిఆర్ సర్కార్ తరలించాలని నిర్ణయించినట్లు తేలింది. ఇది ప్రాజెక్టు రీడిజైనింగ్ తప్ప కొత్తది కాదని బిఆర్‌ఎస్ నేతలు చెప్పకనే చెప్పినట్లయింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువ నదీ ప్రవాహంలో కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ నిర్మించారు. అక్కడి నుంచి ప్రవాహానికి ఎదురీదేలా నీటిని తోడి ఎగువన అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలకు, చివరకు పైన ఉండే ఎల్లంపల్లికి భారీ మోటార్లతో పంపేవారు. సునాయాసంగా తుమ్మిడిహెట్టి నుంచి దిగువకు ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చే అవకాశాన్ని వదులుకొని భారీ ఖర్చుతో ఏటికి ఎదురీదేలా కట్టిన మూడు బ్యారేజీల కథ ఏమైందో అందరూ చూస్తున్నదే! తుమ్మిడిహెట్టి నుంచైనా, మేడిగడ్డ నుంచైనా నీటిని తెలంగాణ ఏర్పాటుకు ముందే పూర్తయిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే దిగువన సాగుకు పంపిణీ అయ్యేది. బిఆర్‌ఎస్ నేతలు చెప్పిన మరో విషయమేమిటంటే, వానలు బాగా పడితే ఎగువన శ్రీరాంసాగర్ నుంచి, మోస్తరుగా కురిస్తే కడెం ప్రాజెక్టు నుంచి, వానలు సరిగా పడకపోతేనే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్ళు వస్తాయని. అంటే కాళేశ్వరం కొత్త ప్రాజెక్టు కాదు, ఉన్నదానికే అదనం అని అంగీకరించినట్లయింది.

కాదనలేని వాస్తవమేమిటంటే, దిగువన నీటిని పంపిణీ చేసేందుకు కాలువలు, భారీ స్థాయిలో రిజర్వాయిర్‌లను టి(బి)ఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించడం. అవి ఉపయోగపడ్డాయనేది పెరిగిన పంట దిగుబడులు చెబుతున్నాయి. అయితే, అవసరం లేకున్నా భారీ సామర్థ్యం, వ్యయంతో వాటిని కట్టడం కూడా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్ళను తోడిపోసే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఉపయోగంలో లేకున్నా, ఎస్‌ఆర్‌ఎస్‌పి, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నీటి ద్వారానే నీటి సమృద్ధి సాధించడం. అంటే ఆ మూడు బ్యారేజీలకు బదులు మూడో వంతు ఖర్చుతో ఈపాటికే పూర్తయ్యే తుమ్మిడిహెట్టి బ్యారేజిని తక్కువ ఎత్తులో నిర్మించినా ప్రయోజనం ఉండేదని నిపుణులు, ప్రతిపక్షాల వాదన. మిగతా డబ్బులో కొంత కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే సరిపోయేది.

ఒకవైపు కాళేశ్వరంలో అవినీతి జరగలేదని బిఆర్‌ఎస్ నాయకులు వాదనలు చేస్తుంటే, మరోవైపు ప్రాజెక్టుకు ఇఎన్‌సిలుగా, ఇఇలుగా, ఇంజనీర్లుగా పనిచేసిన అధికారుల ఇళ్ళు, కార్యాలయాలపై జరుగుతున్న ఎసిబి దాడులలో విస్తుపోయేలా వందల కోట్ల ఆస్తుల దస్తావేజులు, సంపద బైట పడుతుండడాన్ని ఏమనాలి? అప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఘనత కెసిఆర్‌దే అని చెప్పి, ఇప్పుడు బ్యారేజీలు కుంగిపోవడంపై జరుగుతున్న విచారణలో మాత్రం ఇంజనీర్లు, అధికారులు, క్యాబినెట్ నిర్ణయాల ప్రకారమే దాని నిర్మాణం జరిగిందని బిఆర్‌ఎస్ నేతలు మాట మార్చడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. గొప్పలు పాలకులకు, తిప్పలు అధికారులకు అన్నమాట!

# కాళేశ్వరం ప్రాజెక్టు అను ఒక 'మాయ'!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

సామాన్యులను కట్టిపడేసే మాయ అంటే False Dreams + Fake Success + Forced Comparison. False Dreams: 'అతి తక్కువ సమయంలో, తక్కువకష్టంతో, పెద్ద విజయం సాధించవచ్చు' అని నమ్మించడం. (Shortcut Success Syndrome). Fake Success:Looks, Likes, Lifestyle చూపించి నిజ జీవితాన్ని మరిచిపోయేలా చేయడం. Forced Comparison: 'ఇతను ఇలా ఉన్నాడు, నేను ఎందుకు ఇలా లేను? 'అనే మైండ్‌సెట్ నాటడం. మాయ:నీకు అవసరం లేని దానిని కావాలని అనిపించడం, నీ తృప్తిని నాశనం చేయడం. నిజమైన జీవితం కాకుండా మాయా ప్రపంచంలో బతకించడం! 'ఈ కళలో ఆరితేరిన మనుషులు కెసిఆర్, కెటిఆర్, దాదాపు పదేండ్లు వాళ్ళు చేసిందంతా ఇదే. మాయతో సామాన్యుడ్ని బంధించివేయడమే. ఎన్నో పథకాలు, తాయిలాలు, సంక్షేమ కార్యక్రమాలు.

''జనానికి గొప్పగా ఉండేవి అంటే చాలా ఇష్టం. అవి వాళ్ళను ఆశ్చర్యచకితులను చేసేంత అద్భుతంగా, విశ్వరూపంలో కనిపించాలి. మీరు చూపించే అద్భుతాలను చూసేందుకు జనం తండోపతండాలుగా వస్తారు. కళ్ళకు కనిపించేది జనం హృదయాలకు సూటిగా చేరుతుంది. పైపై మెరుగులకే జనం ఎప్పుడూ ముగ్ధులవుతూ ఉంటారు'' సుప్రసిద్ధ రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెలి అన్నాడు. మాకియవెలి చెప్పింది చెప్పినట్టుగా ఈ దేశంలో సరిగ్గా ఆచరణలో పెట్టిన ఏకైక నాయకుడు కెసిఆర్.

కాగా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఎన్ని పుస్తకాలు అయినా రాయవచ్చు. ఎన్ని లక్షల పేజీలైనా రచించవచ్చు. ఏటా ఆదాయం 14,709 కోట్లు. ఖర్చు28,081 కోట్లు. ఇదీ స్థూలంగా కాళేశ్వరం కథ! ఈ ప్రాజెక్టుతో వినియోగంలోకి వచ్చింది 40,888 ఎకరాలు. 2019లోనే బరాజ్‌లు దెబ్బతిన్నానాటి కెసిఆర్ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. కాళేశ్వరం ఆయకట్టు అంతా ఒక కనికట్టు. 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీళ్లు ఇచ్చే విధంగా డిజైన్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో 2022 మార్చి నాటికి కేవలం 40,888 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీళ్లు ఇచ్చినట్టు తేలింది. దీనిని బట్టి కాళేశ్వరంలో లక్ష కోట్ల నిధులు ప్రవహించినా లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని స్పష్టం అవుతుంది. 2016 మే 2వ తేదీన కాళేశ్వరంకు శంకుస్థాపన జరిగింది. 2019 జూన్ 21వ తేదీన ప్రారంభించారు. 2022 మార్చి నాటికి 14.83 లక్షల ఎకరాలకు సంబంధించిన 'డిస్ట్రిబ్యూటరీ' వ్యవస్థ అభివృద్ధికి పనులను చేపట్టాలని నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం తలపెట్టింది. కానీ ఇందులో 56 ప్రాజెక్ట్ పనులకు 12పనులు మాత్రమే పూర్తి చేశారు. నాలుగు లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ అభివృద్ధి పనులు అసలు చేపట్టలేదు. మరో వైపు 32పనుల్లో తొలి ఒప్పందం గడువు ముగిసినా భూసేకరణ పూర్తి కాలేదు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక తెల్ల ఏనుగు అని నిర్ధారణ చేయడానికి పెద్దగా పరిశోధనలు చేయనవసరం లేదు. ప్రాజెక్ట్ మొత్తం పూర్తికాక ముందే కుంగిపోయి ప్రశార్థకంగా మారింది. ప్రాజెక్ట్‌లో నీళ్ల నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించడంతో పాటు, మరో 4.71 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం. అయితే కొత్త ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టులో పండే పంటలకు ఎత్తిపోసే నీళ్ల, తాగునీరు, పరిశ్రమలకు అందించే నీటికి అయ్యే ఖర్చుతో పాటు ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణ వాయిదాల చెల్లింపు కలిపిఏటా ఖర్చు రూ.28,081.54 కోట్లుగా తేలింది. వాటన్నింటి ద్వారా ఆదాయం మాత్రం రూ.14,709.84 కోట్లు.

ఇందులో ఎత్తిపోతలకు అయ్యే విద్యుత్తు చార్జీలు రూ.10,374.56 కోట్లు. నిర్వహణ ఖర్చులు రూ.272.70కోట్లు కలిపి రూ.10647.26 కోట్లు అవుతుందని 'కాగ్' నివేదిక స్పష్టం చేసింది. లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్ట్‌కు 'కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్' ద్వారా తీసుకున్న రుణం రూ.64.204.13 కోట్లు. వడ్డీలు సకాలంలో చెల్లించకుండా వాయిదా వేయడంతో అదనంగా మరో రూ.19,556.4 కోట్ల వడ్డీ అసలుతో కలిపి భారం పడుతోంది. దీంతో అసలు రూ.87,369.89కోట్లు అయింది. దీనికి వాయిదాలుగా ప్రతి ఏటా వడ్డీ, అసలు కింద రూ.10 వేల కోట్ల నుంచి 14 వేల కోట్లవరకు చెల్లించవలసి ఉన్నది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. పైగా ఈ ప్రాజెక్ట్‌కు తెచ్చిన అప్పులు తీర్చడం కోసం, కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడినట్టు పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

2019 జూన్ 21న మహారాష్ట్ర, ఎపి సిఎంలు కూడా హాజరయి అట్టహాసంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి.ఆర్‌సిసి వేసిన కోట్, సీసీ కర్టెన్ గోడలలో కొంత బాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకు పోయాయి.దీనివల్ల మేడిగడ్డ బరాజ్‌కు రూ.83.83 కోట్లు,అన్నారం 65.32 కోట్లు,సుందిళ్ల బరాజ్‌కు రూ.31.24 కోట్లు మొత్తంగా రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లింది.డిజైన్ లోపం,లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగింది.జరిగిన నష్టానికి తమకు సంబంధం లేదని 2019 లోనే కాంట్రాక్టర్లు ప్రకటించారు.తమకు ఇచ్చిన డిజైన్ల ప్రకారమే తాము పనులు చేశామని జరిగిన నష్టానికి తామెలా బాధ్యులమవుతామని ఎదురు ప్రశ్నిస్తున్నారు.నిధులు ఇస్తే పనులు చేయడానికి గుత్తేదార్లు ముందుకు వచ్చారు. దీంతో సాగునీటి శాఖనే ఈ పనులు చేపట్టడానికి రూ. 470.03 కోట్లతో అంచనాలు రూపొందించినా కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపట్టలేదు.

నిర్వహణ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగినట్లు కేంద్ర జలశక్తి శాఖ నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ తేల్చి చెప్పింది. 2019–20లలో మేడిగడ్డ ప్రాజెక్టును ప్రారంభించినప్పటి నుంచీ సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లను, లాంచింగ్ అప్రాన్‌లను తనిఖీ చేయలేదని, నిర్వహించలేదని కమిటీ గుర్తించింది. నిర్వహణ లోపం కారణంగానే బరాజ్ కుంగిందని కమిటీ అభిప్రాయపడింది. బరాజ్‌ను పునరుద్ధరించేవరకు ఇది నిరుపయోగంగానే ఉంటుంది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంటుందన్న అభిప్రాయాన్ని కేంద్ర జలశక్తి కమిటీ వ్యక్తం చేసింది.

ఇదిలా ఉండగ కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దేశమంతా ప్రచారం జరిగింది. ''కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంలా మారింది. వేల కోట్ల అవినీతి జరిగింది'' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా, జెపి నడ్డా అనేక సార్లు ఆరోపణలు చేశారు. కానీ కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ప్రస్తుత బిజెపి ఎంపి, కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా



పనిచేసిన ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా ఇచ్చిన వివరణతో బిజెపి షాక్‌కు గురయింది. ఈటల రాజేందర్, కెసిఆర్‌తో కుమ్మక్కయ్యారు. కాళేశ్వరంలో ఈటలకు కూడా వాటాలు ముట్టినందునే కెసిఆర్‌కు అనుకూలంగా మాట్లాడారు. అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందంటున్నారు. టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని ఈటల చెప్పారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే ప్రాజెక్టు అంచనాలను పెంచారని చెప్పారు. బిఆర్‌ఎస్‌తో బిజెపికి ఉన్న లోపాయికారీ ఒప్పందం మేరకే కెసిఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా? బిజెపి నాయకత్వం సమాధానం చెప్పాలి.

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల విచారణకు హాజరు కావడానికి, మూడు రోజుల ముందే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఒక బాంబు పేల్చారు. ''ఈటల, బిఆర్‌ఎస్ నాయకుడు హరీష్ రహస్యంగా సమావేశమైనట్టు నా దగ్గర పక్కా సమాచారం ఉంది'' అని పిసిసి అధ్యక్షుడు అన్నారు. మహేష్‌గౌడ్‌కు అందిన సమాచారం నిజమే అయితే ఈటల వివరణపై బిఆర్‌ఎస్ ప్రభావం ఉన్నట్టు భావించవచ్చు. ''కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ముందుగా రూ.82వేల కోట్ల అంచనా వేశారు. తరువాత ఎంత పెరిగిందో నాకు తెలియదు. డిపిఆర్ కోసం వ్యాప్కోస్ సంస్థకు రూ.595 కోట్లు విడుదల చేసినట్లు నాకు తెలియదు''. అని కాళేశ్వరం కమిషన్ విచారణలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎంపి ఈటల రాజేందర్ చెప్పారు.

''మహారాష్ట్ర అభ్యంతరాలు, సిడబ్ల్యుసి సూచనల నేపథ్యంలో ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సి వచ్చింది. సిడబ్ల్యుసి అనుబంధ సంస్థ అయిన వ్యాప్కోస్‌ను ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని కోరాం. సమస్యలన్నింటికీ పరిష్కారంగా నీటిలభ్యతకు పూర్తిగా భరోసా ఉన్న మేడిగడ్డ కనిపించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలని వ్యాప్కోస్ సిఫార్సు చేసింది. 2016 జులై 17న వ్యాపోస్ సంస్థ లైడార్ సర్వే చేసింది. 2017 సెప్టెంబర్ 17న సిడబ్ల్యుసి రాసిన లేఖలో మేడిగడ్డ వద్ద 283 టిఎంసిల నీళ్లున్నాయని చెప్పింది. అన్ని రిపోర్టులపై చర్చించి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలని నిర్ణయించాం. మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసే బాధ్యతను వ్యాప్కోస్‌కే అప్పగించినం. బరాజ్‌ల స్థలాలను వ్యాప్కోస్ ఎంపిక చేసింది. గతంలో ప్రాణహిత చేవెళ్ల డిపిఆర్‌ను వ్యాప్కోసే రూపొందించింది. వ్యాప్కోస్ సంస్థ నివేదికల ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించినం.

2016, జనవరి 17న వ్యాప్కోస్ డిపిఆర్ సమర్పించింది. ఆ తర్వాత నిర్ణయం తీసుకున్నం. వ్యాప్కోస్ నుంచి లెటర్ వచ్చాకే బరాజ్‌ల లొకేషన్లను మార్చారు. హైపవర్ కమిటీలో 'వ్యాప్కోస్' అధికారి కూడా సభ్యులుగా ఉన్నారు. హైపవర్ కమిటీ, వ్యాప్కోస్ కలిసి బరాజ్‌ల లొకేషన్ల మార్పునకు ఆమోదం తెలిపాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 30టిఎంసిలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, 10 టిఎంసిలు ఎన్ రూట్ గ్రామాల మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు,16 టిఎంసిలను పారిశ్రామిక అవసరాలకు.. ఇలా వివిధ వర్గాలకు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో రుణాల చెల్లించాలని అనుకున్నాం. కరోనా వల్ల 2 ఏండ్లు ఆలస్యమైంది. 3 బరాజ్‌లు, ప్రాజెక్టులోని రిజర్వాయర్లన్నింటిలో కలిపి 141 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవచ్చు. అత్యధికంగా మల్లన్నసాగర్‌లో 50 టిఎంసిలను నిల్వ చేసుకోవచ్చు''. అని మాజీ సిఎం కెసిఆర్, మాజీమంత్రి హరీశ్ రావు కాళేశ్వరం కమిషన్ ఎదుట వివరించారు.

కెసిఆర్, ఈటల, హరీశ్ రావుల వివరణలో ఒక సంస్థ పేరు పదే పదే ప్రస్తావనకు వచ్చింది. ఆ సంస్థ పేరు వ్యాప్కోస్. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినా వ్యాప్కోస్ రాష్ట్రాల్లో జలవనరులకు సంబంధించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, బరాజ్‌ల నిర్మాణాలకుగాను ప్రణాళిక, డిజైన్లు, నిర్మాణ వ్యవహారాలు ఇతర అంశాలపై సర్వేలు జరిపి, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి సంబంధిత ప్రభుత్వాలకు అందిస్తుంది. 'వ్యాప్కోస్'సూచనలు, నివేదికల ఆధారంగానే కాళేశ్వరంను నిర్మించినట్టు బిఆర్‌ఎస్ బలంగా వాదిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినంత మాత్రాన 'అత్యంత విశ్వసనీయత' గలిగినది అని ఎవరయినా సర్టిఫికెట్ ఇస్తే అంతకన్నా అవివేకమూ, అమాయకత్వము మరొకటి లేదు.

'వ్యాప్కోస్' మాజీ చైర్మన్, ఎండి రాజేందర్ గుప్తా, ఆయన కుమారుడు గౌరవ్‌లను 2023మేలో అరెస్టు చేశారు. రాజేందర్ గుప్తా ఇంట్లో రూ.38 కోట్ల నగదును సిబిఐ స్వాధీనం చేసుకున్నది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రాజేందర్ గుప్తాను జైలుకు పంపించారు. ఆయన వ్యాప్కోస్‌లో 1989లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి 2010ఏప్రిల్‌లో చైర్మన్, ఎండి అయ్యారు. ఐదేండ్ల తర్వాత ఆయన పదవీకాలం 2018 సెప్టెంబర్‌వరకు పొడిగించారు. మళ్ళీ 2020వరకు రెండేండ్ల కాలానికి పదవిని పొడిగించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2016నుంచి 2019వరకు మూడేండ్లలో నిర్మించారు. ఇదొక రికార్డుగా కెసిఆర్, ఆయన పార్టీ నాయకులంతా చెబుతుంటారు. ఇంత వేగంగా, ఇలాంటి భారీ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినందువల్ల కూడా, నాణ్యతాపరమైన సమస్యలు తలెత్తినట్టు నిపుణుల విశ్లేషణ. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ముడిపడి ఉన్న వారిలో వ్యాప్కోస్ మాజీ చైర్మన్ రాజేందర్ కుమార్ గుప్తా, ఇరిగేషన్ మాజీ ఈ.ఎన్.సి, హరిరామ్, మాజీ ఈ.ఈ.. నూనె శ్రీధర్ అరెస్టయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగాలపై ఈ ముగ్గురి అరెస్టులు జరిగాయి.ఇంకా ఎంతమంది అరెస్టు కానున్నారో తెలియదు.

''మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ వాళ్ళే బాంబులు పెట్టారేమో? బ్యారేజీ పగుళ్లకు వాళ్లే కారణం కావచ్చునేమో?. బ్యారేజీలో రెండు చోట్ల పగుళ్లు వస్తే ఏదో అయిపోయినట్లు చేస్తున్నారు. ఇలాంటి కట్టడం మరోదేశంలో నిర్మిస్తే కెసిఆర్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసేది. ఆయన కీర్తి అజరామరంగా ఉండేది. కెసిఆర్‌కు ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చేవి. రేవంత్ రెడ్డి చిల్లరగాడు. ఆయన కెసిఆర్ వెంట్రుక కూడా పీకలేరు'' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జూన్ 11న నిప్పులు చెరిగారు. సిఎంపై అన్ పార్లమెంటరీ భాషలో దుమ్మెత్తిపోశారు.

''రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రమాణం చేసే డిసెంబర్ 23వరకు, 60 రోజులకుపైగా అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం, బాంబులు ఎవరు పెట్టారో పోలీసులతో విచారణ చేసి ఎందుకు తేల్చలేదు? మీ బుకాయింపునకు సమాజం విస్తుపోతోంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికను ఎల్ అండ్ టి తిరస్కరించడాన్ని కెటిఆర్ స్వాగతించడం ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. నిర్మించిన నాలుగేండ్లకే మేడిగడ్డ భూమిలో ఐదు అడుగులు ఎందుకు కుంగింది? నిట్ట నిలువునా పునాది నుండి పైవరకు ఎందుకు చీలిపోయింది? మూడు బ్యారేజీలలో భూ అంతర్గత, భూ సాంకేతిక పరీక్షలు, ఇంకా అనేక పరీక్షలు ప్రముఖ వైజ్ఞానిక సంస్థలతో అన్నారం, సుందిళ్లలో కూడా చేయించాలని ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు సిఫారసు చేస్తున్నది? మూడు బ్యారేజీల లోనూ మేడిగడ్డ లాంటి అత్యంత ప్రమాదకర పరిస్థితిలే ఉన్నాయనేది వాస్తవం కాదా? ఎన్డిఎస్‌ఎ పేర్కొన్నట్లు ఆ నాలుగు సంవత్సరాలలో మేడిగడ్డ బ్యారేజ్ గుండా ప్రవహించిన భారీ వరద నీరు మేడిగడ్డ కుప్పకూలడానికి ప్రధాన కారణం.ఇందులో 90 శాతం నీరు ప్రాణహితదే. కెసిఆర్ ఒత్తిడిలో ఇంజనీర్లు సృష్టించిన వైకల్య విపత్తు ఇది.తక్కువ ఖర్చుతో పూర్తయ్యే తుమ్మిడిహెట్టి రాక్ బెడ్‌ను వదిలి,మూడు బ్యారేజీలను బలహీన ఇసుక బెడ్ దగ్గర రీ ఇంజనీరింగ్,రీ డిజైనింగ్ చేయడమే ఈ విపత్తుకు కారణం'' అని సామాజిక కార్యకర్త నయనాల గోవర్ధన్ అంటున్నారు.

# 'భారతమాత'పై అనవసర రాద్ధాంతం

బినొయ్ విశ్వం
మాజీ ఎంపి, సిపిఐ జాతీయ కార్యదర్శి

ఏటా జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించి ఇటీవల కేరళలో అకస్మాత్తుగా, అవసరం లేని వివాదం తలెత్తింది. దీనిని దురదృష్టవశాత్తు రాజ్‌భవన్ రేకెత్తించింది. కేరళలో ప్రతి ఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విస్తృతంగా నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని వేలాది మొక్కలను నాటుతుంటారు. ప్రజలు ఈ రోజును తమకు పర్యావరణంపై ఉన్న అవగాహనను, దాని పట్ల గల నిబద్ధతను సుసంపన్నం చేసుకునే రోజుగా జరుపుకుంటూ ఉంటారు.

**ప్రతిపాదన**

ఈ ఏడాది రాజ్‌భవన్ ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. దీనిని ప్రారంభించేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అంగీకారం తెలిపారు. ముందు రోజు సాయంత్రం వ్యవసాయ మంత్రి కార్యాలయానికి కార్యక్రమ వివరాలను పంపిస్తూ, ఒక చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాల్సి ఉంటుందని రాజ్‌భవన్ కొత్త ప్రతిపాదన పెట్టింది. ప్రతిపాదన అందిన వెంటనే మంత్రి కార్యాలయం మరింత స్పష్టత ఇవ్వాలని కోరింది. ఇందుకు గవర్నర్ కార్యాయలం స్పందిస్తూ, 'భరతమాత' అని చెప్పబడే చిత్రపటం ఫోటోను పంపించారు. ఆశ్చర్యకరంగా రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) తమ కార్యక్రమాలలో ఉపయోగించే రూపమే ఆ చిత్రపటంలో ఉంది. రాజ్‌భవన్ పంపిన చిత్రంలో భారతమాత సింహంపై కూర్చొని, ఆర్‌ఎస్‌ఎస్ జెండాను తలపించే కాషాయ జెండాను పట్టుకొని ఉంది. చిత్రపటం నేపథ్యంలో ఉన్న దేశపటము కచ్చితంగా గణతంత్ర భారతదేశ పటం కాదు.

కొన్ని సంప్రదింపుల తరువాత, ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ఆ చిత్రపటాన్ని ఉపయోగించడం, ఎక్కువ చేసి చూపడం అసమంజసమని గవర్నర్ కార్యాలయానికి మంత్రి సమాచారం అందించారు. కానీ, ఆ చిత్రపటం లేకుండా కార్యక్రమం నిర్వహించే అవకాశమే లేదని, తాను హాజరుకాబోనని గవర్నర్ నొక్కి చెప్పారు. అందుకు గల కారణాలేమిటో ఆయనకే తెలియాలి.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో కార్యక్రమ వేదికను సచివాలయం ప్రాంగణానికి మార్చవలసి వచ్చింది. దానికి గవర్నర్ తప్ప అతిథులందరూ హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారతమాత పట్టుకున్న కాషాయజెండాను గవర్నర్ కీర్తించినట్లు వార్తలు వెలువడ్డాయి. అది భారతదేశ ప్రతీక అని ఆయన వాదించారు. కేరళ ప్రభుత్వాన్ని, భారతమాత అనే ఆయన ఆలోచనను సమర్థించేందుకు సిద్ధంగా లేనివారిని విమర్శించారు కూడా.

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వ హయాంలో గవర్నర్‌లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు కేవలం కేరళకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా చోటుచేసుకున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. ఇప్పుడు ఈ వివాదాలకు భారతమాతను కేంద్రస్థానానికి తీసుకువచ్చారు గవర్నర్ ఆర్లేకర్.



భారతమాత వివాదానికి వ్యతిరేకంగా ఎఐవైఎఫ్ నిర్వహించిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బినొయ్ విశ్వం

**చలనశీల భావన**

భారతమాత భావన భారతదేశ ప్రజల సామూహిక స్మృతిలో వేళ్ళూనుకుంది. వలసవాద వ్యతిరేక పోరాటంలో ఈ భావనను విభిన్న సామాజిక రాజకీయ దృక్పథాలు కలిగిన వేర్వేరు సమూహాలు, సాతంత్ర్యపోరాటంలో సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తి కలిగించి, ఐక్యపరిచేందుకు ఉపయోగించేవి. ఒక ప్రత్యేక భావననే నిజమైన వ్యక్తీకరణగా, భారతమాత రూపుగా ఎవ్వరూ వాదించలేదు. అదొక విస్తృత భావన.

జాతి, జాతీయత, ప్రపంచ దృక్పథాలపై తమ స్వంత భావనలకు అనుగుణంగా అనేక మంది భారతమాతను అన్వయించుకున్నారు. చాలా కాలం తరువాత ఆర్‌ఎస్‌ఎస్ తన స్వంత అవసరాల కోసం , భారతమాత గురించి తమ స్వంత ఆలోచనతో ముందుకు వచ్చి ఉండొచ్చు.

ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన భారతమాత మాత్రమే నిజమైన ప్రతిమ అనే భావనను వ్యక్తిగా విశ్వసించే హక్కు గవర్నర్ ఆర్లేకర్‌కు ఉంటుంది. ఒక నిర్దిష్ట సిద్ధాంత ప్రభావంలో ఉండే వారికి భారతమాత కాషాయ జెండాను పట్టుకొని ఉంటుందనే ఆలోచన చేసే హక్కు ఉంటుంది. ఆమె సింహంపై కూర్చొని ఉండడాన్ని కూడా వారు స్తుతించవచ్చు. భారతమాత చిత్రపటంలో వెనుకాల ప్రత్యేకంగా గీసిన దేశపటం కూడా సరైనదేనని వారికి అనిపించవచ్చు.

తన సైద్ధాంతిక, సంస్థాగత చట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ అఖండ భారత్' అనే తమ స్వప్నానికి, సమరశీల పరాక్రమ జాతీయవాదానికి అనుగుణంగా భారతమాత రూపును ముందుకు తీసుకువచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ శాఖలలో ఇలాంటి భారతమాతను స్తుతించి ఉండొచ్చు. ఏదో ఒక వాదాన్ని మాత్రమే ఆమోదనీయమైన, అధీకృతమైనదిగా రుద్దడం వృథా ప్రయాస. అధికారిక కార్యక్రమాలలో ఆర్‌ఎస్‌ఎస్ తమ సైద్ధాంతిక, రాజకీయ భావజాలాన్ని జొప్పించేందుకు ప్రయత్నిస్తే విషయం మరింత సంక్లిష్టమవుతుంది. ప్రజాజీవితంలో గొప్ప అనుభవం కలిగిన గవర్నర్ ఆర్లేకర్‌కు ఇలాంటి కనీస సూత్రం తెలిసి ఉంటుందని ఆశిస్తాం. రాజ్యాంగ స్థానాలలో ఉండే వారు తమ రాజకీయ ఇష్టాయిష్టాలను ప్రదర్శించకూడదు. రాజకీయ నిబద్ధతకు, అధికారిక బాధ్యతకు మధ్య విభజన రేఖ వారి మదిలో మరింత ప్రస్ఫుటంగా ఉండాలి.


**నెహ్రూ ఏమన్నారంటే..**

గవర్నర్, ఆయన సైద్ధాంతిక ఆడుగుజాడలలో నడిచే ప్రజలకు అనేక కారణాల రీత్యా మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే ఇష్టం ఉండకపోవచ్చు. కానీ నెహ్రూను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఒక చోట ఇలా రాసారు – ''కొన్ని సార్లు నేను సమూహాన్ని చేరుకున్నప్పుడు, ఘన స్వాగత గర్జనలు నాకు అభివాదం చేస్తాయి: భారత్‌మాతాకీ జై – (మాతృభారతికి జయము) . అకస్మాత్తుగా వారిని నేను అడుగుతుంటాను.. ఈ అరుపులకు అర్థమేమిటి, ఈ భారతమాత ఎవరు.. భారతదేశం అంటే ఇదే అని వారు అనుకుంటారు. కానీ, అది అంతకంటే ఎక్కువ. భారతదేశ పర్వతాలు, నదులు, అడవులు, విశాల క్షేత్రాలు.. అవన్నీ కూడా మనకు ప్రియమైనవే, కానీ అంతిమంగా పరిగణనలోకి తీసుకునేది భారతదేశ ప్రజలను. వారిలాంటి ప్రజలను, నన్ను, విశాల నేలపై విస్తరించిన వారందరినీ. భారతమాత, మాతృభారతి, అంటే ఇలాంటి ప్రజలే. మీరంతా భారతమాతలో భాగాలే. ఒక విధంగా భారతమాత అంటే మీరే. ఈ ఆలోచన నెమ్మదిగా వారి మెదళ్ళల్లోకి ప్రవేశిస్తుంటే, ఒక గొప్ప ఆవిష్కరణను సాధించామనే భావనతో వారి కళ్ళు వెలిగిపోతాయి''.

# జీవనోపాధికి కుట్టు మిషన్

పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సూయింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించా అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి నేస్తమైంది కుట్టు మిషన్. మహిళలకు ఆకడత్వ మిత్రుడిలా నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి, నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం సాధారణమైంది.

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 13 జూన్‌న జాతీయ కుట్టు మిషన్ దినం లేదా నేషనల్ సీవింగ్ మిషన్ డే పాటించడం ఆనవాయితీగామారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్యజీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగామారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పనితీరు పట్ల అవగాహన, మిషన్



సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్రడిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం లాంటివి చేయవచ్చు.

కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 1829జూన్13న ఫ్రెంచ్ టేఫెంచ్ బార్థలెమి టిమ్మోనియర్ కృషితో కుట్టు యంత్రం తయారైంది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది. 10 సెప్టెంబర్ 1847న అమెరికన్ ఇలియాస్ హోవె తొలిసారి కుట్టు మిషన్‌ను పేటెంట్ చేసారు. 1851లో ఐజాక్ సింగర్ అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందింది వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. ఇలా కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది.

నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి, మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిహార్‌లో నిరుద్యోగం పెరిగిపోవడంపై కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు

**పాట్నా :** బిహార్‌లో ఉద్యోగాలు సృష్టించడంలో నితీశ్‌కుమార్ ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. పాట్నాలో జరిగిన నిరసన ప్రదర్శనలో నిరసనకారులతో పార్టీ సీనియర్ నాయకుడు రాజ్యసభ ఎంపి దీపేందర్‌సింగ్ హుడా భాగస్వామి అయ్యారు. నియోజన్ భవన్ వరకు ర్యాలీ జరిగింది. ఆగ్రహించిన నిరసనకారులు 'నియోజన్ భవన్' గేట్లకు తాళాలు వేశారు. బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ(బిపిసిసి) అధ్యక్షుడు రాజేశ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఉద్యోగాలైనా ఇవ్వండి లేదా గద్దె నుంచి వైదొలగండి' (అవర్ నౌకరీ దో...యా గద్దీ చోడో) నిరసనలు బిహార్‌లోని 25ప్రాంతాలలో జరిగాయని చెప్పారు. రాష్ట్రంలోని 25 నియోజన్ భవనాలు పనికిరాకుండా పోతున్నాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టని ఫలితంగా అవినిరుపయోగంగా ఉన్నాయన్నారు.

# భారత్‌లో జరిగిన భారీ విమాన ప్రమాదాలు..

**న్యూఢిల్లీ :** గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన విమానం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో భారత్‌లో జరిగిన విమానాల ప్రమాదాల్లో ఇది భారీదని నిపుణులు భావిస్తున్నారు. గతంలో జరిగిన భారీ విమాన ప్రమాదాలు పరిశీలిస్తే...



* 2020 కరోనా మహమ్మారి సమయంలో విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా బోయింగ్ 737–800 విమానం దుబాయ్ నుంచి కేరళలోని కోజికోడ్‌కు బయలుదేరింది. అదే సమయంలో భారీ వర్షం కారణంగా అదుపుతప్పింది. 30 అడుగుల లోయలో పడి విమానం రెండుగా చీలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్ల సహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

* 2010 మేలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 812 కుప్పకూలింది. ఇది అత్యంత భారీ ప్రమాదం. 166 మంది ప్రవాస భారతీయులు ఉన్న ఈ విమానం దుబాయ్ నుంచి మంగళూరుకు వచ్చింది. సకాలంలో రన్‌వేపై ఆగలేకపోయింది. రన్‌వే దాటి లోయలోకి దూసుకెళ్లింది. మంటలు చెలరేగడంతో 158 మంది మృతి చెందారు. వీరిలో 8 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

* 1998 జులైలో అలయన్స్ ఎయిర్ ఫ్లైట్ బోయింగ్ 7372 ఎ8 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. జనాలు ఉన్న ప్రాంత్రంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన బిహార్‌లోని పట్నా విమానాశ్రయం సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 55 మంది ప్రయాణికులు మరణించగా.. మరో ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు.

* 1996 హరియానాలో మరో ఘోర ప్రమాదం జరిగింది. సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానం 763, కజికిస్థాన్ ఎయిర్ లైన్స్ విమానం 1907 ఢీకొన్నాయి. సమాచారం లోపం కారణం ఈ ప్రమాదం జరిగింది. రెండు విమానాల్లో 340లకు పైగా మంది ప్రయాణికులు, సిబ్బంది మరణించారు.

* 1993 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన ఇండియన్ ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం సమయంలో ప్రమాదానికి గురైంది. రన్‌వేపైకి వచ్చిన ట్రక్కును ఢీకొట్టింది. దీంతో విమానంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 118 మంది ప్రయాణికులు, సిబ్బంది 55 (గ్రౌండ్ సిబ్బందితో కలిపి) ప్రాణాలు కోల్పోయారు.

* బెంగళూరు విమానాశ్రయంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 కుప్పకూలింది. రన్‌వేను తాకడంతో నాడు ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటన 1990 ఫిబ్రవరిలో చోటు చేసుకుంది. ఈ విమాన ప్రమాదంలో 146 ప్రయాణికులు, 92 మంది విమాన సిబ్బంది చనిపోయారు.

# న్యాయ క్రియాశీలత.. న్యాయ ఉగ్రవాదంగా మారకూడదు

### లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో జరిగిన సెమినార్‌లో సిజెఐ గవాయ్

**న్యూఢిల్లీ :** న్యాయపరమైన క్రియాశీలత నిలదొక్కుకోవాలి కానీ, అది న్యాయ ఉగ్రవాదంగా మారకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ఉద్ఘాటించారు. న్యాయ సమీక్ష అధికారాన్ని తక్కువగానే ఉపయోగించాలని, అయితే ఒక చట్టం రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించినపుడే దానిని అమలు చేయాలన్నారు. సాధారణంగా న్యాయవ్యవస్థ ప్రవేశించకూడని ప్రాంతంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంటారు' అని ఒక లీగల్ న్యూస్ పోర్టర్ నుంచి వచ్చిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా చెప్పారు. 'రాజ్యాంగం అనేది సిరాలో చెక్కబడిన నిశ్శబ్ద విప్లవం' అని అభివర్ణించారు. అది చారిత్రకంగా అణిచివేతకు గురైన వారి ఉద్ధరణకు హామీ ఇవ్వడమే కాకుండా ఒక పరివర్తన కలిగించే శక్తిగా పని చేస్తుంది' అని గవాయ్ చెప్పా రు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో మంగళవారం 'రాజ్యాంగ వాగ్దానం అమలు..ప్రాతినిధ్యం నుంచి ఆచరణ వరకు' అనే అంశంపై జరిగిన సమావే



శంలో ఆయన ప్రసంగించారు. 'రెండవ దళితుడు, మొదటి బుద్ధుడిగా అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన అణగారినవర్గాలపై సానుకూల ప్రభావాన్ని హైలెట్ చేస్తూ తననే ఒక ఉదాహరణగా చెప్పారు. అనేక దశాబ్దాల క్రితం భారతదేశంలోని మిలియన్ల కొద్దీ పౌరులు అంటరానివారిగా పిలువబడ్డారు. వారిని అపవిత్రులుగా చెప్పబడ్డారు. వారు వారికి వారుగా నోరువిప్పి మాట్లాడలేని వారుగా చెప్పబడ్డారు. 'కానీ ఈ రోజు మేం ఉన్నాం అని చెబుతున్నాం. ఎవరైతే అలా చెప్పబడ్డారో ఆ వర్గానికి చెందిన ఒక వ్యక్తే స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. ఈ దేశంలోనే అత్యున్నత న్యాయవ్యవస్థ కార్యాలయానికి ఆయన నిర్వాహకుడుగా ఉన్నారు' అని సిజెఐ చెప్పారు.

# జస్టిస్ యశ్వంత్‌వర్మ అవినీతి 'అభిశంసన'పై 'సుప్రీమ్' నివేదిక వెల్లడించండి

### కేంద్ర సర్కార్‌కు కాంగ్రెస్ విజ్ఞప్తి
### పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానానికి ప్రభుత్వం కసరత్తు



**న్యూఢిల్లీ :** జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ నివేదికను పార్లమెంట్ సమావేశాలకు ముందే ఆయన అభిశంసనపై ప్రభుత్వానికి వైఖరిని స్పష్టం చేయడం కోసం షేర్‌చేయాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ విషయాన్ని గురువారం ఆ పార్టీ వర్గాలు తెలియజేశాయి. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదని ఆ వర్గాలు చెప్పాయి. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన అధికారిక నివాసంలో మార్చిలో జరిగిన అగ్నిప్రమాదంలో అనేక నగదు కట్టలు కాలిపోయినట్లు కనుగొనడంతో ఆరోపణలు తలెత్తాయి. ఆ తర్వాత ఆయన అలహాబాద్ హైకోర్ట్‌కు బదిలీ చేయబడ్డారు. కాలిపోయిన ఆ నగదు గురించి తనకు తెలియదని స్పష్టం చేశారు. అయితే ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ అనేకమంది సాక్షులను విచారించి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేసి జస్టిస్ యశ్వంత్‌వర్మపై నేరారోపణ చేసింది. ఈ నేపథ్యంలో జులై నెల 21నుంచి జరుగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. ఈఅభిశంసన తీర్మానం పట్ల తమ వైఖరిని స్పష్టం చేయడానికి కమిటీ రిపోర్టును షేర్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మంత్రి కిరెణ్ రిజిజును కోరిందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలియజేశాయి. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా తీసుకురానున్న అభిశంసన తీర్మానంపై అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు గతవారం నొక్కిచెప్పారు. న్యాయవ్యవస్థలో అవినీతి మరకను తుడిచివేసే ఒక పారదర్శక పార్టీగా అందరినీ కలుపుకుని పరిష్కరిస్తామని రిజిజు తెలియజేసిన విషయం తెలిసిందే. దీనికి అందరూ సమష్టి ప్రయత్నం చేసేలా కసరత్తు చేస్తామని ఆయన చెప్పారు.

# కర్ణాటకలో మళ్లీ తాజా కులగణన

### ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడి

**బెంగళూరు :** పదేళ్ళ క్రితంనాటి కాలం చెల్లిన నివేదకను పక్కనపెట్టిన కర్ణాటక ప్రభుత్వం మళ్ళీ కొత్తగా కులగణన సర్వే చేయాలని నిర్ణయించింది. ఈ 'సోషియో ఎడ్యుకేషనల్ సర్వే' జనం మధ్య కులగణనగా పేరుపొందింది. పది సంవత్సరాల క్రితం చేసిన ఈ కులగణనలో తమను విస్మరించారంటూ ప్రధానంగా రెండు వర్గాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో మంత్రివర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారంనాడు చెప్పారు. 2015లో గణాంకాల ఆధారంగా చేసిన సోషియో–ఎడ్యుకేషనల్ సర్వే నివేదిక ఆమోదం నిమిత్తం ఇప్పటికే మంత్రివర్గం ముందుకు వచ్చింది. ఈ తరుణంలో వచ్చిన ఫిర్యాదులు, అధిష్ఠానం ఆదేశాల మేరకు మంత్రివర్గం కొత్త నిర్ణయం తీసుకుంది. ఐతే ఇది ఒక్కలింగాస్‌కు, వీరశైవ లింగాయత్‌లకు సంబంధించిన విషయం కాదనీ, ఇది ఇతర వెనుకబడిన తరగతులకు సంబంధించిన విషయమని ముఖ్యమంత్రి చెప్పారు.

కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ తాజా సర్వే నిర్వహించి 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఐతే ఈ సర్వే చేసేందుకు ఎంత ఖర్చు అవుతుందనే విషయం మాత్రం చెప్పలేదు. ''మంత్రివర్గంలో ఈ





మేరకు మేం ఒక నిర్ణయం తీసుకున్నాం, తాజాగా కొత్త సర్వే చేసేందుకు మూడు నెలలు గడువు విధించాం, వారు నివేదిక ఇస్తారు'' అని చెప్పారు. ఇటీవల సిద్ధరామయ్య స్టేడియంలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఢిల్లీలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీలను కలిసి వచ్చారు. తర్వాత మంగళవారంనాడు ఈ ఇద్దరు పార్టీ అగ్రనాయకుల ఆదేశం మేరకు మంత్రివర్గం తీర్మానం చేసింది. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చట్టం సెక్షన్ 11(1) ప్రకారం ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా సెక్షన్ 11(2) ప్రకారం కమిషన్‌ను సంప్రదించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2015 నాటి కులగణన నివేదిక మొదట ఈ ఏడాది ఏప్రిల్ 11వ తేదీన మంత్రివర్గం ముందుకు వచ్చింది. ఇక అప్పటినుండీ మూడు,నాలుగుసార్లు మంత్రివర్గం సమావేశాలు జరిపి ఈ నివేదికపై చర్చించింది. ఈ కులగణన నివేదికపై వివిధ వర్గాలు ప్రధానంగా కర్ణాటకలో ఉన్న వొక్కలింగాస్, వీరశైవలింగాయత్‌లు 2015లో చేసిన కులగణనను అశాస్త్రీయమైనదిగా పేర్కొంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని తిరస్కరించాలని ఈ రెండు ప్రధాన వర్గాలు డిమాండ్ చేశాయి. అదేవిధంగా అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ పాత నివేదికపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ''ఐతే పాత నివేదికను తిరస్కరించారా?'' అని ప్రశ్నించగా, ఆ నివేదిక రూపొందించి పదేళ్ళు గడచిపోయిందని, చట్టం చెప్పిన ప్రకారం కొత్తగా సర్వే చేయాల్సి ఉంటుందని సిద్ధరామయ్య అన్నారు. అంటే ప్రభుత్వానికి చట్టం గురించి తెలియదా? లేక కేంద్ర అధిష్ఠానం ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నారా? అని పాత్రికేయులు ప్రశ్నించారు. దీనిపై ఆయన సమాధానం చెబుతూ, ''మేం ఈ చట్టాన్ని పరిశీలించాం, ఈ విషయాలన్ని మంత్రివర్గంలో పలుసార్లు చర్చకు వచ్చాయి, ఈ మధ్యలో పార్టీ అధిష్ఠానం కూడా ఒక సలహా మా ప్రభుత్వానికి ఇచ్చింది'' అన్నారు. రాబోయే జనాభా గణాంకాలలో కులగణనను కూడా కలిపి నిర్వహించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయంచిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చినప్పుడు, తాము చేసే సర్వే కేంద్ర ప్రభుత్వం చేసే సర్వేకు చాలా భిన్నమైనదన్నారు. అంటే పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు ప్రభుత్వం తలవొగ్గిందా? అని పాత్రికేయులు ప్రశ్నించారు. ''మేం తలొగ్గలేదు, కేంద్ర అధిష్ఠానం చేసిన ఎలాంటి ఒత్తిడికి మేం తలొగ్గలేదు, ప్రభుత్వం చట్టం చెప్పినట్లుగా వ్యవహరిస్తుంది'' అని సిద్ధరామయ్య సమాధానం చెప్పారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన నుండి ప్రజల దృష్టి మళ్ళించడంకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే విషయాన్ని తెరమీదకు తీసుకువచ్చిందని బిజెపి చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి తిరస్కరించారు.

# తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే
### రవీంద్రనాథ్‌ఠాకూర్ పూర్వీకుల నివాసం ధ్వంసం, 'యుఎస్' పాక్ ఆర్మీ చీఫ్‌కు ఆహ్వానంపై చర్చ డిమాండ్

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో రవీంద్రనాథ్ ఠాకూర్ పూర్వీకుల నివాసం విధ్వంసం, అమెరికా సైన్యం 250వ వార్షికోత్సవానికి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌కు ఆహ్వానం అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో చర్చించేందుకు వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గురువారం తన 'ఎక్స్'లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల నివాసం విధ్వంసాన్ని ఆయన ఖండించారు. 'ఈ రెండు సంఘటనలు అంతర్జాతీయ స్థాయిలో తీవ్రస్థాయిలో విచారించదగినవి. అమెరికా సెంట్‌కామ్ కమాండర్ తన అద్భుత



మైన కౌంటర్ టెర్రరిజం భాగస్వామియైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను అమెరికా ఆర్మీ 250వ వార్షికోత్సవానికి ఆహ్వానించడం బాధాకరం' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.బంగ్లాదేశ్‌లోని సిరాజ్‌గంజ్‌లో బంగ్లాదేశ్ జాతీయగీతం 'అమర్ సోనార్ బంగ్లా' రచయిత గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల నివాసంపై విధ్వంసాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది ఖర్గే 'ఎక్స్' పోస్టింగ్ లో ఆవే



దన వ్యక్తం చేశారు. విదేశీ విధానానికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలు కూడా చర్చించడానికి ఉన్నాయన్నారు. మేము ఎప్పటినుంచో అన్ని రాజకీయ పార్టీల సమావేశాన్ని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తూనే ఉన్నా ఖాతరు చేయడం లేదన్నారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి సమక్షంలో ఒక సమావేశాన్ని నిర్వహించాలని, ప్రతిపక్షాలతో చర్చించి, ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. జాతీయ ప్రయోజనాల కోసం ఈ సమావేశం నిర్వహించాలని అనేకసార్లు ఇప్పటికే విజ్ఞప్తి చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ 'పిటిఐ' తో మాట్లాడుతూ అమెరికా ఇటీవలి ప్రకటనలు ఒక సవాల్, ఒక హెచ్చరికగా ఉన్నాయని, వీటి గురించి లోతుగా చర్చించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విభజన రాజకీయాలను ప్రోత్సహించేందుకే ఆసక్తి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. అమెరికా పాకిస్థాన్‌కు క్లీన్ చిట్ ఇస్తున్నదని ఆరోపించారు. తాజాగా అమెరికా ఆర్మీ జనరల్ మైఖేల్ కురిల్లా, కమాండర్ ఆఫ్ యుఎస్ సెంట్రల్ కమాండ్ (సిఇఎన్‌టిసిఒఎం) మాట్లాడుతూ కౌంటర్ టెర్రరిజంలో పాకిస్థాన్ చురుకుగా వ్యవహరిస్తున్నదని ప్రశంసిస్తూ ప్రస్తుతం పాకిస్థాన్ ప్రపంచానికి అద్భుత కౌంటర్ టెర్రరిజం భాగస్వామి అని కితాబు ఇచ్చిన విషయాన్ని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు.

# ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి చేరిన కొనుగోలు ధరల ద్రవ్యోల్బణం

### దేశంలో తెలంగాణలోనే అతి తక్కువ

**న్యూఢిల్లీ :** దేశంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత కొనుగోలు ధరల ద్రవ్యోల్బణం ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి క్షీణించింది. రాష్ట్రాల వారీగా చూసినప్పుడు దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అతి తక్కువగా 0.55 శాతమ మేరకు ద్రవ్యోల్బణం నమోదైనట్లు ప్రభుత్వ డేటా తెలియజేసింది. ఈ ద్రవ్యోల్బణం మే నెలలో 2.82 శాతంగా నమోదు కావడంతో మంట తగ్గి ఆహార ధరలు చల్లబడినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా తెలియజేసింది. గురువారంనాడు ప్రభుత్వం ఈ గణాంకాలను విడుదల చేసింది. ఏప్రిల్ నెలలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత కొనుగోలు ద్రవ్యోల్బణం 2024 అతి తక్కువగా 3.16 శాతం, మే నెలలో 4.8 శాతాలుగా నమోదయ్యాయి. 2019లో కూడా అతి తక్కువగా 2.57 శాతంగా సిపిఐ నమోదైంది. ఆరేళ్ళ తర్వాత ఇప్పుడు మళ్ళీ చల్లబడి ఈ ధరల సూచీ 2.82 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో రిజర్వు బ్యాంకు గతవారంలో 50 బేస్ పాయింట్లను తగ్గించింది. దీంతో గడచిన ఫిబ్రవరి నుండి ఇప్పటివరకూ 100 బేస్ పాయింట్లను తగ్గించినట్లయింది.ఏడాది క్రితం మే నెలలో ఆహార ద్రవ్యోల్బణ భారీస్థాయిలో 8.69 శాతంగా నమోదు కాగా, ఈ ఏడాది మే నెలలో ఇదే ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా 0.99 శాతానికి తగ్గిపోయిందని ఎన్ఎస్ఓ పేర్కొంది.

''మొత్తం ఆర్థిక వ్యవస్థలో ధరల కదలికలు, ఆహార ద్రవ్యోల్బణం 2025 మే నెలలో గణనీయంగా క్షీణించడానికి ప్రధాన కారణం




పప్పులు, ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, వాటి ఉత్పత్తులు, గృహోపకరణాలు, సేవలు, చక్కెర, తీపి వస్తువులు, చాక్లెట్లు, గ్రుడ్లు, ధరలు తగ్గడమేనని ఎన్ఎస్ఓ తన ప్రకటనలో తెలిపింది. గ్రామీణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం మే నెలలో 2.59 శాతం మేరకు ఉండగా, పట్టణభారత ప్రాంతాలలో ద్రవ్యోల్బణం 3.07 శాతంగా నమోదైంది. కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలలో ద్రవ్యోల్బణాన్ని పరిశీలిస్తే, కేరళలో 6.46 శాతం, పంజాబ్‌లో 5.21 శాతం, జమ్మూ కశ్మీరులో 4.55 శాతం, హర్యానాలో 3.67 శాతం, ఉత్తరాఖండ్‌లో 3.47 శాతంగా నమోదైంది. తెలంగాణలో అతి తక్కువగా 0.55 శాతం మేరకు ద్రవ్యోల్బణం నమోదైంది. నాలుగుశాతం కంటే అతి తక్కువస్థాయికి భరించగలిగేరీతిలో ద్రవ్యోల్బణం ఉండాలని రిజర్వు బ్యాంకుకు కేంద్ర ప్రభుత్వం ఒక లక్ష్యనిర్దేశం చేసింది. దీంతో రిజర్వుబ్యాంకు పూర్తిగా తన సర్వశక్తులనూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంపైనే కేంద్రీకరించింది. రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ తీసుకున్న నిర్ణయాలవల్లే ఈ ఈ స్థాయికి వచ్చిందని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ ఆదిత్య నాయర్ అన్నారు.




### భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నాం, కానీ..

# ఇండియన్ ప్రెస్ నకిలీ వార్తలతోనే సమస్య : యూనస్

### హసీనాను కట్టడి చేయమని మోదీని అడిగా... కుదరదన్నారు

**లండన్ :** భారతదేశంతో బంగ్లాదేశ్ సత్సంబంధాలను కోరుకుంటున్నదనీ, కానీ భారత పత్రికావ్యవస్థ, మీడియా వెదజల్లే నకిలీ వార్తల ప్రచారంతో ఆటంకాలు ఏర్పడుతున్నాయని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ వ్యాఖ్యానించారు. ''చాలామంది చెబుతున్నది ఏమిటంటే భారతదేశంలో అత్యున్నతస్థాయి విధాన నిర్ణేతలకు దీనికి ఏదో సంబంధం ఉందని చెబుతున్నారన్నారు. దీనివల్ల బంగ్లాదేశ్ చాలా భయపడుతోందని, అధైర్యపడుతోందన్నారు. బ్రిటన్‌లో నాలుగు రోజుల పర్యటన చేస్తున్న యూనస్ మూడోరోజు గురువారం లండన్ ఛాథమ్ హౌస్ బుద్ధిజీవుల సంచాలకుడు బ్రౌన్‌వెన్ మాడ్డోక్స్‌తో అనేక విషయాలు చర్చించారు. భారత్‌తో ద్వైపాక్షిక అంశాలతోపాటు ఇరుగుపొరుగు సంబంధాల గురించి యూనస్ మాట్లాడారు. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యం కోసం ఒక బృహత్తర ప్రణాళికను వచ్చేనెల 'జులై ఛార్టర్' ప్రారంభించడం గురించి ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా భారత్‌లో తలదాచుకున్న విషయం, ఆమెను బంగ్లాదేశ్‌కు తిప్పిపంపాలని తాత్కాలిక ప్రభుత్వం చేసిన డిమాండ్ గురించి మడ్డోక్స్ ప్రస్తావించినప్పుడు, చాలా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. భారతదేశంలో తమకు ఎలాంటి మౌలిక సమస్యలూ లేవన్నారు. దేశంలో ఆగ్రహం పెల్లుబుకుతోంది, ఈ ఆగ్రహం నుండి దేశాన్ని బయటపడేసేందుకు తాము ఎంతో ప్రయత్నం చేస్తు న్నాం, సైబర్ చర్యల కారణంగానే ఇదంతా జరుగుతోంది, దీనినుండి మేం వెనక్కు వెళ్ళలేం, వారు ఆకస్మికంగా ఏదోఒకటి చెబుతారు, ఆచరణలో ఇంకేదో చేస్తారు, దాంతో తిరిగి



ఆగ్రహం పెల్లుబుకుతుంది'' అని యూనస్ భారత్‌ను తీవ్రంగా తప్పుపట్టారు. ఇది మాకు ఒక పెద్ద సవాలు, ఈ లక్ష్యాన్ని మేం ఛేదించాలి, ప్రజలకు శాంతియుత జీవనాన్ని అందించాలన్నారు. హసీనా విషయంలో భారతదేశం పాత్ర స్పష్టంగా లేదన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో తీవ్రఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి, ఇప్పుడు ఆమె భారత్‌కు వెళ్ళారు, అందువల్ల ఆమెపై ఉన్న ఆగ్రహం అంతా కూడా ఇప్పుడు భారత్‌పైకి మళ్ళింది'' అన్నారు. ''ప్రధానమంత్రి మోదీతో ఇటీవల నాకు మాట్లాడే అవకాశం వచ్చింది, మీకు షేక్ హహసీనాకు ఆతిథ్యం ఇచ్చారు, అది మీ విధానం,ఆ విధానాన్ని మార్చుకోమని నేను మిమ్మల్ని అడగడంలేదు, కానీ ఆమె మీ దేశంలో కూర్చుని బంగ్లాదేశ్ ప్రజలపై విమర్శలు చేయకుండా కట్టడి చేయండి, ఆమె ఆన్‌లైన్‌లో బంగ్లాదేశ్ ప్రజలపై విమర్శలు గుప్పిస్తున్నారు,దీంతో యావత్ బంగ్లాదేశ్ ఆగ్రహంతో ఊగిపోతోంది అని మోదీకి చెప్పాను, కానీ మోదీ మాత్రం, ''హసీనా సోషల్ మీడియా కార్యకలాపాలను మేం కట్టడి చేయలేం'' అని చెప్పేశారు. కానీ ఆ విధంగా చెప్పినంతమాత్రాన సరిపోదు, బంగ్లాదేశ్‌లో ప్రజలు అట్టుడికిపోతున్నారు, మీరు ఏదో ఒక మాట చెప్పేసి వెళ్ళిపోతే కుదరదని యూనస్ అన్నారు. షేక్ హసీనా ప్రధానమంత్రి పదవి నుండి వైదొలగిన తర్వాత భారత్–బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** సమాజంలో బడిలో ఉండవలసిన బాలలు పనిలో ఉంటున్నారని బాలలతో పని చేయించే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి పి పురుషోత్తం పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జరిగిన బాలకార్మిక వ్యతిరేక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలల చేతులలో పుస్తకాలు ఉండాలి గాని పనిముట్లు కాదని వివిధ శాఖలు బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలలలో చేర్పించాలన్నారు. న్యాయ సేవ సంస్థ బాల కార్మికుల నిర్మూలనకు సంపూర్ణంగా సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, కార్మిక శాఖ అధికారి అరుణకుమారి, సిడబ్ల్యుసి చైర్మన్ చింత కృష్ణ, చీఫ్ అడ్వైజర్ డిఫన్స్ కౌన్సిల్ ఎన్ భీమార్జున్ రెడ్డి, బాలల అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నల్లగొండ జిల్లా లో ప్రసిద్ధిగాంచిన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన హుండి ఆదాయం రూ.63,09,560 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి యస్ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం చెర్వుగట్టు దేవస్థానంలో ముందుగా గట్టు క్రింద గల అమ్మవారి ఆలయ హుండి ఆదాయం రూ.7,95,660, గట్టు పైన స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం 55,13,900/లు 79 రోజులకు గాను రూ.63,09,560/ అక్షరాల అరవై మూడు లక్షల తొమ్మిది వేల ఐదు వందల అరవై రూపాయలు వచ్చినట్లు తెలిపారు. అధేవిధంగా దేవస్థాన సన్నిధిలో నిర్వహించే అన్నదానం రూ.49,512/ వచ్చినట్లు తెలిపారు. ఇట్టి హుండి లెక్కింపు కార్యక్రమము దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, నల్లగొండ శ్రీదుర్గ శివసాయి సేవా సమిత సభ్యులు,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నల్లగొండ బ్రాంచి సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్డు వెడల్పు చేస్తే ఇండ్లను కోల్పోతాం

### పనులు నిలిపివేయాలని సిపిఐ ఎమ్మెల్సీకి బాధితులు మొర

**ప్రజాపక్షం/మునుగోడు:** రోడ్డు వెడల్పు చేస్తే ఇండ్లు పూర్తిగా కోల్పోతాం... రోడ్డు వెడల్పు పనులు ఆపి న్యాయం చేయాలని బాధితులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలసి మొరపెట్టుకున్నారు. మునుగోడు మండల కేంద్రంలో తరతరాలు నుండి ఇండ్లను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నాం. అయితే ఇక్కడ నుండి చిట్యాల వరకు రోడ్డు వెడల్పులో భాగంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేసేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు కొలతలు కొలుస్తూ మార్కు చేస్తున్నారు. దీంతో ఇండ్లు కోల్పోతామని భయంతో ఆందోళన చెందిన బాధితులు ఎమ్మెల్సీ సత్యంను కలిసి తమకు న్యాయం చేయాలని కోరడంతో బాధితుల విన్నపం స్పందించి సంబంధిత ఆర్‌అండ్‌బి ఉన్నత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడారు. రోడ్డు వెడల్పు కోసం ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు,నిధులు మంజూరు కాలేదని అలాంటి సమాచారం ఉంటే సంబంధిత బాధితులకు ముందస్తు సమాచారం అందిస్తామని అధికారులు తెలిపారు. బాధితులకు ఎప్పుడు అన్యాయం జరిగినా తాను అందుబాటులో ఉంటానని ఎవరు కూడా ఆందోళన చెందొద్దని ప్రజలకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ విద్యా వ్యవస్థను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి కృషి చేస్తూ విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** అంతర్జాతీయ 11వ యోగా ఉత్సవాల సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఎంహెచ్‌వో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజు యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంతో పాటు ఉల్లాసంగా ఉండవచ్చునని అన్నారు. ఈనెల 21వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు, జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా ప్రొగ్రామ్ ఆఫీసర్ నునావత్ కుమార్, డాక్టర్ బి.రామకృష్ణ, డాక్టర్ విజయసారథి, డాక్టర్ ప్రసాద్, యోగ శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వకుంటే రాజీనామా



**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి తనకు వద్దు జిల్లా అధ్యక్షులు ఇవ్వాలని లేదంటే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన మీద ఉన్న నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్త నుండి పట్టణ అధ్యక్షునిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులుగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. తాను ఎప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే ఉంటానని తనపై కొంతమంది పనిగట్టుకొని కోమటిరెడ్డికి దూరం అవుతున్నారని,కాంగ్రెస్ పార్టీ వీడుతున్నారని ప్రచారం చేయడానికి పార్టీ కార్యకర్తలు,ప్రజలు నమ్మొద్దని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట ఏడిఏ శాంతి నిర్మల అన్నారు. గురువారం మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీలర్ కేంద్రాలను తనిఖీ చేశారు. విక్రయ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ యాదగిరిగుట్ట శాంతి నిర్మల, ఎంఏఓ యాదగిరిగుట్ట సుధా, ఎంఏఓ బోధన్ పోచంపల్లి శైలజ, ఎంఏఓ ఆత్మకూర్ ఎం పూజ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ రాకతో హ్యాండ్లూమ్ వ్యాపారాలు వృద్ధి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మిస్ వరల్ కంటెస్టెంట్స్ రాకతో చేనేత వస్త్ర వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయని నేత కార్మికులకు మద్దతుతో పాటు ప్రోత్సాహం లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర గవర్నర్ పోచంపల్లిని సందర్శించి నేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చేనేత పరిశ్రమ స్థితిగతులను తెలుసుకొని మెరుగైన ఫలితాలు సాధించడం కోసం గవర్నర్ పోచంపల్లిని సందర్శించిన సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు జీవనస్థితిగతులను సునిశితంగా తెలుసుకునేందుకు రావడం కార్మికుల ముఖాముఖిలో అభిప్రాయాలను తెలుసుకొని ప్రభుత్వానికి తగు సూచనలు చేసి నేత పరిశ్రమను ఆదుకోవాలని ఆయనను కోరారు. తరచుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు పరిశ్రమను సందర్శిస్తూ ఉంటే ప్రచారం బాగా పెరిగి వ్యాపారాలు పెరుగుతాయని అన్నా రు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం వినూత్న పథకాలతో చేయూతను అందిస్తుందని పేర్కొన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కు యాదాద్రి భువనగిరి జిల్లా కు త్రిఫ్ట్ పథకం కింద 90 కోట్ల రూపాయలు ఇచ్చిందని, అలాగే రుణ మాఫీ కింద ఆర్థిక సహాయం ఇవ్వనుందని, నేతన్న భరోసా ,నేతన్న బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గవర్నర్తో ముఖాముఖిలో పాల్గొన్న పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, తడక రమేష్, అంకం పాండు, మెరుగు శశికళ, గుర్రం హేమలత, భారత గగనలు చేనేత పరిశ్రమ పట్ల అభిప్రాయాలు తెలిపారు. పోచంపల్లి చేనేత ఉత్పత్తులు బాగున్నాయని, అయితే మార్కెటింగ్ సరిగాలేదని, ఈ సమస్యను పరిష్కరిస్తే నేత కార్మికులు బాగుపడతారని, వ్యవసాయ రంగానికి సహకరించినట్లు గానే చేనేత రంగానికి కూడా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. పోచంపల్లి గ్రామం ఇక్కత్ కు మాత్రమే ప్రసిద్ధి కాదని, ఇది నాలుగు రకాల సబ్జెక్టులతో ముడిపడి ఉందని, నేత, డయింగ్, కలర్ అన్నిరకాల పరిజ్ఞానం చేనేత కార్మికులందరికీ జియో ట్యాగింగ్ ఇవ్వాలని ,ఇక్కత్ పరిజ్ఞానాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆత్మస్థైర్యం తో పాటు, జీవన ప్రమాణాలు పెరిగాయని, త్రిఫ్ట్ పథకం వల్ల తనాకు రెండు లక్షల 15 వేల రూపాయలు వచ్చాయని, పిల్లల చదువుకు వినియోగించానని,అయితే నేత కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తోపాటు ఆయన ఉపేందర్, భాగ్యలక్ష్మి , యాదగిరి అనే నేత కార్మికులకు నేతన్న రుణాల కింద 5 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. నేతన్న పొదుపు పథకం కింద యాదాద్రి భువనగిరి జిల్లా మొత్తానికి రెండు కోట్ల పదిహేను లక్షల 25 వేల చెక్కును నేత కార్మికులకు అందజేశారు. అంతకుముందు పార్కులో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను గవర్నర్ ఉన్నతాధికారులతో పాటు ఆయన పరిశీలించారు. చేనేత కార్మికులు తెలుగులో చెప్పిన అభిప్రాయాలను టై అండ్ డై అధ్యక్షులు భారత లవ కుమార్ హిందీలో అనువాదం చేసి చక్కగా వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, జిల్లా కిసాన్ సేన అధ్యక్షులు , నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల డ్రై రన్...



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ముందస్తుగా కృష్ణానదికి వరద వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కొద్ది రోజుల క్రితం ప్రాజెక్టు అధికారులు రేడియల్ క్రస్ట్ గేట్ల రబ్బర్ సీల్ మరమ్మతు పనులను అదేవిధంగా 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్ చేసే సెంట్రల్ డివైజ్ యూనిట్, ఎండ్ డివైజ్ యూనిట్ లకు సంబంధించి సర్వీసింగ్, గ్రీజింగ్ పూర్తిచేయడం జరిగింది. అయితే గురువారం ప్రాజెక్టుకు సంబంధించిన 13 రేడియల్ క్రస్ట్ గేట్లను ప్రాజెక్టు అధికారులు డ్రై రన్ నిర్వహించడం జరిగిందని వీటితోపాటు ప్రాజెక్టు 5 క్రస్ట్ గేట్ల రోప్ లకు కార్డియం కాంపౌండ్ ను అప్లై చేయడం పూర్తయిందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. గేట్లకు సంబంధించిన మిగిలిన పనిని మరో రెండు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందని వారన్నారు.

**ప్రాజెక్టుకు స్వల్ప ఇన్ ఫ్లో....** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా గురువారం ఉదయం 8905 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంది. రెండు రోజుల క్రితం 590 అడుగులకు గాను511 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటి మట్టం స్వల్ప ఇన్ ఫ్లో తోగురువారం సాయంత్రానికి 512.60 అడుగులుగా ఉండి 136.1274 టీఎంసీల నీటి నిల్వ తో ఉంది కుడి ఎడమల కాలువ నుంచి ఎటువంటి నీటి విడుదల కొనసాగకపోవడంతో పాటు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ఎస్ ఎల్ బి సి ఏ ఎం ఆర్ పి ద్వారా మాత్రం 900 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదలవుతుంది.

## అక్రమ హద్దురాళ్ళను తొలగించి న్యాయం చేయండి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తమ సొంత భూమిలోనికి అక్రమంగా చొరబడి హద్దురాళ్ళను తొలగించిన వ్యక్తులపై చట్టరీత్యా చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు గార్లపాటి భూపాల్ రెడ్డి అధికారులను కోరారు. గురువారం నల్లగొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ మండలం, జి చెన్నారం గ్రామంలో కూకుంట్ల శేఖర్, వద్ద సర్వే నెం.70, 71 లలో 3ఎకరంల భూమిని కొనుగోలు చేసినామనీ ధరణిలో అట్టి భూమి నమోదు అయి 2021 లో పాసుబుక్ రావడం జరిగిందన్నారు. ఈ భూమిని భూమిని మండల, జిల్లా సర్వేయర్ సర్వే చేసి హద్దులు చూపడం జరిగిందనీ. ఆ రిపోర్టు ప్రకారం నేను నా భూమికి పోలీస్‌ల సమక్షములో హద్దు రాళ్ళు పాతుకొని కంచె ఏర్పాటు చేసుకున్నాననీ తెలిపారు.కాని మా పక్క భూమి యజమాని కంచర్లకుంట్ల వెంకట్రాంరెడ్డి దానిని తొలగించారు.వాళ్ళ కి సపోర్టుగా కనగల్ పిఎస్ ఎస్ఐ విష్ణు మమ్ముల్ని భయపెడుతున్నారనీ. మా భూమిపైకి ఇద్దరి కానిస్టేబుల్‌ను పంపించి మమ్ములను బెదిరిస్తున్నారని ఇట్టి విషయంలో పూర్తిగా పరిశీలించి సమగ్ర విచారణ జరిపించి ఎస్ఐ. పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు

### సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు జూన్ 20వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు రెవిన్యూ అధికారులు వస్తారని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని ఆధారాలతో రెవిన్యూ సదస్సులలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకి ఎంతో మేలు జరుగుతుందని, రెవిన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలమర్రి గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సు ద్వారా 169 దరఖాస్తులు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తదుపరి అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణంను సందర్శించారు. జిల్లాలో 610 రేషన్ షాపులకి 17,577 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం వచ్చినందున ప్రజలు ఎవరు ఆధైర్యపడకుండా ఉండాలని చివరి లబ్ధిదారునికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. బియ్యంను వంట చేసుకున్నారా, అన్నం నాణ్యత బాగుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వేసవి సెలవులు అనంతరం పునఃప్రారంభం అయినాయి. పరిసరాలు పరిశుభ్రంగా చేయాలన్నారు. పిల్లలకి అందించే పోషక ఆహారంలో నాణ్యత పాటించాలని, పిల్లలకి మంచి విద్య నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ర్యాలీ

**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అలంపూర్ పట్టణంలో రాజ్కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు ప్రారంభించగా పురవీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల కార్మికులను బడిలో చేర్పించే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పెద్దలు పనికి పిల్లలు బడికి పోయేలా ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి పిల్లలను బడికి పంపాలన్నారు. నిర్వాహకురాలు రత్నకుమారి మాట్లాడుతూ కరోనాలో పాఠశాలలు మూతపడి అప్పట్లో ఎంతోమంది చదువుకు దూరమయ్యారని దాని నుండి బాల కార్మిక వ్యవస్థ మొదలైన ప్రస్తుతం ప్రభుత్వం బాల కార్మిక నిర్మూలనకు అనేక విధాల కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కొట్టు శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టుల దరఖాస్తుకు ఆహ్వానం

**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్ మీడియట్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇంటర్ మీడియట్ తెలుగు, ఇంగ్లీష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, ఎంపిహెచ్‌డబ్ల్యూ సబ్జెక్టులలను బోధించేందుకు లెక్చరర్ పోస్టులు ఖాళీ ఉన్నందున బిఈడి పిజి చేసి అర్హత కలిగిన వారు మండలంలో ఈనెల 16వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి నర్సింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, బాలలకు తరగతి గదితోనే ఉజ్వల భవిష్యత్ ఉందని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ నెంబర్2 ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పి కె.నర్సింహా మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గంలో నడిపే వృత్తి ఉపాధ్యాయ వృత్తి, తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, దేవుడు ప్రసాదించిన వరం ఉపాధ్యాయులని అన్నారు. బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరు పాఠశాలకు వెళ్లాలని, బాలల చదువులకు ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలోఓ ప్రతి బుధవారం రోజున పోలీస్ ప్రజా బరోసా కార్యక్రమం నిర్వహిస్తూ పౌరులు సన్మార్గంలో నడవాలని మంచిని బోధిస్తూ పోలీసుగా మేము కూడా ఉపాధ్యాయుల వలే పనిచేస్తున్నామని అన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సత్ప్రవర్తనపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ సంవత్సరం 10వ తరగతిలో మంచిమార్కులు తెచ్చుకుని ప్రథమ స్థానం విద్యార్థికి 10,116 రూపాయలు, ద్వితీయ స్థానం విద్యార్థికి 5116 జిల్లా పోలీస్‌శాఖ తరుపున బహుమతిగా ఇస్తాను అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ యం. ఉదయశ్రీ, సిఐ రాజశేఖర్, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించడమే మోదీ లక్ష్యం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ అత్యాధునిక వైద్య సేవలు అందించడమే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం అని మహబునగర పార్లమెంట్ సభ్యురాలు ఎయిమ్స్ బోర్డు మెంబర్ డీకే అరుణ అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో గల ఎయిమ్స్ ఆసుపత్రిని ఆమె సందర్శించి వైద్య సేవలను భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది రూపాయలకే అత్యాధునిక వైద్యం అందించాలని సంకల్పంతో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటు చేశారన్నారు. 2026 సంవత్సరం వరకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, దాసరి మల్లేశం, చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు బోనగిరి సదానంద గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల చంద్రశేఖర్ రెడ్డి, భువనగిరి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, యువ మోర్చా అధ్యక్షులు పట్నం కపిల్ పాల్గొన్నారు.



## ఈనెల 27వ తేదీన పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

**ప్రజాపక్షం/మణుగూరు:** టిజిఆర్‌టిసి మణుగూరు డిపో వారిచే పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఈనెల 27న డీలెక్స్ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు నుండి ఉదయం 6గం. బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున రెండు గంటలకు వస్తుందని, ఈ పుణ్యక్షేత్రాల్లో మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, బొగత జలపాతం అక్కడి నుండి మేడారం సమ్మక్కసారలమ్మ దర్శనం చేసుకుని రామప్ప ఆలయం అక్కడి నుండి వేయి స్తంభాలగుడి భద్రకాళి ఆలయాన్ని దర్శించుకొని తిరిగి మణుగూరు చేరుకుంటుందని తెలిపారు. ఒకేరోజులో ఐదు ఆలయాలను దర్శించుకొని రావచ్చునని, పెద్దలకు 1000 పిల్లలకు 500 మాత్రమే. అన్నవరం అక్కడి నుండి ద్రాక్షారామం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, ద్వారకా తిరుమల నుండి మణుగూరు చేరుకుంటుందని, ఈ బస్సు 27వరాత్రి 11గం. బయలుదేరి తెల్లారి 28వతేది రాత్రి ఒంటిగంట కు మణుగూరు చేరుకుంటుందని, సూపర్ లగ్జరీ పెద్దలకు 1400, పిల్లలకు 700గా నిర్ణయించబడిందని వివరాలకు 9959225963 సంప్రదించాలన్నారు.

## మృతుల కుటుంబాలకు పొంగులేటి ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయం ను స్థానిక నాయకులు అందించారు. మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున పలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడారు.. మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, మాజీ సర్పంచ్లు పెంటమళ్ల పుల్లమ్మ, రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, మామిడి వెంకన్న, బోడ్డు బోందయ్య, మేకల వేంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్ బాబు,కడియల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

పాఠశాల ప్రారంభం రోజునే
పుస్తకాలు, యూనిఫాం పంపిణీ
పువ్వాడనగర్‌లో పాఠశాలను
ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** ప్రైవేటు కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పువ్వాడ నగర్‌లో ఏర్పాటు చేసిన మండల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని పాఠశాల ప్రారంభించిన మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి రోజు పిల్లలు సాయంత్రం పూట కొంత సమయం చదువుతో పాటు కొంత సమయం ఆడుకోవాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బాల్యంలో చదువు, ఆటలు, ఆరోగ్యం చాలా కీలకమన్నారు. ఇంటి భోజనంతో మంచి ఆరోగ్యం వస్తుందని బయట ఫుడ్ తినవద్దని సూచించారు. పిల్లలు తమ లక్ష్యాలను ఒక పుస్తకంలో రాసుకుని ప్రతిరోజు గుర్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం సంతోషంగా పండుగ వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలను ప్రారంభించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వర్గానికి చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తున్నామని, పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పిల్లవాడిలో టాలెంట్ ఉంటుందని దానిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో ఏఐ టూల్స్ వినియోగించుకుని నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. గతంలో వైరా మండలం నారపునేనిపల్లిలో ఒకే విద్యార్థిని ఉన్న పాఠశాలలో 20 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని అక్కడ పాఠశాలలో వసతులు కల్పించామన్నారు. ఉపాధ్యాయులు చాలా నిబద్ధతతో పనిచేస్తున్నారని సమన్వయం చేసుకుంటూ పక్కాగా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగది, పిల్లల రూమును పరిశీలించారు. కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్వ ప్రాథమిక పాఠశాల క్రింద అంగన్‌వాడీ పనిచేయాలని పిల్లలకు ఆట వస్తువులతో చిన్న చిన్న పాఠాలు సిలబస్ ప్రకారం బోధించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలని, పిల్లలకు రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలునాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి డా॥ పురందర్, రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి బి. రాములు, గ్రామ కార్యదర్శి వై. రాంబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి. వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ జి. విజయ కుమారి, ఆయా శ్రావణి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేమిశెట్టి మోహన్‌దాస్, సిద్దయ్య, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఎదురు కాల్పులు

### ఇద్దరు మావోయిస్టులు మృతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టుతో సహ ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఆ జిల్లాలోని పుస్గన్న అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సంయుక్త బలగాలు అడవులను జల్లెడుపడుతున్న క్రమంలో మావోయిస్టు పార్టీ సభ్యులు తారసపడటంతో ఇరు వర్గాల నడు హోరాహోరీగా కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల అనంతం సంఘటనా స్థలాన్ని పరిశీలించగా ఎల్‌ఓఎస్ కమాండర్ ముచాకీ, పార్టీ సీనియర్ సభ్యురాలు అనితా మృత దేహాలు లభ్యమైనట్లు పోలీస్ అధికారులు ధృవీకరించారు. మృతదేహాలతో పాటు ఇన్సాస్ రైఫిల్, భారీ పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం లభ్యమయ్యాయి. మృతి చెందిన మావోయిస్టులపై రూ.5 లక్షల రివార్డు ఉంది.

# పేదల పక్షపాతి సిపిఐ



పోరాటాల ద్వారానే
ప్రజా సమస్యల పరిష్కారం
సిపిఐ నగర కార్యదర్శి జానిమియా

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు సాగించి పేదల పక్షపాతిగా సిపిఐ నిలిచిందని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. గురువారం స్థానిక గిరిప్రసాద్‌భవన్‌లో సిపిఐ ఖమ్మం నగర ముఖ్యకార్యకర్తల సమావేశం ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. జానిమియా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తుందన్నారు. మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తుందన్నారు. 2025 సంవత్సరంలో కేవలం రూ. 69వేల కోట్లు కేటాయించడం వల్ల పనిదినాలు తగ్గిపోయి గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిజమైన అర్హులకు కేటాయించాలని కోరారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమవుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, పోటు కళావతి, పగడాల మల్లేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వై.సాంబశివరెడ్డి, నూనె శశిధర్, గాదె లక్ష్మినారాయణ, వరదా నర్సింహారావు, మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె సైదా, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు వారికే ఇవ్వాలి

అఖిలపక్ష నాయకులు డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మండల కేంద్రమైన రఘునాథపాలెం సర్వే నెం. 218 నందు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను బై బ్యాక్ తీసుకోవాలన్న నిర్ణయాన్ని విరమించుకుని వారికే ఇండ్ల స్థలాలు కేటాయించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలను బై బ్యాక్ తీసుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాధితుల తరుపున అఖిల పక్షం నాయకులు గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రఘునాథపాలెం సర్వే నెం. 218 నందు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్ల పట్టాలు ఇచ్చారని తర్వాత 2018లో తెలంగాణ ప్రభుత్వం అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ పట్టాలను మార్చి తెలంగాణ ప్రభుత్వం పేరుతో 725 మందికి ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున ఇండ్ల స్థలాలను కేటాయించి పట్టాలు ఇచ్చిందన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా పట్టాలు ఇచ్చిన వెంటనే పలువురు బేస్‌మెంట్లు నిర్మించుకున్నారని నాయకులు తెలిపారు. ఇటీవల నాగపూర్ అమరావతి నేషనల్ హైవే ఈ ప్లాట్ల మధ్య నుంచి వెళ్తుందని అధికారులు సర్వే చేశారు. సుమారు 261 ప్లాట్ల మీదుగా జాతీయ రహదారి పోతుందని సర్వే నిర్వహించారు. ప్లాట్లు పోతున్న బాధితులు మంత్రులు, అధికారులను కలిసి తమ సమస్యను వివరించారు. ఆ సమయంలో అధికారులు తగిన న్యాయం చేస్తామని ప్లాట్లు కోల్పోతున్న వారికి వేరే ప్రాంతంలో స్థలం లేదా పరిహారం అందిస్తామని తెలిపారు. ఓ వైపు జాతీయ రహదారితో పలువురు ప్లాట్లు కోల్పోతుంటే ఇప్పుడు మరల యంగ్ ఇండియా స్కూల్ పేరుతో 30 ఎకరాల స్థలం అవసరం కాగా సర్వే నెం. 218లోనే మిగిలిన ప్లాట్‌లోని స్థలాలను కేటాయించడం శోచనీయమన్నారు. అక్కడ ఎవరికి ప్లాట్లు లేవంటూ ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలను బై బ్యాక్ తీసుకుందని అధికారులు అంటున్నారని తెలిపారు. గతంలో పట్టాలు ఇచ్చిన వారందరికీ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇచ్చిన ప్రాంతంలోనే స్థలాలు చూపించాలని లేదా ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని లేని పక్షంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో బాధితుల పక్షాన ఎటువంటి పోరాటానికైనా సిద్ధమేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, ఉపేందర్, సాహు, వై. విక్రం, ఆవుల మంగతాయి, రాంబాబు, నవీన్‌రెడ్డి, విజయ్, ఉపేందర్, మనోహర్, శ్రీధర్, శ్రీను, ప్రసాద్, గోపాలరావు, ప్రవీణ్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించండి

గోడపత్రిక ఆవిష్కరించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, బాలకార్మికులుగా ఎవ్వరూ ఉండరాదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం. ప్రారంభమైనందున బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని, పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాన్నారు. బడిబాట కార్యక్రమం ప్రారంభమైనందున తల్లిదండ్రులు, పిల్లలు, అధికారులుంతా కలిసి నూరు శాతం బడిలో పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. బాలకార్మిక పని ప్రదేశాలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఎండిఫోర్ఫోద్దీన్, జిల్లా బాలల రక్షణ అధికారి హరి కుమారి, డిసివియు యూనిట్ బాధ్యులు అజీజ్, నాగరాజు, ఎయిడ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి:కలెక్టర్



మార్కెట్‌లో అవసరమైన వసతుల కల్పన
పనులను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యాపారులు, కొనుగోలుదారులకు అనుగుణంగా సౌకర్యవంతంగా వీధి వ్యాపారుల ప్రాంగణంను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. మార్కెట్‌కు కావాల్సిన అదనపు వసతులు, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులపై కలెక్టర్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించాలన్నారు. మార్కెట్ బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం బయట ఉన్న టాయిలెట్స్‌ను తీసివేసి రోడ్డు నుంచి మార్కెట్ లోపలికి అందంగా ఉండేలా చిన్న ఎత్తులో గోడ నిర్మించాలని ఆ గోడకు గ్రిల్స్ ఏర్పాటు చేసి పార్కింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ షిఫ్టింగ్ పనులు వారంలో, గోడ నిర్మాణం రెండు వారాల్లో పూర్తి చేయాలన్నారు. మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న షెడ్ల నిర్మాణం స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్మిస్తున్న టాయిలెట్ల నిర్మాణ పురోగతిని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మార్కెట్‌లో ఉన్న వ్యాపారస్తులకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవిధంగా ఆర్థిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేట్ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పథకం పేదలకే అందాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలన్నదే తమ ధ్యేయమని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి అన్నారు. గురువారం పట్టణంలోని 18, 19, 23 వ వార్డు ల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలు ప్రతి పేదవాడికి అందాలన్నారు. కాంగ్రెస్ జెండా ప్రతి ఇంటి పై ఎగరాలని, అందరు కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ప్రజలు కష్ట సుఖాల్లో తోడు, నీడగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు కుమారి, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, రామారావు, షరీఫ్, పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మమాట-అంగన్‌వాడీబాట ప్రారంభం


చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చదువుతూనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. గురువారం పట్టణంలోని జలగం నగర్ అంగన్ వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమంను ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించి, 20 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేపించి, చిన్నారులకు యూనిఫాంలు, పలక బలపములు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు నాణ్యత గల పోషకాహారం అందిస్తూ, చిన్నారులకు ఆట, పాటలతో కూడిన ఆహ్లాదకరమైన మంచి చదువు అందిస్తున్నారని, చిన్నపిల్లలను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించి చిన్నారుల బంగారు భవిష్యత్ కు తల్లిదండ్రులు బాటలు వేయాలని కోరారు.

చిన్నారులకు అమ్మ ఒడి తరువాత వారి ఆలనా, పాలనా చూసుకునేది అంగన్ వాడీ టీచర్లు, ఆయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు గాదే చెన్నారావు, పింగుల సామ్యూల్, కమల్ పాషా, ఐసిడిఎస్ సిడిపిఓ మెహరున్నీసా, సూపర్ వైజర్లు గంగాజలం, సుజాత, రజిని తదితరులు పాల్గొన్నారు.

# తీరనున్న సాగునీటి కష్టాలు



దశాబ్దాల కల సాకారం
లిఫ్ట్ ఇరిగేషన్‌తో రఘునాథపాలెం మండలంలో జలకళ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాగునీటి కోసం దశాబ్దాలుగా ఎదురు చూసిన రైతుల కల సాకారం కానుంది. చెంతనే సాగర్ కాలువ ఉన్న ఎటువంటి ఉపయోగం లేకపోయింది. వర్షాధార, బోర్ల పైనే ఆధారపడి పంట సాగు చేయాల్సి ఉండేది. సాగునీరు లేక పలువురు రైతులు సాగును వదిలేశారు. ఇప్పుడు మండలానికి సాగునీటి సమస్య తీరనుండడంతో మళ్లీ సాగు చేసేందుకు పలువురు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా దృష్టిసారించి రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి నాలుగు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి మాసంలో రూ. 66 కోట్లతో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి నాలుగు నెలల్లోనే ట్రయల్ రన్ నిర్వహించారు. వానాకాలం సాగుకు సాగునీటిని అందించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టారు. రూ. 66 కోట్లతో మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం నాగార్జున సాగర్ డిప్ కట్ వద్ద మంచుకొండ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పంపు హౌజ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మంచుకొండ డబుల్ బెడ్‌రూం సముదాయం వద్ద పైపులైన్ ద్వారా నీటిని తరలించి స్టోరేజ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. మంచుకొండ నుంచి మండలంలోని 33 చెరువుల నీటిని తరలించేందుకు పైపులైన్లను పూర్తి చేశారు. ప్రత్యేకంగా భూ సేకరణ అవసరం లేకుండానే అవసరం ఉన్న చోట రైతుల పొలాల్లోనే మూడు అడుగుల మేర లోతులో పైపులైన్ నిర్మించి సాగుకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడంతో రైతులు కూడా ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఈ పథకం ద్వారా మండలంలోని 33 చెరువుల్లో నీరు నింపి సుమారు మూడువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నారు. చెరువులు నింపడం ద్వారా త్రాగు నీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు భూగర్బ జలాలు కూడా పెరగనున్నాయి. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురు చూసిన రఘునాథపాలెం మండల ప్రజల కల సాకారం కానుంది. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందని కొన్ని ప్రాంతాలకు బుగ్గవాగు చెక్‌డ్యాం ద్వారా పైపులైన్ నిర్మించి చెరువుల్లో నీటిని నింపేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**రూ.82 కోట్లతో బుగ్గవాగుకు ప్రతిపాదనలు :** బుగ్గవాగు చెక్‌డ్యాం ద్వారా కామేపల్లి, రఘునాథపాలెం మండలంలోని పలు చెరువులకు నీటిని అందించేందుకు రూ.82కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. పదేళ్ల క్రితం బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించారు. ఆతర్వాత గ్రావిటి కాలువల ద్వారా నీరు తరలించాలని భావించారు. ఇందుకోసం సుమారు రూ. 40 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన భూసేకరణతో పాటు ఇతరత్రా సమస్యల వల్ల కాలువల నిర్మాణం నిలిచిపోయింది. మంచుకొండ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ అవసరం లేకుండానే ప్రత్యామ్నాయంగా పైపులైన్ నిర్మాణం ద్వారా చెరువులకు నీటిని అందించే ప్లాన్ సత్ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు అధికారులు బుగ్గవాగు చెక్‌డ్యాంపై దృష్టి సారించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం మాదిరిగానే బుగ్గవాగు చెక్‌డ్యాంకు సంబంధించి కూడా నీటి తరలింపుకు పైపులైన్ నిర్మిస్తే తక్కువ భూ సేకరణ వ్యయంతో పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు ఆవైపు దృష్టిసారించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో సుమారు 26 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణం భూ సేకరణ ఇతర పనులకు మరో రూ. 82 కోట్లు అవసరం అవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఆ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించి నిధులు మంజూరు చేస్తే కామేపల్లి మండలంలోని 21 చెరువులు, రఘునాథపాలెం మండలంలోని 10చెరువులకు మొత్తం 31 చెరువులకు పైపులైన్ ద్వారా నీరు అందనుంది. సుమారు 200 క్యూసెక్యూల నీటిని తరలించి 5,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. చెరువుల్లో నీటిని నింపడం ద్వారా సాగు, త్రాగునీటి సమస్యలు తీరడంతోపాటు సమీపప్రాంతాల్లో భూగర్భజలాలు మెరుగుపడనున్నాయి. వర్షాకాలంలో వాగులద్వారా వచ్చే నీటిని చెక్‌డ్యాం వద్ద స్టోర్ చేసి ఆపై చెరువులకు తరలిస్తే పంట చివరి దశలో నీటి ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికే రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా 33 చెరువులకు సాగర్ నీటిని అందిస్తుండగా మిగిలిన చెరువులకు కూడా బుగ్గవాగు చెక్‌డ్యాం ద్వారా నీటిని అందించనున్నారు. దీనితో మండలంలో సాగునీటికష్టాలు తీరనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇంళ్లు త్వరగా నిర్మించుకోవాలి

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని లబ్దిదారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తిచేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రకుంట తండా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేలకు నీడ కల్పించాలని గొప్ప ఉద్దేశంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులలో సంతోషం వ్యక్తం అవుతుందన్నారు. లబ్దిదారులతో మాట్లాడడం జరిగిందన్నారు. స్వయంగా దగ్గరుండి కట్టుకుంటే ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 15న భూపాలపల్లి పట్టణ సిపిఐ మహాసభలు

**సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్**

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఈనెల 15న భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించే సిపిఐ 18వ పట్టణ మహాస భలను విజయవంతం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రావినారాయణరెడ్డి భవన్ లో సిపిఐ పట్టణ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పట్టణ మహా సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాతంగి రామ్ చందర్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, అస్లాం, రవీందర్, శాంతి, శేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని విష్ణుపురం గ్రామంలో హరిజన కాలనీ, లక్ష్మి నారాయణపురం, తొర్రూరు గ్రామాలలో సీఆర్ఆర్ నిధులతో రూ.35లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్లు, డ్రైనేజీ వీధి లైట్లు లాంటి సదుపాయాలు గ్రామ ప్రజల జీవితాలలో నిత్యావసరంగా మారాయన్నారు. ప్రజల అవసరాలను పట్టించుకుని అభివృద్ధి పనులను చేపట్టడమే ప్రస్తుత మా ప్రభుత్వ ధ్యేయమని, గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక సదుపాయాలు ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతారన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, మీ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని, కష్ట పడ్డ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ మైసిరెడ్డి, పార్టీ నాయకులు కుమార్, శ్రీనివాస్, రాఘవరావు, యాకాంతరావు, హరీష్, మదార్, బాలరాజు, కార్తీక్‌రెడ్డి, సోమయ్య, ప్రభాకర్, కొమురయ్య, మహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లారెడ్డి, మధు, యాకస్వామి, ఐలయ్య, సంపత్, రంగయ్య, పురుషోత్తం, యాకయ్య, కృష్ణమూర్తి, సోమయ్య, సుధాకర్, శ్రీశైలం, వెంకటేష్, ఐలేష్, అబ్బయ్య, పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరం

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరమని పరీక్ష చేయించిన వారు, చేసిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రం లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 14 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో ఐదు ప్రభుత్వాధీనంలో 9 ప్రైవేట్ సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు చేయకూడదని లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలా చేసిన చేయించి ప్రోత్సహించిన వారికి మూడేళ్లు జైలు శిక్షతోపాటు 50 వేల జరిమానా విధిస్తారని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 9440586982, నంబరుకు లేదా 630 323 9891 నంబరుకు వాట్సఅప్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, గైనకాలజిస్టు డాక్టర్ కవిత, పీడియాట్రిషన్ డాక్టర్ సురేందర్, డెమో శ్రీదేవి, సోషల్ వర్కు ర్లు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలియజేయడం జరిగింది.


## గోదావరిలో మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గోదావరిలో గురువారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. గోదావరి నదిలో మృతదేహం గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కాళేశ్వరం పోలీసులు చుట్టు పక్కల పోలీసు స్టేషన్ సమాచారం అందించారు. మృతుడు భూపాలపల్లి జిల్లా కాశీంపల్లికి చెందిన నల్లపూరి రమేష్ (58) గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు జూన్ 10 ఉదయం 8 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని కుటుంబ సభ్యులు భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని తెలిపారు. గురువారం ఉదయం మృతదేహం గురించి కాళేశ్వరం పోలీసులు భూపాలపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి తెలుపగా వారు అతని కుమారుడు వెంకటేష్‌కు సమాచారం అందించారు. మృతుని కుమారుడు వెంకటేష్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు తెలపగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య**



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. పోచంపల్లి, న్యూ శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమానికి ఎంపి డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ ఎంపీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే పాఠశాలను ప్రారంభమైన మొదటి రోజున విద్యార్థుల చేతికి యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. గతంలో తాను కడియం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేసినట్లు తెలిపారు. నేడు ఎంపిగా మళ్ళీ పుస్తకాలు అందజేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇటీవల వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని డీఈవోలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాల సమస్యల పట్ల సుదీర్ఘంగా చర్చించినట్లు ఎంపి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగా ప్రైవేటు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, నాణ్యతతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి, ఇతర అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే సమాజంలో గౌరవం

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో మండలంలోని ఎర్రకుంట తండా మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం కలెక్టర్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలల్లో వసతులు, పౌష్టికాహారం, మెరుగైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీదనే ఆధారపడి ఉందన్నారు. తమ పిల్లలు ప్రతి రోజు తప్పనిసరిగా పాఠశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్ అందించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు కూడా వారి పరిధిలో గల పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజయ్య, డిడబ్ల్యూవో ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆద్యకళా మ్యూజియం నిర్మాణానికి స్థల పరిశీలన

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**ప్రజాపక్షం/చిల్పూర్:** ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడడంలో మ్యూజియంలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండలం సీత్యతండా గ్రామం వద్ద ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను తెలిపే ఆద్యకళా మ్యూజియం నిర్మాణానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థల పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల కలలు, సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడంలో, భావి తరాలకు అందించడంలో మ్యూజియంలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. మ్యూజియం ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. మ్యూజియంకు సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గిరిజనులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో ముందుండాలి

**ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ ముగింపులో కలెక్టర్ ప్రావీణ్య**




**ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి:** సమాజంలో ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో ఆపదమిత్ర వాలంటీర్లు ముందుండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ లోని అంబేద్కర్ భవన్ లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు నిర్వహించిన ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో ఆపదమిత్ర వాలంటీర్లు ఏవైనా అనుకోని విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. వాలంటీర్లు ఎంతోమంది జీవితాలను మార్చగలరని నమ్మకం ఉందన్నారు. ప్రకృతి విపత్తులే కాదూ రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు సహాయం చేయడంలోనూ వాలంటీర్లు ముందుండాలన్నారు. ఆపదమిత్ర వాలంటీర్లు సమాజానికి ఉత్తమ సేవలు అందిస్తారనే నమ్మకం ఉందన్నారు. ప్రకృతి విపత్తులు, ఆపద సమయాల్లో కాపాడటం, సహాయం చేయడం గురించి శిక్షణలో నేర్చుకున్న అంశాలను పదిమందికి నేర్పించాలన్నారు. ప్రజల్లో పాముకాటు, కుక్క కాటు గురించి కూడా చుట్టుపక్కల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత మండల పరిధిలో ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల వివరాలను స్థానిక అధికారులకు అందజేస్తామన్నారు. ఆపదమిత్ర వాలంటీర్లకు సర్టిఫికెట్లు, ఐడి కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ జయశ్రీ, సైకాలజిస్ట్ శ్రీనివాస్, శిక్షణ పొందిన ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా నడిపిస్తున్న

## టాపర్మెంట్ స్కూల్ మూసివేయాలి

**డిఇఒకు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి**



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం అనుమతి లేకుండా నడుస్తున్న టాపర్మెంట్ స్కూలును సీజ్ చేయాలని ఆ స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని హనుమకొండ డిఇఒకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి కాసరబోయిన రవితేజ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నటువంటి హనుమకొండ లోని పలివెల్పుల దగ్గర ఉన్న టాపర్మెంట్ స్కూల్ ని మూసివేయాలని, అలాగే ఆ స్కూల్ కి గ్రౌండ్ లేదని ఫైర్ సేఫ్టీ పర్మిషన్ లేని ప్రభుత్వం నుండి వారికి ఎలాంటి అనుమతి లేదని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రుల రక్తం తాగుతున్నటు వంటి టాపర్మెంట్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని అన్నారు. ఈ స్కూల్‌పై హనుమకొండ ఎంఇఒకు వినతి పత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని, టాపర్మెంట్ యజమాన్యంతో కుమ్మక్కై ఆయన విధులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న హనుమకొండ ఎంఇఒ నెహ్రూ నాయక్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.

### డంపింగ్ యార్డు ఎత్తివేసి

## ప్రజల ప్రాణాలు రక్షించాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్**




**ప్రజాపక్షం/కాజీపేట :** హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్ ను ఎత్తివేసి ప్రాణాలను రక్షించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కాజీపేట వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎల్లేష్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వల్ల రాంపూర్ పరిసర, మడికొండ చుట్టుపక్కల గ్రామాలలో వాతావరణ కాలుష్యం ఏర్పడి ఆరోగ్య సమస్యలు ఇతర శ్వాసకోశ వ్యాధులు పర్యావరణ కాలుష్యం ఆగుటతో ఉదయం డంపింగ్ యార్డ్ పొగతోటి హైదరాబాద్ హైవేకు ఉన్న రోడ్ లో మొత్తం మంచుతో కప్పినట్టుగా ఉండటం వలన యాక్సిడెంట్లు కూడా జరుగుచున్నవని, కావున ఈ డంపింగ్ యార్డ్ ను వెంటనే ఎత్తివేయాలని, స్థానిక ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, సారంగపాణి, పూర్ణచందర్, మద్దెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లగడ్డ- ఎర్రగుట్ట తండాకు రోడ్లు వేయాలని దర్నా

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వరావు**




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జిల్లాలోని కురవి మండలం బలపాల చెరువు క్రింద చర్లగడ్డ ఎర్రగుట్ట తండాకు సంబంధించిన రోడ్లు వేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. గురువారం బలపాల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వరి పొలాలకు పోవడానికి రోడ్లు గురించి గత ప్రభుత్వ అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మంత్రి సత్యవతిరాథోడ్, జిల్లా కలెక్టర్‌కు సర్వే చేయించి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకూ రోడ్డుగురించి పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ఈ రోడ్డు క్రింద ఉన్న పేద సన్నకారు రైతులు, హరిజన, గిరిజన రైతుల పొలాలు ఉన్నాయని ఈ రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల దున్నడానికి ట్రాక్టర్లు, మందు కట్టలు, వ్యవసాయకూలీలు నడవడానికి దారి లేని పరిస్థితి ఏర్పడిందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ వాగ్దానం చేశారని, ఎప్పుడు అడిగినా మంజూరైంది శంకుస్థాపన చేస్తామని మాటలతో కాలయాపన చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ముందుకు వచ్చి యుద్ధ ప్రాతిపదికన రోడ్లు వేయాలని లేని పక్షంలో దశలవారీ రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శ రామగాని రవి, సీనియర్ సిపిఐ నాయకులు కన్నూజ్ వెంకటనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుల బత్తుల వెంకటేశ్వర్లు, వేపాకుల పాపయ్య, షేక్ రాజమహ్మద్, బలపాల రైతులు నారపాటి సైదులు, పాల్గొన్నారు.

## జిల్లాలో బడిబాట కార్యక్రమం

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**ప్రజాపక్షం/ఖిల్లా వరంగల్:** ఆచార్య ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం జిల్లాలోని ఖిలా వరంగల్ మండలం గుంటూరు పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బడిబాట కార్యక్రమానికి హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీ నుండి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. గురువారం పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్న వేళ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బడి వయసు గల ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలలో ఉండాలని, ప్రభుత్వ బడులను అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో 5సంవత్సరాల వయసు నిండిన ప్రతి విద్యార్థిని పాఠశాలలలో చేర్పించాలని, బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా బడిలో చేరిన వారికి అడ్మిషన్ ఫారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్ బుక్స్, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర్ రావు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

**ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు**

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎవరైనా ఏదైనా సాధించాలనుకుంటే అది చదువుతోన మాత్రమే సాధ్యమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. నేటి నుండి ప్రభుత్వ పాఠశాలలో బడులు పున ప్రారంభం సందర్భంగా హసన్ పర్తి మండల పరిధిలోని జయగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే నాగరాజు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించి సర్వనాశనం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు పాఠశాల తరగతి గదులు తెరుచుకోకముందే పాఠశాలకు విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు విద్యార్థినీ విద్యార్థులకు దుస్తులను పాఠశాలకు చేర్చిందని ఇది విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి పెట్టిన ప్రత్యేక దృష్టికి నిదర్శనమన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో పేద విద్యార్థులకు భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అందరి సహాయ సహకారాలతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు జరుగుతుందన్నారు. ఇక విద్యార్థులు తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు పోవద్దని అప్పులు చేసి ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నారని కాబట్టి ప్రైవేటు పాఠశాలలో పది అక్షరాలు నేర్చుకున్న అంతే ప్రభుత్వ పాఠశాలలో రెండు అక్షరాలు నేర్చుకున్న దానితో సమానమని ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నరు. ఈ కార్యక్రమంలో తంగెళ్ళపల్లి తిరుపతి, రైతు రాజు, పల్లె దయాకర్, రాజీవ్ గాంధీ, హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు దయాకర్, రాజిరెడ్డి, రుణాకర్ రెడ్డి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లలు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## కెకెఆర్ నుండి ఐదుగురు ఔట్

ఐపిఎల్ 2025 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) తీవ్రంగా నిరాశపరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కెకెఆర్.. పేలవ ప్రదర్శనతో కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. స్టార్ ఆటగాళ్ల వైఫల్యం ఆ జట్టు కొంపముంచింది. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్ తీవ్రంగా నిరాశపర్చగా.. భారీ అంచనాలు పెట్టుకున్న రింకూ సింగ్, వెంకటేశ్ అయ్యర్, క్వింటన్ డికాక్ తేలిపోయారు. దాంతో కేకేఆర్ 14 మ్యాచ్‌లకు ఐదు మాత్రమే గెలిచి 8వ స్థానంలో నిలిచింది. వర్షం కారణంగా రెండు మ్యాచ్‌లు రద్దవ్వడం కూడా కెకెఆర్ ప్లే ఆఫ్స్ అవకాశాలపై ప్రభావం చూపింది. ఈ వైఫల్యం నేపథ్యంలోనే ఐపిఎల్ 2026 మినీ-వేలానికి ముందు జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. జట్టు బలహీనతలను సరిదిద్దుకోవడంతో పాటు పర్స్ వాల్యూను పెంచుకునేందుకు కేకేఆర్ అవసరం లేని ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది.

### వెంకటేష్ అయ్యర్



ఐపిఎల్ 2024 సీజన్‌లో టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన వెంకటేశ్ అయ్యర్‌ను కేకేఆర్ రూ. 23.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ ఈ సీజన్‌లో అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఈ క్రమంలోనే వెంకటేశ్ అయ్యర్‌ను వేలంలోకి వదిలేసే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్స్ వాల్యూను పెంచుకోవడానికి అయ్యర్‌ను వదిలేయవచ్చు. వేలంలో తక్కువ ధరకు అతన్ని తిరిగి కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది.

### క్వింటన్ డి కాక్



ఓపెనర్‌గా అదిరిపోయే ఆరంభాలు అందిస్తాడని భావించిన క్వింటన్ డికాక్ తీవ్రంగా నిరాశ పరిచాడు. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో ఈ వికెట్ కీపర్ కమ్ బ్యాట ర్ కోసం కేకేఆర్ రూ. 3.60 కోట్లు ఖ ర్చు చేసింది. కానీ అతను 8 మ్యాచ్‌ల్లో 21.71 సగటుతో 152 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో రాజస్థాన్ రాయల్స్‌పై 97 పరుగుల తో అజేయంగా నిలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమయ్యా డు. అతని స్థానంలో రెహమనుల్లా గుర్బాజ్‌ను ఆడించగా.. అతను కాస్త మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ క్రమంలోనే డికాక్‌ను వదిలేసి భారత వికెట్ కీపర్‌ను తీసుకనే ప్రయత్నం కేకేఆర్ చేయవచ్చు.

### అన్రిచ్ నోర్జే



సౌతాఫ్రికా స్టార్ పేసర్ అన్రిచ్ నోర్జేను కేకేఆర్ రూ. 6.50 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం 2 మ్యాచ్‌లే ఆడి ఒక వికెట్ తీసాడు. గాయంతో సీజన్ ఆరంభంలోనే జట్టుకు దూరమయ్యాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో స్టార్ పేసర్‌ను కేకేఆర్ తీసుకోవచ్చు.

### స్పెన్సర్ జాన్సన్



మిచెల్ స్టార్క్ స్థానాన్ని భర్తీ చేయగలడని ఆస్ట్రేలియా లెఫ్టార్మ్ పేసర్ స్పెన్సర్ జాన్సన్‌ను రూ. 2.80 కోట్ల భారీ ధరకు కేకేఆర్ కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం 4 మ్యాచ్‌లు ఆడి ఒకే ఒక్క వికెట్ తీసాడు. 11.73 ఎకానమీతో ధారళంగా పరు గులిచ్చాడు. పేస్ విభాగాన్ని పటిష్టం చేయాలనుకుం టున్న కేకేఆర్.. జాన్సన్‌ను వదిలేసి మరో పేసర్‌ను తీసుకునే ప్రయత్నం చేయవచ్చు.

### మొయిన్ అలీ



ఐపిఎల్ 2025 సీజన్‌లో కెకెఆర్ తరఫున ఆడిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. బ్యాటింగ్‌లో పెద్దగా అవకాశాలు రాణించక పోయినా.. బౌలింగ్‌లో అంతగా ప్రభావం చూపలేకపోయాడు. ఇప్పటికే రస్సెల్, సునీల్ నరైన్ వంటి విదేశీ ఆల్‌రౌండర్లు ఉండటంతో మొయిన్ అలీని తుది జట్టులో ఆడించలేని పరిస్థితి నెలకొంది. రూ. 2 కోట్లు పెట్టిన తీసుకున్న మొయిన్ అలీ 6 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు తీసా డు. మొయిన్ అలీ స్థానంలో భారత యువ ఆటగాడిని కేకేఆర్ ఎంచుకోవచ్చు.

## కోహ్లీ, రోహిత్ లేరు.. మీకిదే గోల్డెన్ ఛాన్స్: గౌతమ్ గంభీర్



తమను తాము నిరూపించుకునేందుకు కుర్రాళ్లకు ఇదే సరైన సమయం అని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ నేపథ్యంలో టీమిండియా యువ ఆటగాళ్లను ఉద్దేశించి గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి సీనియర్ ఆటగాళ్లు లేరని, వారి గైర్హాజరీలో సత్తా చాటేందుకు ఇదే సరైన అవకాశంగా భావించాలని కుర్రాళ్లకు సూచించాడు. శుభ్‌మన్ గిల్‌ను టీమిండియా నయా టెస్ట్ సారథిగా నియమించగా.. రిషభ్ పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జూన్ 20 నుంచి లీడ్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే ఇంగ్లండ్‌కు చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది. ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా కుర్రాళ్లను ఉద్దేశించి గంభీర్ చేసిన వ్యాఖ్యలను బీసీసీఐ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.ప్రస్తుతం మనం ఉన్న స్థితిని రెండు విధాలుగా చూడొచ్చు. ఒకటి మనం ముగ్గురు అత్యంత అనుభవం కలిగిన ఆటగాళ్లు రోహిత్, విరాట్, అశ్విన్ లేకుండా బరిలోకి దిగుతున్నాం. రెండోది దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మనకు ఉన్న అద్భుతమైన అవకాశంగా చూడటం. ఈ జట్టులో గెలవాలనే కోరిక, అభిరుచి, ప్రత్యేకంగా ఏదైనా చేయాలనే నిబద్ధత ఉందని నేను అనుకుంటున్నాను. మనం త్యాగాలు చేస్తే.. మనం కంఫర్ట్ జోన్ల నుంచి బయటకు వస్తే.. మనం పోరాడటం ప్రారంభిస్తే.. ప్రతీ సెషన్, ప్రతీ గంట, ప్రతీ బంతిని మనం చిరస్మరణీయంగా మలుచుకోగలం.ఆ ప్రయత్నాన్ని ఈ రోజు నుంచే ప్రారంభించండి. దేశం కోసం ఆడటం కంటే పెద్ద గౌరవం మరొకటి లేదు. అందుకోసం ప్రతీ ట్రైనింగ్ సెషన్‌ను ఉపయోగించుకుందాం. దానికి అనుగుణంగా శిక్షణ పొందుదాం. బౌలర్లు అయినా.. బ్యాటర్లు అయినా.. ఒత్తిడిలో ఎలా ఆడబోతున్నామో ఇక్కడే తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. ప్రతీ బంతిని ఒక ఉద్దేశంతో ఆడుదాం.'అని గంభీర్ కుర్రాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు.

# వ్యవసాయం

ఫోకస్



## ఖరీఫ్‌లో లాభదాయకమైన పంటలు

ఖరీఫ్ సీజన్ అంటే వర్షాకాలంలో (జూన్ నుండి అక్టోబర్ వరకు) సాగు చేసే పంటలు. ఈ కాలంలో వర్షపాతం, తేమ ఎక్కువగా ఉండటంతో నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంటలు బాగా పండుతాయి. వీటిలో ముఖ్యమైన లాభదాయక ఖరీఫ్ పంటలను పరిశీలిస్తే, ముందుగా వరిని ప్రస్తావించాలి. భారతదేశంలో అత్యధికంగా సాగు చేసే ఖరీఫ్ పంట వరి. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఇది అత్యంత లాభదాయకం. ఇతర పంటల విషయానికి వస్తే, మొక్కజొన్న తక్కువ కాలంలో దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సోయాబీన్ వంటి నూనె గింజల పంటలు కూడా లాభదాయకంగా ఉంటాయి. వాణిజ్యపంటల్లో పత్తి మంచి ఆదాయాన్ని ఇస్తుంది. ఎక్కువ కాలం పడినా, మంచి దిగుబడి, ఆదాయం ఇవ్వగలిగే పంట చెరకు. వేరుశెనగ తక్కువ పెట్టుబడితో మంచి లాభాలనిస్తుంది. నువ్వులు, మినుములు, కందులు, పెసలు, జొన్న, రాగి: ప్రాంతానుసారం మార్కెట్ డిమమాండ్ ఉన్న చోట లాభదాయకంగా ఉంటాయి. ఇటీవల కాలంలో చిరుధాన్యాలు (Millets) ఎక్కువ డిమాండ్‌తో, విస్తృతంగా లాభాలు ఆర్జిస్తున్నాయి. తక్కువ నీటితో, ఆరోగ్యపరంగా డిమాండ ఎక్కువగా ఉంది. టమాటా వంటి కూరగాయలు, ఆకు కూరలతోనూ మంచి ఆదాయం లభిస్తుంది. 2025–26లో ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంచారు. ముఖ్యంగా నువ్వులు, రాగి, పత్తి, చిరుధాన్యాలకు అధికంగా పెరిగాయి. రైతులు పెట్టుబడిపై కనీసం 50 శాతం లాభం పొందేలా ఎంఎస్‌పిని సవరించారు. కాబట్టి, ఈసారి ఖరీఫ్ సీజన్ రైతులకు లాభసాటిగా ఉంటుందని ఆశిద్దాం.

## సాంకేతికతతో ఆదాయం...



ఆధునాతన సాంకేతికత, యాంత్రికీకరణ రైతుల ఆదాయాన్ని పెంచుతున్నాయి. యంత్రాలు, ఆధునిక పరికరాలు, డ్రోన్లు, స్మార్ట్ ఇరిగేషన్ వంటి సాంకేతికతలు పంటల దిగుబడిని పెంచడంలో సహాయపడతాయి. ఇది ప్రతి యూనిట్ భూమి నుండి ఎక్కువ ఉత్పత్తిని పొందేందుకు అనుకూలిస్తుంది. యాంత్రికీకరణ వల్ల కూలీలపై ఆధారపడటం తగ్గుతుంది, కార్మికుల ఖర్చు తగ్గుతుంది. ఇది రైతుల ఖర్చును తగ్గించి, లాభాన్ని పెంచుతుంది. సమాచార సాంకేతికత, డిజిటల్ పోర్టల్లు, మొబైల్ యాప్లు, సెన్సార్లు వంటివి రైతులకు కాలానుగుణ సలహాలు, మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం అందిస్తూ, ఎంచుకున్న పంటలు, పోషక నిర్వహణలో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడతాయి. అదే విధంగా సాంకేతికతలు అధిక విలువ గల పంటలు, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు (పశువులు, కోళ్లు, తేనెటీగలు) మార్గం చూపుతాయి. ఇది రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి తోడ్పడుతుంది. పంటల బీమా, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం వంటి సేవలను సులభతరం చేస్తుంది. ఇది రైతులను అనిశ్చితి నుండి కాపాడుతుంది మరియు ఆదాయ స్థిరత్వాన్ని పెంచుతుంది.



## వర్షపాతం ఆధారంగా...

*ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఈసారి రుతుపవనాలు ఎనిమిది రోజులు ముందుగానే ప్రవేశించాయి. 2009 తర్వాత ఇంత ముందుగా రుతుపవనాల రాక ఇదే మొదటిసారి. వ్యవసాయానికి ఎంతో ఉపయోగంగా ఉండే వాతావరణం కొనసాగుతుందని నిపుణులు అంటున్నారు. సాధారణంగా వర్షాధారంగా సాగు చేసే రైతులకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి అవసరం, ఎక్కువ మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.*

### తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

సగటున 40 నుంచి 60 సెంటీ మీటర్ల వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటి అవసరం తక్కువగా ఉండే పంటలు ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.

- **చిరుధాన్యాలు (మిల్లెట్స్):** జొన్న, సజ్జ, రాగి వంటి మిల్లెట్లు తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో అధిక దిగుబడి, మంచి లాభం ఇస్తాయి.
- **పప్పు ధాన్యాలు:** కంది, పెసర, మినుము, శనగ వంటి పప్పు పంటలు తక్కువ నీటితో కూడా బాగా పండుతాయి.
- **వేరుశెనగ:** తక్కువ నీటితో సాగు చేయవచ్చు, మార్కెట్ డిమాండ ఎక్కువగా ఉంటుంది.
- **సోయాబీన్:** తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేయవచ్చు.
- **పత్తి:** లోతైన నల్లరేగడి నేలలు, తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో లాభదాయకంగా ఉంటుంది.
- **గోరుచిక్కుడు, జీలుగ:** పశుగ్రాసపు పంటలు, తక్కువ నీటి అవసరం.

వర్షపాతం, నేల రకం, స్థానిక మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంట ఎంపిక చేసుకోవడం ఉత్తమం. వర్షాధారంగా సాగు చేయాలంటే తక్కువ నీటి అవసరం ఉన్న పంటల వైపు మొగ్గు చూపితే లాభం ఎక్కువ.

### మధ్యస్థ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

- **పత్తి:** మధ్యస్థ వర్షపాతం, లోతైన నల్లరేగడి నేలల్లో వర్షాధారంగా సాగు చేయవచ్చు.
- మొక్కజొన్న: తక్కువ నీటి అవసరం, మార్కెట్ డిమాండ్ ఎక్కువ.

### ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

- **వరి:** అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో వరి సాగు లాభదాయకం.

స్థూలంగా చూస్తే ఈ ఖరీఫ్‌లో చిరుధాన్యాలు, పప్పు పంటలు, వేరుశెనగ, సోయాబీన్, పత్తి వంటి పంటలు ఎక్కువ లాభాలను ఆర్జించి పెడతాయని వ్యవసాయ నిపుణుల అభిప్రాయం.

## ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన బాధ్యత సర్కారుదే

ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్య మసకబారుతుందని దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యకర్తల సమావేశం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీలు పెట్టి ఫోటోలు దిగి బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వపాఠశాలలకు రారని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదిరి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం విద్యారంగంపై దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, మహేష్, నాగరాజు, ప్రతాప్, రాకేష్, నరేష్, గోపి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల పారిశుద్ధ్య కార్యక్రమం పేరుతో మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో ఆదివారం పండగ సెలవులు కూడా ఇవ్వకుండా పనిచేయిస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. గురువారం మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ సంఘాల బాధ్యులు మునిసిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఒకవైపు వర్షాలు కురుస్తుండడం, తగిన పనిముట్లు, భద్రతా పరికరాలు లేకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు పనిముట్లు, రైన్ కోట్లు, గ్లౌజులు, బూట్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నర్సింగరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, టియుసిఐ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎం.సుదాకర్ పాల్గొన్నారు.

## బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో పాలకులు విఫలం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** తెలంగాణ విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో గత పాలకులు పూర్తి గా విఫలం చెందారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. బయ్యారం మండల సిపిఐ మహాసభ సంతులాల్ పోడు తండా గ్రామంలో గంగనబోయిన రాజు, బోడ కాంతి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. కామ్రేడ్ గుగులోత్ భద్రు స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం మహాసభనుద్దేశించి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపనే మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపన చేసి మహబూబాబాద్ జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. నిరంతరం పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని, ఇది పేద ప్రజలకు అండగా నిలిచి, ప్రజా ఉద్యమాల క్షేత్రంలో పురుడు పోసుకున్న పార్టీ అన్నారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సిపిఐ ప్రతినిధులను నిలబెట్టి వారి గెలుపునకు కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండేలా ప్రణాళికా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కార్యకర్తలు ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, కళింగరెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు నాదెండ్ల పద్మ, మందనపు రాజు, గుగులోత్ రవి, నందా, నీలావతి, మౌనిక, తోకట వీరన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 21న మంచిర్యాలలో సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాలలో జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు పిలుపునిచ్చారు. దండేపల్లి మండల మూడవ మహాసభ రాజలింగయ్య కాలనీలో గురువారం జరిగింది. సమావేశంలో మేకల దాసు మాట్లాడుతూ జూన్ 21న ప్రదర్శన, బహిరంగ సభ, జూన్ 22న ప్రతినిధుల సభ జరుగుతుందని, సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీజాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో దండేపల్లి మండల కార్యదర్శిగా పేర్క రాజేశం ఎన్నికయ్యారు కార్యక్రమంలో మేదరి దేవవరం, నీరటి కమల, గుంట భూమన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు




**ప్రజాపక్షం/కామేపల్లి:** ఎన్నికల్లో గెలిచినా ఓడినా నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. కామేపల్లి సిపిఐ 18వ మండల మహాసభ మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామం లో గురువారం సిపిఐ మండల సహాయ కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. మహా సభకు ముఖ్యఅతిథిగా భాగం హేమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి, అణచివేతకు గురవుతున్న ఏజెన్సీ గ్రామాల ప్రజల జీవన ప్రమాణా మార్పునకు నాంది పలికి వారిని ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానే అన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమన్నారు. అన్యాయం దోపిడి అణచివేత ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని, ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక పేద ప్రజల ప్రాణాలను బిజెపి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని భాగం హేమంతరావు డిమాండ్ చేశారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐ సత్తా చాటుతుందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ సిపిఐ శ్రేణులు కార్యకర్తలు నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత తాళ్లగూడెం గ్రామంలో మండల మహాసభ సందర్భంగా సిపిఐ జెండాను ఎగరవేశారు. మహాసభలో సిపిఐ, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్ర బాబు, ఏపూరి లతాదేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి శివ, కామేపల్లి మండల సిపిఐ కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నాయకులు పుచ్చకాయల కృష్ణ, శ్రీను, వెంకటకృష్ణ, శతకోటి సత్యనారాయణ, సిరిపురపు ప్రభాకర్‌రావు, బండి శ్రీను, అమరబోయిన తిరపయ్య, ఎస్‌కే సలీం, అంబడపూడి జగ్గయ్య, మండల పరిధిలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు గృహాలు ఇచ్చే వరకూ.. భూపోరాటాలు నిర్వహిస్తాం

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు కట్టించిఇచ్చే వరకు భూపోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. గురువారం బొల్లికుంట అంబేద్కర్ నగర్ శాఖ సిపిఐ ప్రథమ మహాసభ జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా మేకల రవి హాజరై మాట్లాడుతూ జిల్లాలో భూమి పేద వర్గాలకు కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను, ప్రజలకు నివాస స్థలాలు వచ్చేంతవరకు పోరాడుతామన్నారు. బొల్లికుంట శివారు ప్రభుత్వ భూమిలో సిపిఐ ఆద్వర్యంలో ఎర్రజెండాలు పాతిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డు పెట్టారని గుర్తు చేశారు. ఈ భూమిలో గుడిసెలు వేసుకున్న వాసులందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి పోరాటాలు ఆపలేరని హెచ్చరించారు. వరంగల్ జిల్లాలో ఇతర ప్రాంతాలలోనూ ఇలాంటి భూ ములు అనేకం ఉన్నాయని, వాటిని గుర్తించి పేదలకు పంచాలన్నారు. సభలో రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, ఖిలా వరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఖిలా వరంగల్ మండల సహాయ కార్యదర్శులు ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్‌పాల్, జిల్లా సమితి సభ్యులు యండి అక్బర్ పాషా, ఆరెల్లి రవి, మండల సమితి సభ్యులు యాకుబ్, చిట్యాల సువర్ణ, అంబేద్కర్ నగర్ శాఖ కమిటీ సభ్యులు, బాబు రమేష్ గౌడ్, కుమార్, ప్రభాకర్, కరుణాకర్, రోజా, సునిత తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విమాన ప్రమాదంపై మంత్రి దామోదర్ దిగ్భ్రాంతి



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై ఆరోగ్య శాఖ ,కుటుంబ సంక్షేమ శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రమాదంలో చిక్కుకున్న వారంతా సురక్షితంగా బయటపడాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ భగవంతుని ప్రార్థించారు. భాదితులను రక్షించేందుకు సహాయక చర్యలు విస్తృతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, గుజరాత్ ప్రభుత్వానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు.

## విద్యతోనే ఉన్నత స్థానం : రాష్ట్ర ప్రత్యేక అధికారి రామకృష్ణారావు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** విద్యతోనే సమాజంలో గౌరవం, ఉన్నత స్థానం దక్కుతుందని బడిబాట కార్యక్రమ రాష్ట్ర ప్రత్యేక అధికారి రామకృష్ణారావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ విద్యార్థుల్లో చక్కటి నైపుణ్యత ఉంటుందని, అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుండగా, ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని, డ్రాపౌట్స్ లేకుండా చూడడంతో పాటు విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి గుణాత్మక విద్యను అందించాలని కోరారు.
విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్ పంపిణీ చేయగా, విద్యార్హతలు కలిగి అంకితభావంతో పని చేసే గురువులపై నమ్మకం ఉంచి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని పేర్కొన్నారు. కార్పొరేట్ మోజులో పడి ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వ బడుల్లో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్నట్లు స్పష్టం చేశారు. సకల సదుపాయాలు కలిగిన ములుగు పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్ ను సందర్శించి సమిష్టిగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కాగా పాఠశాలలో వసతుల కల్పన కు విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు అమర్ నాథ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబైలిజేషన్ అధికారి రంగనాథ్, మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం రాజిరెడ్డి అధ్యక్షతన జరగగా ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున మురికి కాలువలు సరిగ్గా లేని చోట వర్షపు నీరు ఆగి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అలాంటి ప్రాంతాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమగు మాత్రలు ఉంచటంతో పాటు ప్రథమ చికిత్సకు అవసరమగు సిబ్బందిని గ్రామీణ ప్రాంతాల్లో నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ గ్రామ, మండల మహాసభలు నిర్వహించటంతో పాటు ఎక్కడికక్కడ ప్రజా సమస్యలను అధికారుల వద్దకు తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించకుందామని కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం జరిగిందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య, రాజన్న , రాజేశ్వర్, స్వరూపరాణి, నర్సింగరావు, రఘురాం, రంజిత్, సాయిలు పాల్గొన్నారు.

## వర్షాకాలం వరదనష్ట నివారణపై కలెక్టర్లకు మంత్రి పొంగులేటి సూచనలు..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో వర్షాకాలం నేపథ్యంలో వరదల కారణంగా జరిగే నష్టాన్ని నివారించేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కృష్ణ,గోదావరి నదుల పరివాహక జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ఈ సారి సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని,అందుకే అధికారులు అప్రమతగా ఉండాలని చెప్పారు.అన్ని శాఖల సమన్వయంతో వరదల వల్ల ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.గతంలో వరదలతో నష్టం జరిగిన ప్రాంతాల్లో ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్షాభావం లేదా భారీ వర్షాల వల్ల తలెత్తే ఏమైనా సమస్యలు,నివేదికలను తక్షణమే ప్రభుత్వానికి అందజేయాలన్నారు.సమావేశంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో సంభవించిన వరదలపై అధ్యయనం చేసి ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించామని,ఎలాంటి అపాయాలు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్,హైడ్రా కమిషనర్ రంగనాథ్,ఆయా జిల్లాల కలెక్టర్లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## హై స్కూల్‌ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ ను గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి పరిశీలించారు. జిల్లా పరిషత్ హై స్కూల్లో 17 క్లాస్ రూమ్స్ ఉన్నాయని, హై స్కూల్ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, జూనియర్ కాలేజ్ నిర్వహణకు రెండు గదులు అవసరం ఉన్న పక్షంలో పరిశీలించడం జరిగిందని, ప్రణాళిక బద్ధంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, మండల విద్యాశాఖ అధికారి బుచ్యానాయక్, ప్రధానోపాధ్యాయులు బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన డిసిసి అధ్యక్షుడు

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. వారితో పాటు నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ బడులోనే నాణ్యమైన విద్య ...

కలెక్టర్ క్రాంతి వల్లూరు





**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** ప్రభుత్వ బడులోనే నాణ్యమైన విద్య అని, ప్రభుత్వ బడులలో మెరుగైన సౌకర్యాలు నైపుణ్యంగల ఉపాధ్యాయులు గలరని ,అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య అందుతుందని అంగన్వాడీ బాట బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం అందోల్ మండలం నేరిడి గుంట, వట్టిపల్లి, మండలం గట్టుపల్లి లో నిర్వహించిన అంగన్వాడీ బాడి బాట కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గ్రామ పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 1249 ప్రభుత్వపాఠశాలలు ఉన్నట్లు వీటిలో నైపుణ్యం గల 5548 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీటితో పాటు జిల్లాలో బాలికల కోసం ప్రత్యేకంగా 22 కస్తూరిబా పాఠశాలను పది, ఆదర్శ పాఠశాలు బిసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగైన వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ప్రారంభానికి ముందే అన్ని రకాల వసతులు కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ప్రారంభానికి ముందే అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఒకటో తరగతి నుండి మూడో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం కోసం ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో మౌళిక వసతుల మెరుగు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు రెండు జతలు స్కూల్ యూనిఫామ్ దుస్తులు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ఉచితంగా అందిజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులలో పాటు నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,32,211 పాఠ్యపుస్తకాలకు గాను 7,15,161 పాఠ్యపుస్తకాలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు సరపరా అయినట్లు తెలిపారు. జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే క్రమంలో జిల్లాలోని 18,447 మహిళా సంఘాల నుండి 55,371 మంది సభ్యులను నిరక్షరాస్యులుగా గుర్తించడం జరిగిందన్నారు. వారిని టార్గెట్ గ్రూపులుగా నేస్తమా ఎనిమిది వందల తొంభై విలేజ్ ఆర్గనైజేషన్ వాలంటీర్లను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిపిఎం ఎపిఎం సుశీల సహకారంతో వారిని అక్షరాస్యులుగా మార్చడానికి విద్యాపీఠం నుండి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమంలో అన్ని గ్రామాలలో గ్రామసభలు, నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లోపూర్వ పాఠశాల విద్యార్థులకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యతో పాటు పిల్లలకు గర్భిణీలకు బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు మూడు సంవత్సరాల వయసు లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలుప్రీ ప్రైమరీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వికసిత కృషి సంకల్ప అభియాన్ ఉత్సవాలు

రైతులు, శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో భారతదేశ వ్యవసాయం కొత్తపుంతలు తొక్కాలి
సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** రైతులు, శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో భారతదేశ వ్యవసాయం కొత్తపుంతలు తొక్కాలని సిర్పూర్ ఎంఎల్‌ఏ డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్ర, బెల్లంపల్లి వ్యవసాయశాఖ కాగజ్‌నగర్, ధనుకా అగ్రిటెక్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్ ముగింపు ఉత్సవాలు కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఈ ముగింపు ఉత్సవాల కార్యక్రమానికి సిర్పూర్ ఎంఎల్‌ఏ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రైతులు, శాస్త్ర వేత్తల భాగస్వామ్యంతో వ్యవసాయ సాగుశైలిలో మార్పు తేవాలని తద్వారా పటిష్టమైన, సమగ్రత కలిగిన వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక వ్యవసాయం సాంకేతికతను రైతులకు చేరవేయుట, వాతావరణ ఆధారిత పంటల నిర్వహణ, దిగుబడుల పెరుగుదల, ఆదాయ భద్రతలపై అవగాహన కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆశించారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.కోట శివకృష్ణ మాట్లాడుతూ అభ్యున్నతికి వ్యవసాయంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేసే ఉద్దేశ్యంతో పాటుగా తక్కువ యూరియా వాడటం, సాగు ఖర్చును తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడటం, రశీదులను భద్రపరచడం, సాగునీటిని ఆదాచేయడం, చెట్లను పర్యావరణాన్ని కాపాడటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు నాగరాజు, శంకర్‌లు వానాకాలం సాగుచేయబోయే ప్రధాన పంటలను ఆశించే చీడపీడలు, వాటి యాజమాన్యం పైన, రైతులు రసాయనిక క్రిమి సంహారకాలను వాడే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై, కంపెని ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ, విస్తరణ అధికారులు శైలేష్, సృజన, ధనుకా అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏరియా మేనేజర్ నగేష్, సేల్స్, మార్కెటింగ్ మేనేజర్లు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కొరకు చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం అమలులో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల సమస్యలపై వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారిగా వేరు చేయాలని, దరఖాస్తుదారుడికి రసీదు అందించాలని, దరఖాస్తులను క్షుణంగా పరిశీలించాలని తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించవలసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి తమ పరిధిలో లేని దరఖాస్తులను పై స్థాయికి పంపించాలని తెలిపారు. రైతులు భూ సమస్యలపై సదస్సులలో దరఖాస్తులు సమర్పించాలని, భూ భారతి చట్టంలోని అంశాలపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సిడాం పోచయ్య, గిర్దవార్ సాయి, రెవెన్యూ సిబ్బంది, మాజీ ఎంపిపి అరిగెల మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

## కేబుల్ టీవి ఆపరేటర్ల ధర్నా




**ప్రజాపక్షం/ నస్పూర్ :** మంచిర్యాల జిల్లా కేబుల్ టివి ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ లోని కలెక్టర్ కార్యాలయం ముందు కేబుల్ టివి ఆపరేటర్ల ధర్నా చేశారు. జిల్లా కేబుల్ టివి ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గూడ రాంరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాక్షులు దోమల రమేష్ ఆధ్వర్యంలో జిల్లాలోని మండలాల నుంచి కేబుల్ టివి ఆపరేటర్లు తరలివచ్చారు. కలెక్టర్ కార్యాలయానికి ఆపరేటర్లు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతప్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేబుల్ ఈవీ ద్వారా ప్రతీ ఇంటికి ప్రభుత్వ కార్యక్రమాలు, తక్కువ చార్జీలతో ప్రజలకు ప్రత్యేక్ష ప్రసారాలను, వినోద ఛానళ్లను చూపిస్తున్నామని చెప్పారు. గత 30 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై విద్యుత్ అదికారులు కరెంటు పోల్ టాక్స్ పెంచాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆపరేటర్లు ఎంత భారమైనప్పటికిని విద్యుత్ పోల్ బిల్లు చెల్లిస్తూనే వస్తున్నారని తెలిపారు. వెంటనే పోల్ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కేబుల్ టీవీ ఆపరేటర్లకు టీవీ రీచార్జీలు తగ్గి టివి కలెక్టివిటి తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యుత్ పోల్ బిల్లు రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. అనంతరం జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈకి వినతిప్రతం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కేబుల్ టివి ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం, మండల అధ్యక్షుడు సత్యం, తిరుపతి, జైపూర్ అధ్యక్షుడు వెంకన్న, భీమారం అధ్యక్షులు శ్రీకాంత్, చెన్నూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, అధ్యక్షులు శ్రీనివాస్, భూమేష్, శంకర్, నాయకులు మల్లేష్, శ్రీనివాస్, లక్ష్మ ణ్, రాజేందర్, రాగుల మల్లేష్, రాజు, శేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

## నేర నిరూపణలో సరికొత్త టెక్నాలజీ

జిల్లా వ్యాప్తంగా 12 పోలీసు స్టేషన్లకు అంబిస్ టెక్నాలజీ పరికరాలను పంపిణీ చేసిన జిల్లా ఎస్పి జి.జానకి షర్మిల..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రస్తుత టెక్నాలజీ యుగంలో నేరగాళ్లు తెలివి మీరుతున్నారు.దర్యాప్తు అధికారులకు చిక్కకుండా ఎత్తు కు పై ఎత్తులు వేస్తున్నారు.గతంలో వేలి ముద్రల ఆధారంగానే నేర దర్యాప్తు చేసేవారు,కానీ ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక అంబిస్ టెక్నాలజీ తో కాలి ముద్రలు,ఐరిస్,ముఖ కవళికలు,ఎత్తు,బరువు చేతి రాత,ఇలా ప్రతి విషయాన్ని నమోదు చేయవచ్చు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 పోలీసు స్టేషన్లకు ఈ అంబిస్ పరికరాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గతంలో అఫిజ్ టెక్నాలజీ ఉపయోగించి లైవ్ స్కానర్ ద్వార నేరగాళ్ల వేలిముద్రలు,అర చేతి ముద్రలు మాత్రమే తీసుకునేవాళ్ళం,కానీ ఇప్పటి నుండి అత్యాధునిక టెక్నాలజీ లో డెల్ ఆప్టిప్లెక్స్ ఆల్ ఇన వన్ 7420(సిస్టమ్),ఐరిస్ స్కానర్ బి.ఎమ్20(కళ్ళ స్కానర్)ఎప్సన్‌వి 39 స్కానర్ (పాద ముద్రల స్కానర్) లాజిటెక్ సి.270 వెబ్ క్యామ్(నేరస్థుల ఫోటోలను నిక్షిప్తం చేసే పరికరం) హెల్త్ సెన్స్ బిఎస్ 161 (ఎ లక్ట్రానిక్ వెయ్యింగ్ మెషిన్),ఎమ్.ఎస్.సి.డి(చెకింగ్ పరికరం) పాపిలోన్ పామ్ లైవ్ స్కానర్ పరికరాలను జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల పంపిణీ చేశారు.ఈ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా నేరగాళ్ళ యొక్క పూర్తి సమాచారం అనగా ముఖ కవళికలు,ఐరిస్ (కళ్లు),ఎత్తు,బరువు,పాదముద్రల ను తీసుకొని డేటాబేస్ సర్వర్ లో నిక్షిప్తం చేయడం జరుగుతుంది.తద్వారా ఆ నేరగాళ్లు మళ్ళీ ఎప్పుడైన నేరం చేసి పట్టుబడినప్పుడు ఈ అంబిస్ టెక్నాలజీ ఉపయోగించి నేరగాళ్లను చాలా సులభంగా గుర్తిస్తామని పేర్కొన్నారు.ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్ మరియు ఎం.ఎస్.సి.డి పాపి లోన్ డివైస్ ట్రైనింగ్ ను సద్వినియోగం గురించి ఎలాంటి సందేహాలున్న ఫింగర్ ప్రింట్ ఇంచార్జి ఏ.ఎస్ఐ కిరణ్‌తో నివృత్తి చేసుకోవాలని అన్నారు.సిబ్బంది ప్రతి ఒక్కరూ ఈ ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్,ఎం.ఎస్.సి.డి పాపిలోన్ డివైస్ లపై నైపుణ్యత కలిగి తమ,తమ పోలీసు స్టేషన్‌లలో నమోదు అవుతున్న వివిధ రకాల నేరాలు,సస్పెక్ట్ చెక్ ఫింగర్ ప్రింట్స్ సేకరించి,కేసుల చేదనకు కృషి చేయాలని సిబ్బంది కి సూచించారు.ప్రతి ఒక్కరూ కూడా తమ విధులలో పూర్తి సాంకేతిక పరిజ్ఞానం తో నిబద్ధతితో పని చేయాలని,తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని అన్నారు.ప్రతి ఒక్కరూ తమన తమ విధుల పట్ల శ్రద్ధ వహించి,పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శేఖర్,రామకిష్ణ,ఎస్ఐలు,ఆర్ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## గుంతలమయంగా మారిన రోడ్డు

ప్యాచ్ వర్క్ ఫెయిల్యూర్







**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పది లక్షల వ్యయంతో వేసిన ప్యాచ్‌వర్క్ పట్టుమని పది రోజులు కూడా గడవక ముందే గుంటలుగా మారటం విస్మయానికి గురి చేస్తోంది. వివరాల్లోకి వెళితే సిరికొండ మండలం సిరికొండ నుంచి చిన్నవాల్గోట్ వెళ్లే బైపాస్ రోడ్డుపై ఇటీవల రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన ప్యాచ్ వర్క్ పనులు పూర్తిగా విఫలమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మొదటి వర్షానికే రోడ్డంతా మళ్లీ గుంతలతో నిండి, నీటి మడుగులుగా మారింది. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుంతలపై నీరు నిలిచిపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిధులు కేటాయిస్తుంటే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. రూరల్‌ను అభివృద్ధిలో నిలపాలని ఎమ్మెల్యే ఒక పక్క కృషి చేస్తుంటే అధికారులు మాత్రం అందుకు తగ్గట్లు పని చేయకపోవడం పర్యవేక్షించకపోవటంతో ఇలాంఇ తప్పిదాలు పునరావృతమవుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ప్యాచ్ వర్క్ నాణ్యతపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవటంతో మరింత అనుమానం వ్యక్తమవుతుంది. 'ఫొటోలు చూసినా స్పష్టంగా తెలుస్తోంది గుంతలు, నీటి నిల్వలు, పటిష్టమైన పర్యవేక్షణ లేకుండా వృధా అయిన నిధులు ' అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కాక ముందే తక్షణమే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టకపోతే ప్రమాదాలే కాకుండా, రైతులకు రవాణా విద్యార్థుల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కాంట్రాక్టర్‌తో మళ్లీ రోడ్డు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డుకు రూ. 80 లక్షలతో ఇటీవల శంకుస్థాపన కూడా చేయటం జరిగింది. ఈ పనులు ప్రారంభిస్తే గనుక రోడ్డు సమస్య పరిష్కారం దొరకనుంది. ఈ విషయంలో డీఈ అహ్మద్ హుస్సేన్ వివరణ కోరగా ప్యాచ్ వర్క్ లాప్స్ అయిపోయాయని ఉద్దేశ్యంతో పూర్తి చేశాము. ఇప్పుడు ఏం చేసే అవకాశం లేదని చెప్పడం గమనార్హం.

## ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే విద్యార్థులకు తరగతి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచందర్ రెడ్డి, ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి 3 ఏళ్ల జైలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మైనర్ బాలిక పట్లఅసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం గురువారం 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.12,200 జరిమాన విధించింది .ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన నిందితుడు రెడపాక శ్రీనివాస్ (26) బాలిక ఇంట్లోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు.2021లో జరిగిన ఈ ఘటనపై బాధితురాలు గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జీవన్ కేసు దర్యాప్తు చేశారు.కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్ సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు వాదనలు వినిపించారు.సాక్షులను విచారించారు. నేరం రుజువైంది.నిందితుడు రెడపాక శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు, రూ.12,200 జరిమాన విధిస్తూ జిల్లా న్యాయమూర్తి సి. రత్నాపద్మావతి తీర్పునిచ్చారు. పిపి రామకృష్ణారావు,ఎస్సైలు జీవన్ ,సతీష్ ,సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్ ,సి ఎం ఎస్ కానిస్టేబుల్‌లు రాజు,కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ గత రెండు రోజుల క్రితం మణుగూరు లో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి భూపాలపల్లి కి వస్తుండగా కారు టైరు పగిలి చెట్టు కు డీ కొనగా రాజ్ కుమార్ తో పాటు కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, వెంటనే వారు భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ కి వెళ్లి ట్రీట్మెంట్ కోసం అడ్మిట్ కావడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఏఐటియుసి నాయకులు భూపాలపల్లి ఏరియా కి వెళ్లి రాజ్ కుమార్ ను పరామర్శించడం జరిగింది. పరామర్శించిన వారిలో ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, నాయకులు సంకె అశోక్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం / చందుర్తి :** మండలం కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్ర భుత్వవిప్, స్థానిక ఎమ్మె ల్యే ఆది శ్రీనివాస్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు , ఏకరూప దుస్తులు అందజేశారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.తన కుతూరుని పాఠశాలలో చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కపిల్ల నరేష్‌ని అభినందించారు.

## విద్యార్థులకు యూనిఫామ్ అందజేత



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని జైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు,ఉచితపాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సుజాత, కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, గ్రామ మాజీ ఎంపిటిసి కుంట సుధాకర్, మాజీ సర్పంచ్ కుడిక్యాల మహేష్, వివోఏ లావణ్య, అల్లె రమేష్, కట్ట లక్ష్మ ణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర హరి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై స్కావెంజర్లకు శిక్షణ



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ధర్మపురి మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్స్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పారిశుధ్య ఆవశ్యకత, పరిశుభ్రత నిర్వహణపై అవగాహన కల్పించారు. పారిశుధ్య పనులను స్కావెంజర్స్ జయశ్రీ, రాజన్న ప్రాక్టికల్స్‌గా చూపించగా, రిసోర్స్ పర్సన్ కనపర్తి సంతోష్ కుమార్ పరిశుభ్రత నిర్వహణను వివరించారు. పరిశుభ్రతపై స్థానిక పిల్లల వైద్యులు డా. శ్రీనివాస్ పలు అంశాలపై సూచనలు చేశారు. మండల విద్యాధికారిణి సీతాలక్ష్మి , పలు పాఠశాలల, ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్స్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## ఎస్‌పిని కలిసిన టౌన్ సిఐ కరుణాకర్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధిః** జగిత్యాల టౌన్ ఇన్స్‌ఫెక్టార్‌గా బాధ్యతలు స్వీకరించిన పెరుక కరుణాకర్ ఎస్పీఅశోక్‌కుమార్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి మొక్కను అందజేశారు.

## వర్షాలు కురవాలని 'కప్పతల్లి ఆటలు'!



**ప్రజాపక్షం/ముత్తారం :** వర్షాలు సమృద్ధిగా కురువాలని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపేట గ్రా మంలోని రైతులు గురువారం కప్పతల్లి ఆటలు ఆడారు. ప్రతి యేటా జూన్ నెలలో వర్షా లు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండి తమ పంటలకు సరిపడ నీరు నిల్వలతోపాటు భూగర్భజలాల నిలువలు ఉండే విధంగా వర్షాలు కురవాలంటూ చిన్నారులు, పెద్దలు కలిసి కప్పలను కట్టి ఇంటింటికీ గ్రామంలోని పలు ఆలయాల చుట్టూ తిరుగుతూ మొక్కులు చెల్లించుకుంటూ, సంప్రదాయ నృత్యాలు చేస్తూ వీధుల్లో తిరిగారు. మహిళలు హారతి పట్టి, కప్పకు, చిన్నారులకు స్నానం చేయించారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కప్పతల్లి ఆటలు ఆడామని గ్రామస్తులు తెలిపారు.

## హత్యకేసులో నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట పట్టణంలోని మయూరి బార్ సమీపంలో రెండు రోజుల క్రితం వ్యక్తి హత్యకేసును త్రీటౌన్ పోలీసులు కేసు చేధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సిద్దిపేట త్రీటౌన్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మృతుడు తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన బోదాసు నర్సింలు అని, అతనిని గ్యాదరి అలియాస్ బోదాసు శ్రీదేవి,ఇట్టవేన సతీష్ కలిసి శనివారం రాత్రి ముగ్గురు కలిసి మద్యం సేవించారని, పై నిందితులు అనుకున్న పథకం ప్రకారం చాతి,ముఖం,తల వెనుక పిడి గుద్దులతో కొట్టగా మృతుడు నర్సింలు చనిపోయాడని తెలిపారు. సిఐ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించామన్నారు.చాకచక్యంగా వ్యవహరించిన సిఐ, సిబ్బందిని సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి అభినందించారు.

# స్వీయపరీక్షతోనే క్యాన్సర్‌కు చెక్

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి
### మహిళలు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః** మహిళలు స్వీ య పరీక్షద్వారారొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించవచ్చని, తద్వారా ప్రాణాపాయ ముప్పు తగ్గించవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సనా చారిటబుల్ ట్రస్ట్, ఎంఎస్‌జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం పోలీస్,మున్సిపల్ మహిళా సిబ్బందికి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారాసమాజంఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళ తన ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నామని తెలిపారు. మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ కమిషన్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్‌పేయ్ , సనా చారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు సురభి సత్తయ్య, కో ఆర్డినేటర్ సురభి నరసమ్మ, ఎంఎస్‌జే వైద్యులు డాక్టర్ ప్రణయ్, డాక్టర్ సుస్మితరెడ్డి పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

అన్ని సౌకర్యాలతో ఇంటికి సమీపంలో ఉండే ప్ర భుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పునఃప్రారంభం సందర్భంగాజిల్లా కలెక్టర్ విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినూత్న రీతిలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డెడ్ ఎడ్, ఒలంపియాడ్, కంప్యూటర్ వంటి విభిన్న రంగాల్లో, క్రీడా పోటీల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ గదిని పరిశీలించారు.పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు బి.పద్మ పాల్గొన్నారు.

## చాడ శోభ మరణం సిపిఐకి తీరని లోటు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/చిగురుమామిడిఃచి** గురుమామిడిమండలం రేకొండ మాజీ ఎంపిటిసి చాడ శోభ మృతి చెందడం సిపిఐకి, వారి కుటుంబానికి తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం చాడ శోభ అనారోగ్యంతో కరీంనగర్‌లోని అపోలో రీచ్ హాస్పిటల్‌లో మృతి చెందారు. రేకొండలో ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. సిపిఐ మండల నాయకత్వం శోభ మృతదేహంపై పార్టీ పతాకం కప్పి నివాళులర్పించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ చాడ శోభ మంచి మనసున్న మానవత్వం గల వ్యక్తి అని, గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకునే మనస్తత్వం గలదన్నారు. ఆమె భర్త ప్రభాకర్‌రెడ్డి చిగురుమామిడిమండలపరిషత్‌అధ్యక్షుడిగా,సిపిఐ జిల్లా నాయకునిగా పనిచేశారని,ఆయన అడుగుజాడల్లో నడుస్తూ గ్రామ ప్రజలకు అండగా నిలిచారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడులు మర్రి వెంకటస్వామి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మండల కార్యదర్శినాగెల్లిలక్ష్మారెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి , కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు,తేరాలసత్యనారాయణ, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, బోనగిరి మహేందర్, యెడల వనేష్, కొయ్యడ కొమురయ్య, మాజీ మండల కార్యదర్శి ఎనగందుల రాజయ్య, మాజీ సర్పంచ్‌లు గోలి బాపు రెడ్డి, కోమటి రడ్డి జయపాల్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, తదితరులున్నారు.

## పేదవాడి సొంతింటి కల సాకారం

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** పేదవాడి సొంతింటి కల సాకారం అయిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ 17వ వార్డుకు చెందిన నిమిషకవి రమాకాంత్ మాధవి ల నూకపెల్లి డబుల్ బెడ్రూం నూతన గృహ ప్రవేశానికి ఎంఎల్ఏ సంజయ్‌కుమార్‌హాజరయ్యారు.కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద ప్రాజెక్టు 4520 డబల్ బెడ్రూం ఇండ్ల నాణ్యతతో ని ర్మాణం అయిందని, కిరాయి దారు నుండి ఇంటి యజమానురాలుగా మాధవి... అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరిక అని, ముఖ్యమంత్రి సహాకారంతో జగిత్యాల మరింత అభివృద్ధి చెందుతుందని, 70కోట్ల నిధులు మంజూర్ కాగా జగిత్యాల రూపురేఖలు మార్చే అవకాశం ముఖ్యమంత్రి కల్పించారన్నారు. రంగు మహేష్, ములసపు మహేష్, ప్రవీణ్‌రావు, నిమిషకవి వంశీ బాబు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి

### జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల్లో చిన్నప్పటి నుండే అవగాహన పెంపోందిస్తే రాబోయే రోజుల్లో బాధ్యతాయుతమైనపౌరులుగా తీర్చిదిద్దవచ్చుననే ఉద్దేశ్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపోందించామని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ పాఠశాల యువ పౌరుల కోసం రోడ్డు భద్రత అనే ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ గురువారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లలు మన భవిష్యత్ వారికి సమాజం మరింత భద్రతమవుతుందనే ఉద్దేశ్యంతో పోలీస్ పాఠశాల, యువ పౌరుల కోసం రోడ్డు భద్రత కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం చిన్నారుల్లో రోడ్డు నియమాల పట్ల చైతన్యం పెంపోదించటం, విద్యార్థులపై జరిగే రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించడం, విద్యార్థులను వారి ఇంట్లో సమాజంలో ట్రాఫిక్ భద్రత వారియర్స్ గా మారేందుకు ప్రోత్సాహించడం జరుగుతుందన్నారు. పోలీసు విద్యార్థుల మధ్య స్నేహపూరిత సంబంధాన్ని ఏర్పరచడం వంటి కార్యక్రమం ఒక్కో పాఠశాలకి పోలిసులు వెళ్లి విద్యార్థులతో ప్రత్యక్షంగా ముఖాముఖి సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు సురక్షిత ప్రయాణ పద్దతులు, రోడ్డుపై ఎలా సురక్షితంగా నడవాలనేదిసైకిల్ నడిపేటప్పుడు కుటుంబ సభ్యులతో కార్, అత్యవసర పరిస్థిల్లో తీసుకోవాల్సి చర్యలు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జగిత్యాల టౌన్ ఇన్స్‌పెక్టర్ పెరుక కరుణాకర్, ఐటీకోర్ ఇన్స్‌ఫెక్టార్ రఫీక్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జూన్ 13 న పెద్దపల్లి జిల్లాలో జరగనున్న మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం మంత్రుల పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలిగేడు మండల హెడ్ క్వార్టర్ లో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం, సమీకృత జిల్లా కలెక్టరేట్ సమీపంలో నిర్మించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ యార్డులోని మహిళా పోలీస్ స్టేషన్, జెండా చౌరస్తా వద్ద నిర్మించనున్న మార్కెట్, చందంపల్లి, రాంపల్లి లో పంపిణీ చేయనున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 13న పెద్దపెల్లి జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పర్యటించనున్నారన్నారు.నూతనంగా నిర్మించిన నాలుగు పోలీస్ స్టేషన్లను ప్రారంభిస్తారని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో నిర్మించనున్న మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం చందంపల్లి లో (196), రాంపల్లిలో (288) నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని అక్కడే బహిరంగ సభలో కూడా పాల్గొంటారని వివరించారు.పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ఏసిపి కృష్ణ , ఎలిగేడు తహసిల్దార్ యాకన్న, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పిడీ హౌసింగ్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర జెండాను అంతం చేయడం ఎవరి తరం కాదు

### ఎఐటియుసి కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** అమరులు చిందించిన రక్తం నుండి పుట్టిందే ఎర్రజెండాను ఎర్రజెండానుఅంతం చేయడం ఎవరి తరం కాదని సింగరేణి కాంగ్రెస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అన్నారు. స్థానిక బస్టాండ్ కాలనీ 27వ డివిజన్ సిపిఐ శాఖ మహాసభలోముఖ్య అతిథిగా మాట్లాడుతూ బస్టాండ్ కాలనీలో క్వార్టర్ల నిర్మాణం దగ్గర నుండి ఇప్పటివరకుదాదాపు30సంవత్సరాలుగాకార్మిక,ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. రాబోయే కాలంలో బస్టాండ్ కాలనీ 27వ డివిజన్లో సిపిఐ పోటీ చేస్తుందని,గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగేసిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ మాట్లాడుతూబస్టాండ్ సమీపంలో సర్వీస్ రోడ్డు నిర్మించాలని, సిపిఐ పోరాటాలు చేసిందని, దాని ఫలితంగానే నిర్మాణం జరుగుతుందన్నారు. సిపిఐ నగరసహాయకార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, ఏఐటియుసి సీనియర్ నాయకులు అనమోలు సురేష్ , వెంకటరెడ్డి, రేణుకుంట్ల ప్రీతం పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్ కాలనీ 27వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కార్యదర్శి గా కామ్రేడ్ ఉప్పులేటి తిరుపతి, సహాయ కార్యదర్శి గా కెక్కెర్ల ప్రశాంత్, కోశాధికారిగా కోట అంజన్న, కార్యవర్గ సభ్యులుగా కోరిమీ శ్రావణ్, తాళ్ళ పెల్లి శ్రావణ్, బొల్లంపల్లి జీవన్‌లను ఎన్నుకున్నారు.

## ఆరోగ్య సంరక్షణలో సర్జన్ల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** ఆరోగ్య సంరక్షణలో సర్జన్స్ పాత్ర కీలకమని,వారి అంకిత భావం కృషిని గుర్తించడానికే నేషనల్ సర్జన్ వీక్ ఈ నెల 9నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రఫి,డాక్టర్ బాస్కర్‌రావు తెలిపారు. గురువారం సురభి ఇన్స్టిట్యూట్‌ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంబిజెఆర్ చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరకు వైద్య విద్యార్థులు,డాక్టర్లతో కలిసి వాకథాన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్జన్లు రోగుల శ్రేయస్సు కోసం తమ జీవితాలను అంకితం చేయాల్సి ఉంటుందన్నారు. సర్జన్ల కోసం నేషనల్ సర్జన్ వీక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సురభి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రొపెసర్ ఐలయ్య,డాక్టర్ బాస్కర్, డాక్టర్లు, వైద్య విద్యార్థులు, పిఆర్ఓ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఒరవడికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రీకారం

### సొంత వాహనాన్ని బడిబాట విద్యావాహినిగా మార్చారు..



**ప్రజాపక్షం/గంగాధరః** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వినూత్న వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తన సొంత వాహనాన్ని బడిబాట విద్యావాహిని వాహనంగా మార్చాలని నిర్ణయించారు. గురువారం గంగాధర మండలం మల్లాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో వాహనాన్ని విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను మళ్లించే విధంగా కుట్రలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎంఈవో ప్రభాకర్ రావు, స్కూల్ హెచ్ఎం అంజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల రావు, పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ , నాయకులు దుబ్బాసి బుచ్చన్న, పడితపల్లి కిషన్, కోల ప్రభాకర్, కొలిపాక స్వామి,సీనియర్ నాయకులు సత్తు కనకయ్య, గంగాధర సుదర్శన్, గునుకొండ బాబు, వేముల అంజి, కంకణాల రాజగోపాల్ రెడ్డి, గుజ్జుల బాపు రెడ్డి, కర్ర బాపురెడ్డి, గరిగంటి కరుణాకర్, మంత్రి మహేందర్, పెంచాల చందు, పానుగంటి సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులున్నారు.

# రోడ్డు విస్తరణలో బాధితులకు పరిహారమివ్వండి

### మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధిః** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ప్రధాన సమస్య యావర్ రోడ్డు అని, జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. 2008–09లో యావర్ రోడ్డు విస్తరణకు ప్రయత్నం చేయడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపు కోసం బైపాస్ రోడ్డు వేసి, గొల్లపల్లి, ధర్మపురి రోడ్డుతో లింక్ చేశామన్నారు. 60 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లకు విస్తరించాలని విన్నవించిన, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ప్రతిపాదించారు. 2018లో యావర్ రోడ్డు విస్తరణ చేపడితే కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తదో అని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రతిపాదనలు తొక్కి పెట్టారు. బీఆర్ఎస్ హాయంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద రోడ్డు విస్తరించారు. విస్తరణలో నిర్మాణాలు కోల్పోయిన వారికి పరిహారం చెల్లిస్తే అప్పుడే అమలు అయ్యేది.. ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా టి డీ ఆర్ తెర పైకి తీసుకువచ్చి ఐదేల్లు గడిపారు. ఎంఎల్ఏ ఎన్నికల్లో ఆశించిన ఫలితం రాకపోయిన తానకున్న అనుభవం, జగిత్యాల అభివృద్ధి కోసం యావర్ రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయే వారికి నిధులు జూన్ 29, 2024న ముఖ్యమంత్రికి లేఖ రాశాను. ముఖ్యమంత్రి స్పందించి నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. అన్నపూర్ణ చౌర స్తా నుండి నూతన బస్టాండ్ వరకు 100 కోట్లు అవసరం అవుతాయని అధికారులు డిసెంబర్ 2024లో కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ ద్వారా నివేదిక సమర్పించారు. కాంగ్రెస్‌ప్రభుత్వంజగిత్యాలచుట్టూ విస్తరించిన ప్రాంతాల కోసం రూ 20 కోట్లు పట్టణ పరిధిలో రూ50 కోట్లు స్పెషల్ గ్రాంట్ గా మంజూర్ చేసింది. ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు యావర్ రోడ్డు విస్తరణ ప్రధానంగా సమస్యగా భావిస్తున్న తరుణంలో ప్రణాళిక బద్ధంగా, యావర్ రోడ్డు విస్తరణ కోసం రూ50 కోట్లు వెచ్చించాలని, రోడ్డు విస్తరణ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత, యావర్ రోడ్డు జాతీయ రహదారి కావడంతో రోడ్డు నిర్మాణానికి కూడా ఎంపీ సహకారం తీసుకుని నిధులు మంజూరు చేసుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల మున్సిపాలిటీకి ప్రత్యేకంగా కేటాయించిన రూ. 50 కోట్లు రోడ్డు విస్తరణలో నిర్మాణాలు కోల్పోయే వారికి పరిహారం చెల్లింపులు చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన కోరుతున్నానని జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని అన్నారు. డబుల్ బెడ్రూం లబ్దిదారులు 3500 కుటుంబాలను గుర్తించి వివిధ వార్డుల్లో ఓటర్లతో నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ నీ రెండు వార్డులుగా విభజన చేయాలన్నారు. నూకపెల్లిలో రెండు వార్డులు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని జీవన్‌రెడ్డి కోరారు. బండ శంకర్, కొత్త మోహన్, కల్లేపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, చందా రాధకిషన్, జితేందర్, మున్నా, మొగిలి, రఘువీర్, గుండా మధు, గిరిధర్, సాయి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/గోదావరిఖని:** ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెడు ఆలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ప్రజలకు సూచించారు. గురువారం గోదావరిఖని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 13వ డివిజన్ విఠల్‌నగర్‌లో రోహిణి ఫౌండేషన్ సహకారంతో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఏసీపీతో పాటు సీఐ ఇంద్రసేనారెడ్డి క్యాంపును సందర్శించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. రమేష్, వైద్యులు నితిన్, అఖిల, ధనుంజయ్, అరుణ్, అఖిల, సహాయకుడు శివ, చుక్కల శ్రీనివాస్, కె.ఓదేలు, మల్లయ్య, రవి, రామ్‌కుమార్, అశోక్‌లు పాల్గొన్నారు.

# రీల్





పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన '8 వసంతాలు' ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్చువల్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'అందమా అందమా' చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ రోజు సెకండ్ సింగిల్ పరిచయమిలా సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. సోల్ ఫుల్ నెంబర్‌కి పాపులర్ సింగర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ ఒక బ్యూటిఫుల్ మెలోడీగా స్వరపరిచారు. వనమాలి రాసిన సాహిత్యం అద్భుతంగా వుంది. వెటరన్ సింగర్ కేఎస్ మెలోడీస్ వాయిస్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేసింది. ఆమె మాగ్నటిక్ వాయిస్ తో సాంగ్ నెక్స్ట్ కి వెళ్ళింది. సాంగ్ లో విజువల్స్ చాలా ప్లెజెంట్ గా వున్నాయి.నవీన్ యెర్నేని,వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. అరవింద్ ములె ప్రొడక్షన్ డిజైనర్, శశాంక్ మాలి ఎడిటింగ్ పర్యవేక్షిస్తున్నారు. బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతమైన కథనంతో ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ విడుదల కానుంది.



## 'తమ్ముడు' ట్రైలర్ విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ లో ఘనంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ మా సంస్థలో సంక్రాంతికి వస్తున్నాం త ర్వాత తమ్ముడు మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడెప్పుడు అనౌన్స్ చేద్దామా అని ఎదురుచూశాం.జూలై 4 న రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాం. దర్శకుడు శ్రీరామ్ వేణు మాట్లాడుతూ తమ్ముడు మూవీ ట్రైలర్ కు మీ దగ్గర నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఆనందంగా ఉంది. హీరో నితిన్ మాట్లాడుతూ తమ్ముడు మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాం. ఈ సినిమాకు లయ చాలా ఇంపార్టెంట్. ఆమె చాలా బాగా పర్ ఫార్మ్ చేశారు. అలాగే సప్తమి గౌడ ఈ చిత్రంలో కీ రోల్ చేశారు. నా కెరీర్ బిగినింగ్ లో దిల్ సినిమాకు రాజు గారు హయ్యెస్ట్ బడ్జెట్ పెట్టారు. అప్పట్లో సెట్ కోసం 60 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఆ సినిమా మంచి హిట్ అయ్యింది. మళ్లీ తమ్ముడు మూవీకి నా కెరీర్ లోనే హయ్యెస్ట్ బడ్జెట్ ఖర్చు చేశారు.

## హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ తో గోపిచంద్ సినిమా



గోపిచంద్ 33వ సినిమా గ్లింప్స్ రిలీజ్

మాచో స్టార్ గోపీచంద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 33వ సినిమా కు శ్రీకారం చుట్టారు. హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. యాక్షన్ నేపథ్యంలో నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్నారు. బర్త్ డే సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇంతవరకు గోపిచంద్ చేయని పాత్రను ఇందులో పోషిస్తున్నారని శ్రీనివాస్ రావు తెలిపారు. మేకర్స్ అద్భుతమైన పోస్టర్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. గోపీచంద్ లుక్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఒక యోధుడిగా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. పొడవాటి జుట్టు, యుద్ధగాయాలు, నుదిటిపై వీర తిలకంతో కనిపించిన ఇంటెన్స్ లుక్ ఫ్యాన్స్‌ను సర్ ప్రైజ్ చేసింది. చేతిలో ఖడ్గంతో యుద్ధరంగంలో కనిపించిన ఈ పోస్టర్ శక్తి, శౌర్యాన్ని ప్రజెంట్ చేస్తోంది.ఘాజి , అంతరిక్షం వంటి విభిన్న కథల చిత్రాలతో తన ప్రత్యేక కథనశైలి, సాంకేతిక నైపుణ్యంతో గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి, ఇప్పుడు మరో డిఫరెంట్ జానర్ లోకి అడుగుపెట్టారు .సంకల్ప్ రెడ్డి ఈ సినిమాలో భారత దేశ చరిత్రలో మరిచిపోయిన ఒక కీలక ఘట్టాన్ని అద్భుతంగా మలిచారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూ పొందిన ఈ సినిమా, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, మరిచిపోయిన అధ్యాయానికి మళ్లీ జీవం పోస్తోంది.



## 16న రాజా సాబ్ టీజర్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో నిర్మిస్తున్న రాజాసాబ్ టీజర్ విడుదలకు సిద్ధమైంది. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు మారుతి కలిసి టీజర్ ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 16న ఉదయం 10 గంటల 52 నిమిషాలకు టీజర్ రిలీజ్ చేయనున్నారు. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోంది.

## సీనియర్ నిర్మాత ఏ.ఏ ఆర్ట్స్ మహేంద్ర కన్నుమూత



శ్రీహరిని హీరోగా పరిచయం చేసిన నిర్మాత ఏఏఆరట్స్ అధినేత మహేంద్ర గుండెపోటు తో కన్నుమూశారు. 1946 ఫిబ్రవరి 4న గుడివాడ తాలుక దోసపాడులో జన్మించిన కావూరి మహేంద్ర దర్శకత్వ శాఖలో శిక్షణ పొంది నిర్మాతగా మారారు. కె. ప్రత్య గాత్మ, కె. హేమాంబరధరరావు వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన మహేంద్ర ప్రొడక్షన్ కంట్రోలర్ గానూ పలు చిత్రాలకు పనిచేశారు. 1977లో 'ప్రేమించి పెళ్ళి చేసుకో'తో నిర్మాతగా మారిన మహేంద్ర ఏది పుణ్యం? ఏది పాపం?', 'ఆరని మంటలు', 'తోడు దొంగలు', 'బందిపోటు రుద్రమ్మ', 'ఎదురలేని మొనగాడు', 'ధాకూరాణి', ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహాత్మ్యం' తదితర చిత్రాలను నిర్మించారు. యాక్షన్ స్టార్ శ్రీహరిని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' 'దేవా' సినిమాలను నిర్మించారు. మహేంద్ర కుమార్తెను హీరో మాదాల రవి వివాహం చేసుకున్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న మహేంద్ర గుంటూరులో తుదిశ్వాస విడిచారు. మహేంద్ర అంత్యక్రియలు గుంటూరులో జరిగాయి.



## 'మిత్ర మండలి' టీజర్ ఆవిష్కరించిన అల్లు అరవింద్

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడి యా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ కు విశేష స్పందన లభించింది.తాజాగా 'మిత్ర మండలి' టీజర్ ను నిర్మాతలు విడుదల చేశారు. టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం హైదరాబాద్ లోని ఏఏఏ సినిమాస్‌లో జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'బన్నీ వాసు సమర్పిస్తున్న మొదటి సినిమా గా, నా మిత్రులందరూ కలిసి తీసిన ఈ 'మిత్ర మండలి' టీజ ర్‌ను లాంచ్ చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. ఒకసారి వాసు ఈ కథ వినమని దర్శకుడిని నా దగ్గరకు పంపించాడు. కానీ, మీ ముందు కథ చెప్పలేకపోతున్నాను అని దర్శకుడు వెళ్ళిపోయాడు. నేను కథ వినకుండానే, నేరుగా ఈ సినిమా చూడబోతున్నాం. వీరందరి మాటలు వింటుంటే.. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది.టీజర్ చాలా బాగుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకంటూ, చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్.' అన్నారు.





## కాళోజీ సినిమాకు గద్దర్ అవార్డు సంతోష దాయకం

-దర్శకుడు ప్రభాకర్ జైనీ

తాను రూపొందించిన 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్ కు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని దర్శకుడు ప్రభాకర్ జైనీ అన్నారు. మంచి సినిమా తీసి అవార్డు కు ఎంపికైనందుకు ఆనందంగానే ఉన్నా ఇలాంటి సినిమాలు థియేటర్ లో విడుదల చేయడానికి ఎవరూ సహకరించకపోవడం బాధాకరం అన్నారు. కాళోజీ సినిమా కు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా దర్శకుడు ప్రభాకర్ జైనీ తో ప్రజాపక్షం ప్రతినిధి స్పందన అడిగారు. ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ థియేటర్లో రిలీజ్ కాలేదు. ఎంతో మందిని బ్రతిమిలాడినా, 'ఈ సినిమా నడవదు' అని తిరస్కరించారు. అప్పటికే మేము ఆర్థికంగా బాగా నష్టపోయాము కాబట్టి, డబ్బు లు ఎదురు కట్టి, క్యూబ్, యూ ఎఫ్ ఓ వంటి కంటెంట్ ప్రొవైడర్స్ కు ఒక్కొ థియేటరుకు వారానికి సుమారు 20 వేలు, పబ్లిసిటీ మెటీరియల్‌కు మరి కొన్ని డబ్బులు కట్టలేక, థియేటర్లలో రిలీజ్ చేయలేకపోయాము.గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు రావడం, నాకు నా జీవితంలో అత్యంత ఆనందకరమైన సంఘటన. ఈ వార్త తెలిసినప్పుడు మా కుటుంబ సభ్యులందరం కన్నీరు కార్చాము. మా నాలుగు సంవత్సరాల శ్రమకు ఫలితం దక్కిందని భావించాము. మేము వృత్తిరీత్యా సినిమా నిర్మాతలం కాదు. ఒక ప్యాషన్ తో, సందేశాత్మక, మంచి సినిమా తీయాలన్న ఉద్దేశ్యంతో సినిమా రంగాన్ని మా ప్రవృత్తిగా ఎంచుకున్నాము. మేం సినిమా మొదలు పెట్టినప్పుడే 'ప్రజాకవి కాళోజీ' కమర్షియల్ సినిమా కాదని తెలుసు.

## మోహన్‌బాబుపై కేసులో రిపోర్టు ఇవ్వండి:హైకోర్టు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలో విలేకరిపై దాడి చేశారంటూ యాక్టర్ మోహన్‌బాబుపై పెట్టిన కేసులో దర్యాప్తు నివేదిక ఇవ్వాలని పహాడీషరీఫ్ పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. మోహన్‌బాబుపై ఫిర్యాదు చేసిన రంజిత్‌కుమార్‌కు నోటీసులు జారీ చేయాలంది. విలేకరిపై దాడికి సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మ ణ్ గురువారం విచారించారు. విచారణను ఈనెల 24కు వాయిదా వేశారు.

## ఉన్నత స్థాయికి

(మొదటి పేజీ తరువాయి)

నియామకాలు చేపడుతున్నామని సైన్స్ ఇన్నోవేషన్, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ చదువుల్లోనే కాకుండ క్రీడలు, పాఠ్యాంశ, అనుబంధఅంశాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు మాట్లాడే స్కిల్స్, డ్రాఫ్టింగ్ స్కిల్స్, ఏదైన ఇబ్బంది వచ్చినప్పుడు ఎదుర్కోనేందుకు ఏం చేయాలనే సమయస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. గ్రామీణ విద్య వ్యవస్థలో మార్పురావాలని 200914 మధ్య కస్తూర్బా పాఠశాల, మండలానికి ఒక మోడల్ పాఠశాల ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పక్షాన విద్యాసంవత్సరం ప్రారంభంరోజున దాదాపు 25 వేల పాఠశాలలు ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులు మంచిగా రాయటంతో పాటు మాట్లాడేశక్తిని నేర్చుకోవాలన్నారు. పాఠశాల ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. వారందరికి మంచి భవిష్యత్, ఉన్నత శిఖరాలకు ఎదగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 14న 'ఒబిసిల పోరుబాట'పుస్తకావిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరు రాష్ట్రాల్లో ఆరేళ్ల పాటు పరిశోధన చేసి, బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలను పొందుపరిచిన 'ఒబిసిల పోరుబాట' పుస్తకాన్ని ఈ నెల 14న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్లు జన అధికార సమితి అధ్యక్షులు చేరాల నారాయణ, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్‌లు 'ఒబిసిల పోరుబాట' పుస్తకాన్ని రచించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మహేశ్‌కుమార్ గౌడ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎంపిలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎపి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంఎల్‌సి దాసోజ్ శ్రవణ్, పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, బిసి సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరవుతారని వివరించారు. త్వరలోనే ప్రముఖ ఆన్‌లైన్, బుక్‌స్టాళ్లలో ఈ పుస్తకం అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సమితి కార్యదిర్శ పరికిపండ్ల సుమంత్, కార్యదర్శి కీర్తి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడితో బిసి నేతల భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ నియమిత పదవులలో, ప్రభుత్వ పదవులలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను బిసి సంఘాల నేతలు కలిసి అభినందించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం బుధవారం ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం అమలు కోసం కృషి చేస్తున్న టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో బడుగులకు న్యాయం చేసే దిశలో ఆలోచిస్తున్నారని తెలిపారు. ఇదే సమయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సమాచార కమిషనర్‌లో బిసిలకు అన్యాయం జరిగిందని, దీనిని తక్షణమే సరిదిద్ది, బిసిలకు సమాచారం కమిషనర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గంలో బిసి మంత్రులకు ప్రాధాన్యత గల శాఖలు కేటాయించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి రాష్ట్ర మంత్రివర్గంలో బడుగులకు ఏవిధంగా ప్రాధాన్యత కల్పించారో బిసి మంత్రులకు శాఖల కేటాయింపులలో కూడా అదే ప్రాధాన్యత కల్పించాలని శ్రీనివాస్ గౌడ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసిన బిసి ప్రతినిధుల బృందంలో బిసికుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, కో ఆర్డినేటర్ ఉప్పరి శేఖర్ సగర, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బిసి నేతలు జాజుల లింగం గౌడ్, ఐలీ వెంకన్న, సింగం నగేష్, శంకరాచారి, నిద్ర సంపత్, దుర్గయ్య, బండి గారి వెంకన్న గౌడ్, భరత్ ఉన్నారు

## నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ( ఐఎండి) హెచ్చరికల నేపథ్యంలో గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంతవరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచి ంచారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వివిధ జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, ఎన్‌డిఆర్‌ఎఫ్ (అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ, ప్రత్యేక పోలీస్ విభాగంలోని ఎస్‌డిఆర్‌ఎఫ్) సహాయంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక విభాగం డిజి, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ , నీటిపారుదల, ఆర్‌అండ్‌బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని, కమిటీ నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీ రాజ్ కమీషనర్ సృజన, టిజి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ ముషారఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి. ఐఎండి అధికారిణి నాగరత్నం, ఆదిలాబాద్ , భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షాకాల సీజన్ అనుకున్నదానికంటే 15 రోజుల ముందుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని ప్రకృతి వైపరీత్యాల ప్రభావం వీలైనంతవరకు తగ్గించేలా చర్య లు తీసుకోవాలని అన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రదేశాలలో జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హ ఠాత్తుగా వచ్చే వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయని, ముఖ్యంగా పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్క డి నుంచి శాశ్వతంగా తరలించి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## పిడి యాక్ట్

(మొదటి పేజీ తరువాయి)

తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/8 లో 10.33 ఎకరాలు, సర్వే నెంబరు 33/9 లో 13 ఎకరాలు, సర్వే నెంబరు 33/10 లో 6.33 ఎకరాల చొప్పున మొత్తం 30.28 ఎకరాల భూమిని 1968 లో టీఎల్వీ చారిటబుల్ ట్రస్ట్ కు భూ పట్టదారులైన తోటకూర ఎల్లయ్య యాదవ్, రామయ్య చౌదరి తదితరుల ద్వారా... సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సదరు భూమిని 1976 సంవత్సరంలో దేవాదాయ శాఖకు అప్పగించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ భూ మిని కాపాడుతూ వచ్చాయన్నారు. అయితే, ఈ భూములను కబ్జా చేసేందుకు కొంతమంది పని చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. దేవాదాయ శా ఖ భూములు కబ్జాకు పాల్పడిందే ఎవరైనా సరే వది లే ప్రసక్తే లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. అయినా, భూములను స్వాధీనం చేసుకొని కబ్జా దా రులపై పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. మంత్రి వెంట పర్యటించిన వారిలో బోడుప్పల్ మా జీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మేడిపల్లి తహసీల్దారు హసీనా, దేవాదాయ శాఖ సర్వేయర్లు, అధికారులు, కాం గ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ భూము లు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. చెంగిచెర్ల భూములు, 1976లో టీఎల్వీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేవాదాయ శాఖకు దక్కాయని గుర్తు చేశారు. అయితే, వీటిని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి విల్లాల నిర్మాణాలు చేపడుతున్న ట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మార్వోతో కలసి కొంతమంది నకిలీ సర్వే చేయించి అక్రమంగా సొంతం చేసుకునే ప్రయత్నం చేసినట్టు వివరించా రు. కాగా, తాజాగా ఏడీ సర్వే చేయించగా ఈ భూ ములన్నీ దేవాదాయ శాఖకు చెందిన భూములుగా తేలినట్టు మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. అయితే, ఈ కబ్జా అంశం, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, జంగయ్య యాదవ్... వరంగల్ వెళ్తున్న మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి కొండా సురేఖ వెనువెంటనే రెవెన్యూ, దేవాదాయ, పోలీసు అధికారులను పిలిపించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్తోనూ ఫోన్లో మాట్లాడారు. దేవాదాయ శాఖకి చెందిన ఈ 30 ఎకరాల భూములను రక్షించి బార్ కోడ్ చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### గత ప్రభుత్వంలో దేవుడి భూములపై నిర్లక్ష్యం

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవుడి భూ ములపై నిర్లక్ష్యం కొనసాగింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆలయ భూములపై ఫోకస్ పెట్టింది. ఎక్కడెక్కడ భూములున్నాయో... ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయో... అన్యాక్రాంతమైన జాగలెన్నో... అనే లెక్కలు తీశారు. రాష్ట్రంలో వివిధ ఆలయాల పరిధిలో మొత్తం 91,827 ఎకరాలున్నట్టు ఎండోమెంట్ గుర్తించింది. అందులో 25 వేల ఎకరాలు కబ్జా అయినట్టు నిర్ధారించింది. మరో 6 వేల ఎకరాలు ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్నట్టు తేలిందని దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.




## సంక్షేమ భవన్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, 12 ఎస్‌సి గురుకులాల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, గురుకుల విద్యార్థుల పట్ల వివక్ష చూపిస్తున్న గురుకుల సెక్రటరీని విధుల నుండి తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గ్యార నరేష్, రెహమాన్, కాసోజు నాగజ్యోతి, నాయకులు చైతన్య యాదవ్, సామిడి వంశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com